ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



ప్రఖర ప్రజ్ఞ

# యుగశక్తి  గాయత్రి

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః



సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి

సంపుటి 11 - సంచిక 10
**మార్చి 2010**
**విడిప్రతి రూ|| 10.00**
**సం|| చందా రూ|| 120**
**3 సం|| చందా రూ|| 350**
**10 సం|| చందా రూ|| 1116**

Please send drafts in favour of
**SRI VEDAMATA GAYATRI TRUST BUSINESS DIVISION, HYDERABAD**


## మన లక్ష్యం

క్షణికమైన భోగవిలాసాలకు, ఇంద్రియాలను తృప్తిపరచడానికి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవాల్సిన అవసరం లేదు. భోగ విలాసాలు అశాశ్వతమైనవి. ఈక్షణంలో ఉంటాయి; మరు క్షణం మాయం అవుతాయి. వాటి స్వరూపస్వభావాలు మారిపోతూనే ఉంటాయి. భోగవిలాసాలను అనుభవించినందువల్ల కలిగే తృప్తి, అనుభవించలేక పోయినందువల్ల కలిగే అసంతృప్తి మానవునికి విషాదాన్నే తెచ్చిపెడుతుంది. ఇలాంటి భోగభాగ్యాలు జీవనలక్ష్యం కాకూడదు. లక్ష్యం అంటే శాశ్వతమైనదిగాను, సర్వకాల సర్వావస్థలలోనూ ఉపకరించేదిగాను, అన్నివేళలా శాంతిదాయకంగానూ ఉండాలి.

ఒక పక్షి ఆకాశంలో తెల్లని మేఘాన్ని చూచింది. దాని దగ్గరకు చేరుకోవాలి అనుకుంది. శక్తి కొద్దీ ఎగిరింది. కానీ ఆ మేఘం గాలితో ఆడుకుంటూ ఒకసారి తూర్పుకు, మరొకసారి మడమరకు పరుగులు తీస్తోంది. ఇంకొకసారి అక్కడే గుండ్రంగా తిరుగుతోంది. ఎంత ప్రయత్నించినా పక్షి దానిని చేరుకోలేకపోయింది. చిట్టచివరకు గాలితాకిడికి తట్టుకోలేక మేఘం మటుమాయమయింది. పక్షికి అప్పుడు అర్థం అయింది. తాను ఎంచుకున్న లక్ష్యం అశాశ్వతమైనదని. లక్ష్యాన్ని ఎంచుకుంటే మేఘాన్ని కాదు, పర్వతాన్నే ఎంచుకోవాలి". అని ఒక గురువు గారు శిష్యులకు బోధించారు.

ఈ కథ మనందరి జీవితాలకు వర్తిస్తుంది. చాలామంది క్షణ భంగురమైన భోగాలను లక్ష్యంగా చేసుకుని జీవిస్తున్నారు. ఎండమావుల వంటి కోర్కెల వెంటపడి భ్రమలో చిక్కుకుంటున్నారు. ఒక్కసారి వివేకాన్ని మేల్కొల్పండి. శాశ్వతుడైన పరమాత్ముని లక్ష్యంగా తీసుకుని పయనం సాగించండి అప్పుడే మీ జీవితాలు ధన్యం అవుతాయి.


పత్రిక అందనివారు, పత్రికకు సంబంధించిన సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్లను సంప్రదించగలరు.
**(1) 9603509900 (2) 9032674117**


ఇష్టమైన పని లభిస్తే మూర్ఖుడు కూడా సులభంగా చేస్తాడు. - స్వామి వివేకానంద

# విషయ సూచిక


1. **సంపాదకీయం :**
   మన లక్ష్యం — 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :**
   ఆదర్శ జీవన రహస్యం — 2
3. **వేదమంత్రం :** సోమరితనాన్ని వెళ్లగొట్టాలి — 3
4. **వర్తమాన భారతం :**
   60 ఏండ్ల కోడెదూడ - మన గణతంత్రం — 4
5. **ఉపాసనకు రెండు పాదాలు : జపం-ధ్యానం**
   ధ్యానం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా? — 7
6. **పరమపూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది :**
   2400 కోట్ల మంత్రజపం — 8
7. **బాలల భవితకు బంగారు బాట-5 :**
   దేశ భక్తుడైన మహర్షి దయానందుడు — 9
8. **ధారావాహిక : ప్రజ్ఞోపనిషద్-4**
   ప్రథమ మండలం - ప్రథమాధ్యాయం — 10
9. **తత్వచింతన :** కాలచక్రంలో దాగిన విజ్ఞానం — 12
10. **ధారావాహిక : పరమేశ్వరుని చిరునామా-10**
    కోరినంతనే అభీష్ట సిద్ధి — 15
11. **మనం-మన ఆరోగ్యం :**
    ఆయుర్వేద సిద్ధాంతాలు-మన ఆరోగ్యం — 16
12. **ధారావాహిక : హనుమత్కథామృతం-23**
    బాలహనుమాన్‌పై వజ్రాయుధ ప్రయోగం — 19
13. **కుటుంబ నిర్మాణం :**
    యుగనిర్మాణంలో రెండవ చరణం-కుటుంబ నిర్మాణం — 21
14. **ధారావాహిక : భక్తిగాథ-28 :**
    భక్తునికి అహంకారం శోభను ఇవ్వదు — 24
15. **ప్రత్యేక వ్యాసం : మహావీర జయంతి సందర్భంగా**
    దీక్షాపరుడు - మహావీరుడు — 25
16. **పూజ్య గురుదేవుల అమృతవాణి-4**
    శౌర్యం - సాహసం — 26
17. **ఆధ్యాత్మిక విజ్ఞానం :** ఋషుల ప్రయోగశాల-యజ్ఞశాల — 28
18. **జీవించేకళ :** ధనాన్ని తలలో దాచుకో — 30
19. **ధారావాహిక : వృద్ధాప్యం-జీవిత నవనీతం-3**
    మృత్యు మహోత్సవానికి సన్నాహం — 31
20. **గాయత్రీమాత-24 శక్తిధారలు :** మందాకిని-9 — 36
21. **మహిళాజాగరణ :**
    ఇంకానా ఈ బంధనాలు — 37
23. **2010 వసంత పంచమి సందర్భంగా వక్తృత్వ పోటీలలో విజేతల భాషణలు :** క్రాంతి ధర్మీ సాహిత్యం — 38
22. **నా వారితో నా మాట : 2011-2012 (శతాబ్ది సం॥)**
    శతజయంతి ఉత్సవాల రూపురేఖలు-14 :
    2010 వసంత పంచమి - నూతన సంకల్పాలు — 41
24. ఏ పుస్తకంలో ఏమున్నది?
    సూక్ష్మీకరణ సాధన — 44
25. **వార్తలు** — 45




## సద్గురు వచనామృతం

## ఆదర్శ జీవన రహస్యం

"తన ఆలోచనలు ఎలా ఉంటే అలాగే రూపొందుతాడు మనిషి. ఆలోచన మూసలాంటిది, అలాంటి మూసలో జీవితం తడిసిన మట్టి. మనం ఎలాంటి ఆలోచనలలో మునిగి ఉంటామో మన జీవితం అలాగే మలచబడుతుంది. అలాగే ఆచరణ జరుగుతూ ఉంటుంది. అలాంటి సహచరులే దొరుకుతుంటారు. ఆ దిశలోనే సమాచారం, అభిరుచి, ప్రేరణ లభిస్తాయి. శరీరం, పరిస్థితులు, ప్రపంచం అన్నీ ఆలోచనల ఆధారంగా రూపొందుతాయి. వాటి రూపురేఖలు మన విశ్వాసాలకనుగుణంగా ఉంటాయి". ఇది అక్షర సత్యం. ఆంతరిక ఆలోచనలు శీలాన్ని, జీవితాన్ని తీర్చిదిద్దుతాయి. ఆలోచనలపైనే శీలం, జీవితం పూర్తిగా ఆధారపడి ఉంటాయి. కనుక మనిషి ప్రతి దినం చెడును కనీసంగా, మంచిని అత్యధికంగా అభ్యాసం చేయవలసి ఉంటుంది. ఆలోచనాపరుడై, దృఢప్రవృత్తి కలవాడై, తత్పరతతో ఉద్యమించి, క్రమక్రమంగా హృదయంలోని అన్ని చెడు ప్రవృత్తులను, చెడు ఆలోచనలను, వదిలివేయాలి. మంచి ప్రవృత్తులను నిరంతరం అభ్యాసం చేస్తూ ఉండాలి. ఈ పనిలో అతను శ్రేష్ఠమైన మనుషుల సంపర్కంలో ఉండాలి. శ్రేష్ఠమైన పుస్తకాలు చదవాలి. విషయాలను గురించి ఆలోచించాలి. శ్రేష్ఠమైన సంఘటనలను దర్శించాలి. శ్రేష్ఠమైన పనులు చేయాలి. ఇతరులలోని శ్రేష్ఠతలను గౌరవిస్తూ, ఆచరిస్తూ ఉండాలి. అనగా ఎల్లప్పుడూ శ్రేష్ఠమైన విషయాలపై శ్రద్ధ చూపాలి. అపుడు గొప్ప విజయం లభిస్తుంది. ఇలా చేయడం వలన అతను రోజు రోజుకూ అధిక బలవంతుడు, శ్రేష్ఠుడు, బుద్ధి కుశలుడుఅవుతాడు. అతడి జీవితం ఉజ్వలంగా, విశుద్ధంగా, శాంతి ప్రదంగా, ఆనంద మయంగా, మనోహరంగా రూపొందుతుంది.

*అఖండజ్యోతి, జూన్, 1952*

*అనువాదం ఊటుకూరు సత్యనారాయణ గుప్త*

## పండుగలు

**మార్చి 2010**

| | |
|---|---|
| 16-03-2010 | శ్రీ వికృతినామ ఉగాది |
| 24-03-2010 | శ్రీరామనవమి |
| 28-03-2010 | మహావీర్ జయంతి |

**ఏప్రిల్ 2010**

| | |
|---|---|
| 14-4-2010 | డా॥ బి.ఆర్. అంబేద్కర్ జయంతి |

**అన్ని పనులను ఇష్టమయ్యేలా చేసుకోవడమే తెలివిగలవాని పని. - స్వామి వివేకానంద**

వేద మంత్రం

# సోమరితనాన్ని దూరంగా వెళ్లగొట్టాలి.

యో జాగార తమృచః కామయన్తే యో జాగార తము సామాని యన్తి ।
యో జాగార తమయం సోమ ఆహ తవాహమస్మి సఖ్యే న్యోకాః ॥

*(ఋగ్వేద 5/44/14)*

**భావార్థం :** ఎవరు మేలుకొని ఉన్నారో, సోమరితనం అజాగ్రత్తల నుండి ఎల్లప్పుడూ జాగరూకతతో ఉన్నారో, వారికే ఈ ప్రపంచంలో జ్ఞానం, విజ్ఞానం ప్రాప్తిస్తాయి. వారే మహాపురుషులనబడతారు.

**సందేశం :** 'ఉత్తిష్ఠత జాగృత ప్రాప్యవరాన్ని బోధత'. లే! మేల్కొను! ధ్యేయం పొందేదాక ఆగబోకు. ఇది వివేకానందుని మూలమంత్రము. ఒక భజన ఉన్నది – "ఓ యాత్రికుడా సూర్యోదయం కాబోతున్నది లే! మేల్కొన్నవారికే లభిస్తుంది'. నియమమేమిటంటే – లేచి మేల్కొను. అప్పుడు మాత్రమే కొంత పొందగలుగుతావు. లేకపోతే ఈ మనుష్య జీవనమే వ్యర్థమవుతుంది. మొదట లే, తరువాత మేల్కొను – ఈ వరుస సరిగ్గా లేదనిపిస్తుంది. మనుష్యుడు మొదట మేల్కొంటాడు, తర్వాత ప్రక్క నుండి లేస్తాడు. కానీ కాదు. మనం నిజంగా మేల్కొన్నామా? అజ్ఞానం, సోమరితనం, అజాగ్రత్త, తమోగుణం యొక్క మత్తువలన మనకళ్ళు ఇంకా మూసుకునే ఉన్నాయి. మరి మనం మేల్కొన్నదెక్కడ? అత్యంత జాగృతం పరమేశ్వరుడు. అదే విధంగా మన శక్తి కొద్దీ ఎల్లప్పుడూ జాగృతంగా ఉందాం. ఎల్లప్పుడూ అప్రమత్తంగా, నడుం బిగించి ఉందాం. మన కర్తవ్యపాలనలో ఎన్నడూ సోమరితనానికి గురికాము. 'కల్ కరే సో ఆజ్ కరే. ఆజ్ కరే సో అబ్' (రేపు చేయాల్సింది. ఈ రోజు చెయ్యి. ఈ రోజు చెయ్యవలసింది ఇప్పుడే చెయ్యి). ఈ భావనతో ఎల్లప్పుడూ పనిపట్ల సమర్పణతో ఉద్యుక్తులమై ఉంటాం, అజాగ్రత్తగా ఉండం. ఈ విధంగా అభ్యాసం చేస్తూవుంటే, మనం పరమేశ్వరుని గుణాలను మనలో ధరించి, సాఫల్యపు మెట్లు ఎక్కుతాం.

ఈ ప్రపంచం జాగరూకులైన వ్యక్తులకోసం చేయబడింది. వారే సోమరితనం వదలి తమ పురుషార్థం చేత నిజమైన జ్ఞానం ప్రాప్తించు కొనుటలో సమర్థులవుతారు. జ్ఞాన విజ్ఞానాలతో అందరి సుఖశాంతి కొరకు అనేకానేక వస్తువులు తయారుచేస్తారు. సుఖం, శ్రేయస్సు, ఐశ్వర్యం అన్నీవారికే లభిస్తాయి. ప్రపంచంలో సమస్త సౌకర్యాలు వారికి సహజంగా లభిస్తాయి. సోమరులు సుఖసౌకర్యాల వెంబడి పరుగెత్తుతూ ఉంటారు. లాలస ఉంటుంది, కోరికలు ఉంటాయి – అయినా ఏదీ చేతికందదు. వారు తామసికపు మత్తులో పడి ఉంటారు. సాత్వికతామృతం వారికి అందనే అందదు. సోమరితనానికి మించి అధిక నష్టాన్ని కలుగజేసే, అధిక సమీపవర్తియైన శత్రువు మరొకటి లేదు. సోమరితనం అజాగ్రత్త వదలి 'నిరంతర కృషి'ని ఆశ్రయించకపోతే ప్రగతి సంభవం కాదు. పరమాత్మకృపను ప్రాప్తించుకోవడానికి ఆయన చరణాల వద్ద మన కృషి, సాహసం, ధైర్యం, బుద్ధి, శక్తి, పరాక్రమం అనే పూలను సమర్పించాలి. స్వయంగా పురుషార్థం చేసేవారికే భగవంతుడు సహాయం చేస్తాడు. వేదం యొక్క స్పష్టమైన ఘోషణ ఏమంటే – 'న ఋతే శ్రాంతస్య సఖ్యాయ దేవాః'.

కానీ నేడు స్థితి అత్యంత విషమం అవుతూ ఉన్నది. చిన్న చిన్న పిల్లలు, విద్యార్థులు కూడా తమ సమయాన్ని నిరర్థక విషయాలలో పాడుచేసుకుంటున్నారు. అశ్లీల సాహిత్యాన్ని ఆసక్తితో చదువుతున్నారు. తమ అభిప్రాయాలను కలుషితం చేసుకుంటున్నారు. వీరేకాదు. డాక్టర్లు, అధ్యాపకులు, వ్యాపారులు, రైతులు, కూలీలు, అధికారులు అందరిలో పని ఎగవేత, సోమరితనం రోగంలాగా బాగా వ్యాపిస్తున్నది.

సమాజం నుండి సోమరితనం అనే రాక్షసుణ్ని పారద్రోలడం బ్రాహ్మణుల కర్తవ్యం.

★★★

పని లేకపోయినా డబ్బున్నవాడు అదృష్టవంతుడు.

వర్తమాన భారతం

# 60 ఏండ్ల కోడె దూడ - మన గణతంత్రం

### పెరుగుతున్న ధరలు యక్షప్రశ్నలు వేస్తున్నాయి

"యుగశక్తి గాయత్రి" పత్రిక ఆధ్యాత్మిక పత్రికే. అయినా వ్యక్తికి ఆధ్యాత్మిక వికాసంతో పాటు సమాజానికి సమగ్రవికాసాన్ని అందిస్తోంది. 73 సంవత్సరాల క్రితం పరమ పూజ్య గురుదేవులు పండిత శ్రీరామ శర్మ ఆచార్య గారు యుగపరివర్తన కోసం 'అఖండ జ్యోతి' పత్రికను హిందీలో ప్రారంభించారు. దానికి అనుబంధ పత్రిక యుగశక్తి గాయత్రి. అఖండ జ్యోతి పత్రికతో సమానంగా 'యుగశక్తి గాయత్రి' అనేక సమస్యలను స్పృశిస్తూ ప్రజలను జాగృతం చేస్తూ ఉంది. ప్రజల యొక్క దైనందిన సమస్యలను కూడా చర్చిస్తూ ఈనాటి పత్రికలను అధిగమిస్తూ పయనిస్తోంది. గత మూడు సంవత్సరాల నుండి ప్రస్తుత సమస్యలకు ప్రాధాన్యతను ఇస్తూ "వర్తమాన భారతం" అన్న శీర్షికతో ప్రచురిస్తూ ఉన్నాం. దానిలో భాగంగా ప్రధానమైన సమస్య పెరిగిపోతున్న ధరల గురించి చర్చించడం జరుగుతోంది. ప్రతిక్రియకై ఎదురు చూడాల్సి ఉంది.

### స్వత్వాన్నే కోల్పోతున్నాం

మన గణతంత్రానికి 26.1.2010 నాటికి 60 సంవత్సరాలు నిండిపోయాయి. 61వ సంవత్సరం ఆరంభం అయింది. సమాచార పత్రికలు అన్నీ ఈ 60 సంవత్సరాలలో జరిగిన అభివృద్ధిని గురించి, లోపాలను గురించి వివరిస్తూ వ్రాశాయి. "ఆడంబరమైన వస్తు సామగ్రిలో మన స్వత్వాన్నే కోల్పోయాం" అన్న శీర్షిక మీద దృష్టి పడింది. అది నేరుగా హృదయాన్ని తాకింది. నిజం చెప్పాలంటే మన "ఎలక్ట్రాన్ మీడియా" దేశపు నలుమూలలా వ్యాపించి ఉన్నది. ఈ 'వస్తు సంస్కృతి' తన ప్రత్యేకతను చాటుకుంటూ ఉంది. చిన్న-పెద్ద నగరాలలో ప్రవేశించిన వస్తు సామగ్రిలో దేశీయత లేకుండా పోయింది. ఇటీవల కమ్ముకున్న ఆర్థిక మాంద్యం కారణంగా వస్తు సామగ్రి కుప్పలు పడిఉంది. అందువల్ల ఒక పెద్ద కంపెనీ బిగ్‌బజారులో 'ఒకటి కొంటే ఒకటి ఉచితం' అంటూ వ్యాపారం కొనసాగించింది. ఇక జనం ఎంతగా ఎగబడ్డారంటే పోలీసులు లాఠీచార్జీ చేయాల్సి వచ్చింది. ఒక చోట కాదు. అనేక చోట్ల ఈ దృశ్యాలు కనిపిస్తూ ఉన్నాయి.

### ప్రపంచీకరణం వ్యర్థం అయింది

భారతీయ మహిళలకు దైనందిన జీవితంతో, పెరుగున్న ధరలతో సంబంధం ఉంది. అయినా వారు ఈనాడు తమ బడ్జెట్‌ను తాము తయారుచేసుకునే స్థితిలో లేరు. గ్రామాలలో, నగరాలలో, మహానగరాలలో కనిపిస్తూ ఉన్న ఆసలైన భారతదేశం ఇదే. ప్రపంచీకరణ ప్రారంభించి 20 సంవత్సరాలు అవుతూఉంది. ఈ ప్రక్రియ యొక్క దుష్ప్రభావం సామాన్య మానవుని మీద, ప్రభుత్వం తలపెట్టిన సమాజ కల్యాణ కార్యాల మీద పడుతోంది. ఈ 20 సంవత్సరాలలో మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరణ ప్రభావానికి లోనైంది. దాని ఫలితమే ఈనాడు ఆకాశాన్ని అంటుతూ ఉన్న ధరలు. "ఈ మార్కెటింగ్ విధానం విజయాన్ని సాధించలేకపోయింది'' అన్న మాట వాస్తవం. మనం అనాలోచితంగా, గ్రుడ్డిగా పాశ్చాత్యదేశాలను అనుకరిస్తూ వస్తున్నాం. దానినే వికాసం అనుకుని మురిసిపోతున్నాం. అదే ఈనాటి మన అస్తవ్యస్తతకు మూల కారణం. ఇది స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండే ప్రారంభం అయింది. విదేశీ నీతియే మనరీతి అయిపోయింది. మహాత్మాగాంధీ ఆశించిన ఆత్మ విశ్వాసానికి దూరం అయ్యాం. ప్రతీ చిన్న విషయానికీ విదేశీ విధానాన్ని స్వీకరిస్తూ ఉన్నాం. ఈ కారణంగానే చైనా, రష్యా దేశాలు దెబ్బ తినడం చూసి కూడా మనం కళ్లు తెరవడం లేదు. ఇప్పుడు ఎక్కడ చూసినా "ప్రపంచీకరణ, ప్రపంచీకరణ" అంటూ మారు మ్రోగుతోంది. మన ఋషులు అందించిన విజ్ఞానాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాం. మన ప్రజల ఆకలి తీర్చదానికి నిత్యావసర వస్తువులను అధికమైన వెల చెల్లించి దిగుమతి చేసుకుంటున్నాం.

### కుటుంబపరంగా బజారు

మన సంస్కృతి కుటుంబ సిద్ధాంతాల మీద అధారపడి ఉంది. కానీ ఇప్పుడది అసమానత, లాభాపేక్ష, నల్లబజారు, పర్యావరణ కాలుష్యం, గ్రుడ్డిగా మొదలైన నగరీకరణ, పెరుగుతున్న పేదరికంతో పాటు పెరుగుతున్న ధరల చేతిలో చిక్కుకుని ఉంది.

**డబ్బులేకపోయినా ఆనందంగా ఉండేవాడు జ్ఞాని.**

ఆధ్యాత్మిక వికాససిద్ధాంతం అందరూ సమానంగా అభివృద్ధి చెందాలి అంటోంది. ఇదే విషయం మీద గ్రామాలలోనూ, మురికి వాడలలోనూ నివసిస్తూ ఉన్న సాధారణ మానవులు కూలీ నాలీ జనం కూడా చర్చిస్తూ ఉన్నారు. అయినప్పటికీ శ్రామికుడు కూడా పరిశ్రమల గూర్చే ఆలోచిస్తూ ఉన్నాడు. అధ్యాత్మిక వాదాన్ని, సమాజవాదాన్ని పూర్తిగా వదిలేశాం. చూస్తూ ఉండగానే ప్రపంచం అంతా సంచరిస్తూ ఉన్నాం. మార్కెటింగ్‌లో ఒక అంగంగా తయారయ్యాం. దాని పరిణామం చూస్తూనే ఉన్నాం. ఇప్పుడు మనది ఇండియానా? భారత దేశమా? ఏమని పిలవాలి? "మన గణతంత్ర గజం (ఏనుగు) తప్పుడు మార్గంలో నడుస్తోందా?" అన్న ప్రశ్నార్థకం మన ముందు సిద్ధంగా ఉంది.

20 రూపాయలలో రోజుగడుపుకునే వ్యక్తులు ఈనాడు మన దేశంలో 80 కోట్లమంది ఉన్నారు. ప్రతి రోజూ పట్టెడు మెతుకుల కోసం పోరాడుతూ ఉన్నారు. 1951 – 52లో తలసరి (పంట) ధాన్యం 394 గ్రాములు ఉంటే, 2007లో 407 గ్రాముల వరకు మాత్రమే వచ్చింది. మధ్యలో 1971లో కొంత పెరిగింది. ప్రపంచీకరణం ప్రారంభం కాగానే తగ్గిపోతూ వచ్చింది. "ప్రజలు గ్రుడ్లు, మాంసం, పాలు, పప్పు, కాయగూరలు మొదలైనవి బాగా తింటున్నారు అనీ, బలిష్ఠంగా తయారవడానికి యోగా అభ్యసిస్తున్నారు." అనీ కొందరు అంటూ ఉంటారు.

ఇండియా యొక్క ఏజెంట్లు 30 కోట్లమంది భారతదేశాన్ని ఆదృష్టితోనే చూస్తూ ఉంటారు. "పేదవారికి ఆకలి అయితే (రొట్టెకు) అన్నానికి బదులు బ్రెడ్ తినవచ్చు కదా!" అన్నాడట ఒక విదేశీ మంత్రి.

### అదుపుకాని ధరలు - పెరుగున్న నిస్సహాయత

ఆహార పదార్థాల ధరలు వశం కావడం లేదు. గత సంవత్సరం చివరలో ఈ వస్తువుల ధర పెరిగి పెరిగి 20% వరకు చేరుకుంది. గడిచిన ఒక్క సంవత్సరంలో బంగాళాదుంపల ధర రెట్టింపు అయింది. పప్పుల ధరలు 41% కన్నా ఎక్కువగా పెరిగిపోయాయి. కాయ గూరల ధరలు 47%, ఫలముల ధరలు 25% మించిపోయాయి. మధ్య తరగతి వ్యక్తి తన ఆదాయంలో ఒక పెద్ద భాగం ఈ విధంగా తిండికి ఖర్చు పెట్టాల్సి వస్తే, అతను ఇతరమైన వస్తువు ఏదీ కూడా జీవితంలో కొనలేడు. పంచదార ధర 45 రు.ల నుండి 48 రూపాయలవరకు పెరిగింది. పంచదార (ధరలో)లో పెరుగుతున్న చేదు ప్రతివారినీ బాధిస్తోంది. అన్నింటికన్నా తప్పనిసరి అయిన బియ్యం, గోధుమ పిండి ధర కిలో ఒక్కంటికి 18 నుండి 20 రూపాయల వరకు పెరిగిపోయింది. ఇలాంటి పరిస్థితిలో పంచదార కొనడం అనేది ఒక కలగా మిగిలిపోతోంది. మోసగాళ్లు, నల్లబజారు వాళ్లు నిర్భయంగా విజృంభిస్తూ ఉన్నారు. కల్తీ వ్యాపారం రెక్కలు విప్పుకుంది. నేరాలు, ఘోరాలు పెచ్చు పెరిగిపోతున్నాయి.

పైగా మన దేశంలోని పురోహితులు, జ్యోతిష్కులు కాకున్నా ఆహారపదార్థాల ధరలు ఏవి ఎంత పెరుగుతాయో, ఎంత తరుగుతాయో చెప్పుకుంటూ తిరుగుతూ ఉంటారు. ఆహార పదార్థాల ధరలు సరళం చేయలేని ప్రభుత్వం అసమర్థ ప్రభుత్వమే అయి తీరుతుంది. ఏమన్నా అంటే ప్రపంచీకరణ అంటూ ఉంటారు. ఇంకా అమెరికాలో ఎన్ని బేంకులు దివాళా తీశాయో, ఎంతమందికి ఉద్యోగాలు ఊడాయో, పశ్చిమ దేశాల ఆర్థిక వ్యవస్థ ఎలా మునిగిపోయిందో చెపుతూ ఉంటారు. దీనివల్ల సాధారణ మానవునికి ఏం ప్రయోజనం? అతనికి కావలసింది నిత్యావసర వస్తువులు. అతని దృష్టి అంతా ప్రభుత్వం పెట్టే అనవసరమైన ఖర్చుల మీదనే లగ్నం అవుతూ ఉంటుంది. తాను ఖర్చులు తగ్గించుకోకుండా, సామాన్యుని జేబుకు చిల్లిపెట్టడం జరుగుతోంది.

### ప్రమాదకరమైన పరిస్థితులు

ఒకప్పుడు కందులు, మినుములు, పెసలు, మైసూరు పప్పు మొదలైన పప్పుధాన్యాలు సామన్యులకు అందుబాటులో ఉండేవి. కాని ఇప్పుడు పప్పుల ధరలు 2 నుండి 27 రూపాయల వరకు పెరిగిపోయాయి. పెసరపప్పు కిలో 100 రు., కందిపప్పు96 రు.లు, మినపపప్పు 96 రు.లు, మైసూరు పప్పు 73 రు.లు గా పెరిగిపోయాయి. పాలు, చెక్కర, బెల్లం, మొదలైనవాటి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పల్లె ప్రజలు, పట్టణవాసులు అన్న తేడా లేకుండా సామాన్య ప్రజలందరూ ఏం తినాలి? పెరుగుతున్న ధరల గురించి గృహిణులంతా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించుమని మొరపెట్టుకున్నారు. కాండ్లా ఓడరేవులో దాదాపు పదిలక్షల మెట్రిక్ టన్నుల ముడి చెక్కర రెండు మూడు నెలల నుండి నిలవ ఉంది. అది ఎందుకూ పనికి రాకుండా పోతున్నా గాని సామాన్య మానవునికి

**ఆనందం లేకపోయినా తృప్తిగా జీవించేవాడు గుణవంతుడు.**

అందించలేకపోతున్నారు. వేర్వేరు ప్రాంతాలవారి వేర్వేరు రాజనీతిలోని దోషాలు సామాన్య మానవుని పట్టి పీడిస్తున్నాయి. మనదేశంలో ఆహార పదార్థాలు వ్యర్థం అయినంతగా ఇంకెక్కడా అయి ఉండవు. సరి అయిన వ్యవస్థ లేకుండా పోతున్నది.

### ఏం చేయాలి ?

ఈ పరిస్థితిలో ఏం చేయాలి? ప్రజలలో చైతన్యాన్ని కలిగించాలి. అన్నింటికన్నా ముందుగా పరిస్థితులను అదుపు చేయాలి. ఒకే ధర్మం, ఒకే సమాజంలో వేర్వేరు ప్రయోగాలు ఫలించవు. ఆపద్ధర్మంగా ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలి. అంటే స్వార్థం అనే కూపం నుండి వెలికి తీయాలి. ఆకలి చావులు, పేదరికం, అసమానతలు, అధిక ధరలు మొదలైనవాటితో పోరాడాలి. సామాజిక, ఆధ్యాత్మిక సంగఠన చేయాలి. అతివ్యయంతో కూడుకుని ఉన్న ప్రదర్శనలను, వివాహాలను నివారించే చట్టం కోసం పోరాడాలి. ప్రభుత్వం తలపెట్టిన విందులు – వినోదాలను ఆపగలగాలి. మనమంతా కలసి ప్రజల హృదయాలను స్పందింపచేయాలి. ప్రపంచీకరణం, ధరల పెరుగుదల మొదలైన వాటిని ప్రక్కకుపెట్టి, రాబోయే మూడు సంవత్సరాలకు కావలసిన రణ నీతిని తయారు చేసుకోవాలి.

### వ్యవసాయానికి ప్రాముఖ్యత

మన దేశం వ్యవసాయ ప్రధాన దేశం అన్న మాటను మరచిపోరాదు. దేశానికి హాని చేసేనీతిని, రీతిని ఎదుర్కోవాలి. వ్యవసాయ క్షేత్రంలో అభివృద్ధిని తీసుకురావాలి. వ్యవసాయ భూములను పట్టణాల నిర్మాణానికి వినియోగించరాదు. వ్యవసాయంలో స్వావలంబన కావాలి. తినడానికి ధాన్యమే లేకపోతే మాంద్యంతో కృశించిపోతున్న దేశాలు మనకు ఏ సహాయమూ చెయ్యలేవు. ఎలాంటి పరిస్థితుల్లో కూడా సామాన్య మానవుని దృష్టిలో పెట్టుకుని నిత్యావసర వస్తువులను అందించగలగాలి. మనం కూడా మన అవసరాలను సాధ్యమైనంతగా తగ్గించుకోవాలి. బ్రాహ్మణోచిత జీవితాన్ని జీవించాలి. మన పూర్వ ప్రధాని శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి చెప్పిన విధంగా వారానికి ఒక రోజు ఉపవాసం ఉంటే కొన్ని కోట్ల మందికి ఒక పూట భోజనం పెట్టగలుగుతాం. భారత్ – పాకిస్తాన్ యుద్ధసమయంలో ఇలా పాంచడం కూడా జరిగింది.

### ఇంకా చేయవచ్చు

ఇంకా కొన్ని ప్రయోగాలు చేయవచ్చు. సిగరెట్ త్రాగటం, మద్యపానం అలవాటు ఉన్నవారు తమ వ్యసనాన్ని వదులుకుంటే ఎంత డబ్బును మిగల్చవచ్చో ఊహకు అందడం కష్టం. ఇలాంటి వారు మన దేశంలో లక్షల సంఖ్యలో ఉన్నారు. ఇంకా అనేక విధాలైన దుర్వ్యసనాలను వదిలేసి, ఆధనాన్ని సఫలం చేసుకోవచ్చు. స్విస్ బేంకులో భారతీయుల ధనం 1500 అరబ్ డాలర్లు మూలుగుతూ ఉన్నాయి. (అరబ్=100 కోట్లు) ఆ ధనమే గనుక భారత్‌కు వస్తే, తేగలిగితే విదేశాలనుండి ఋణ విముక్తులం కాగలుగుతాం. ప్రజలకు పంచినట్లైతే ఒకొక్కరికి 40,000 రూ కన్నా ఎక్కువగా లభిస్తుంది. బేంకులో వేసుకుంటే దీని వడ్డీ భారతదేశ సంవత్సరాదాయానికి $2^1/_2$ రెట్లు అధికంగా లభిస్తుంది. దానితో గోవులను, గ్రామాలను వృద్ధి చేసుకోవచ్చు. దేశంలో ప్రతి ఒక్క వ్యక్తి తన కాళ్లపై తాను నిలబడవచ్చు. స్వామి వివేకానంద చెప్పిన మంత్రం మరొక్కసారి మననం చేసుకుందాం.

**ఉత్తిష్ఠత–జాగ్రత–ప్రాప్యవరాన్నిబోధత**

### అడవిపూలు

*ఒకరోజున పండిత జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి మాట్లాడుకుంటున్నారు. మాట మధ్యలో శాస్త్రిగారిని నెహ్రూ "అడవిపువ్వు" అన్నాడు. దానికి వెంటనే శాస్త్రిగారు "పండిత్ జీ! అడవిపువ్వుకున్న స్వేచ్ఛ తోటలోని పువ్వులకు ఎక్కడుంటాయి?" అన్నారు.*

*"కాని తోటలోని పూలు దైవపూజకు ఉపకరిస్తాయి. అవి భగవంతుని నెత్తిమీద అమర్చబడతాయి." అన్నాడు నెహ్రూ*

*చిరుదరహాసాన్ని చిందించారు శాస్త్రి గారు. "తోటలోని పూలు దేవతల శిరస్సుమీద కూర్చోవటం మినహా ఇంకేమి చేస్తాయి? అడవి పూలు విశ్వకల్యాణానికి కావలసిన సుగంధాన్ని వ్యాపింపచేస్తాయి. పూలు కేవలము దేవతల కొరకే పూయడం లేదు కదా! మిగిలిన జీవులన్నీ తుచ్ఛమైనవా?" అన్నారు.*

**స్వేచ్ఛవల్ల కలిగే ఆనందం, స్వాతంత్ర్యానుభూతి కోరేవాడు మూల్యం చెల్లించక తప్పదు. - నేతాజీ**

ఉపాసన - రెండు పాదాలు : జపం-ధ్యానం

# ధ్యానం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా?

ఏకాగ్రత అనేది ఒక అద్భుతం. ఒక మెస్మరిజం. ఒక హిప్నాటిజం. ప్రయోగకర్త తన దృష్టిని ఒక బిందువుపై కేంద్రీకృతం చేయడానికి అభ్యాసం చేస్తాడు. తన ఇచ్ఛాశక్తిని సమీకరించి లక్ష్యంగా ఉన్న కేంద్రంలో ప్రవేశింపచేస్తాడు. ఫలితంగా గారడీ వంటి శక్తి ఉత్పన్నం అవుతుంది. దానిద్వారా ఇతరులను సమ్మోహితులను చేస్తాడు. వారిని తన ఇష్టానికి అనుకూలంగా తయారుచేసుకుంటాడు. వారిలో అవసరమైన మానసిక పరివర్తనను తీసుకుని వస్తాడు. ప్రాణ విద్యద్వారా శారీరిక, మానసిక చికిత్స జరుగుతుంది. దానిద్వారా అనేక కఠిన కార్యాలు పూర్తి చేయబడతాయి. ఇవన్నీ కూడ ఏకాగ్రత యొక్క అద్భుతాలే అని చెప్పక తప్పదు.

భూమిని చూడగానే మట్టి ధూళితోకప్పబడి నిరర్థకమైన వస్తువుగాకనబడుతుంది. దానిని త్రవ్వినప్పుడు ఒక దాని వెంట ఒకటి అత్యంత విలువైన వస్తువులు లభిస్తూ ఉంటాయి. కొంతవరకూ తవ్వగానే మొట్టమొదట నీరు వస్తుంది. నీటి విలువ, దాని అవసరం గూర్చి ప్రత్యేకంగా చెప్పాల్సింది ఏమీ లేదు. మరికొంతలోతుకు వెళ్తే అనేక రసాయనిక పదార్థాలు, ధాతువులు, రత్నాలు, గేస్, ఆయిల్, వెండి, బంగారం లాంటి చాలా విలువైన వస్తువులు దొరుకుతాయి. ఇదంతా జరగాలంటే లోతుకుతవ్వుకుంటూ పోవడానికి పదునైన (మొనగలిగిన) వస్తువు కావాలి. అదే విధంగా ఏకాగ్రతవల్లనే శక్తులను ఏకీకరణం చేయగలుగుతాం. అంతరంగంలోనికి చొచ్చుకుపోయిన కొద్దీ దాచబడిన, అత్యంతవిలువైన శక్తులు మనోదృష్టికి కనిపిస్తాయి. సాధారణమైన జీవితంలో అసాధారణ విశేషతలు, వాటివల్ల ప్రాప్తించే ఫలితాలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయి. భూమిలో విలువైన వస్తువులు లభించినట్లే, ఏకాగ్రత యొక్క శక్తి వల్ల వ్యక్తిత్వంలో కలసి ఉన్న గుణకర్మ స్వభావాలతో పాటు బలము, బుద్ధి, విద్య, మైత్రి, కీర్తి, ప్రతిభ లాంటి ప్రత్యేకతలు అధిక పరిమాణంలో లభిస్తాయి.

ధ్యానయోగం యొక్క ప్రధాన లక్ష్యం మనస్సును స్థిరంగా ఉంచుకోగలగడం. ఒకే ఆలోచనా బిందువు వద్ద కేంద్రీకృతం చేయడం. ఈ ప్రయోగంలో లభించిన ఫలితాన్ని బట్టి లక్ష్య భేదనలో తీవ్రత ఉత్పన్నం అవుతూ ఉంటుంది. శబ్ద భేది బాణంలాగా లక్ష్య భేదన చేయగలుగుతాడు. అధ్యాత్మ అతని లక్ష్యం అయితే ఆ క్షేత్రంలో ఆశా జనకమైన ప్రగతి కనిపిస్తుంది. భౌతిక ఉన్నతి లక్ష్యం అయితే అందులోనూ తగిన ఉన్నతిని సాధించవచ్చు. లక్ష్యం ఏదైనా ఏకాగ్రతతో సాధన జరగాలి.

వాన నీళ్ల ప్రవాహాన్ని నిరోధించి అడ్డుకట్టలువేస్తాం. తర్వాత అదే పెద్ద జలాశయం అవుతుంది. ఆ జలాశయం నుండి చిన్న చిన్న కాలువలు త్రవ్వి పంటపొలాలకు నీటిని అందిస్తాం. ఆ కాలువలే అధికంగా వర్షాలు పడగానే కట్టలు తెంచుకుని ప్రవహిస్తాయి. ఫలితంగా వరదలు ముంచెత్తుతాయి. వరదల వల్ల భారీ నష్టాలు ప్రాప్తిస్తాయి. అదే విధంగా మస్తిష్కంలో ఆలోచనా ప్రవంతి బయలు దేరుతుంది. అది ఒక విద్యుత్ కేంద్రంకన్నా శక్తివంతమయింది. దాని నుండి ప్రారంభమైన ఆలోచనలు ప్రారంభంలో ఇల్లు, కుటుంబం వరకే పని చేస్తాయి. తరువాత మెల్లగా విస్తరించి సమాజం నుండి ప్రాకుతూ సమస్త ప్రపంచాన్ని ప్రభావితం చేస్తాయి. ఆ ఆలోచనలను సరి అయిన మార్గంలో పెట్టకపోతే వరదలాగా భీభత్సం సృష్టిస్తాయి.

ఇదంతా ధ్యానం యొక్క అద్భుత సామర్థ్యం వల్లనే సిద్ధిస్తుంది. ఉపాసనలో ధ్యానం ఒక భాగం. విధి విధానాలలో కొద్దో గొప్పో తేడాలు కనిపించినా అంతిమలక్ష్యం ఈశ్వర ప్రాప్తిమాత్రమే.

*అనువాదం - ఊటుకూరి సత్యనారాయణగుప్త*

**బాధలు-బాధ్యతలు స్వీకరించడానికీ, సుఖాలను త్యాగం చేయడానికీ మూల్యం అక్కరలేదు. - నేతాజీ**

# పరమపూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది-2400 కోట్ల మంత్రజపం

కారణజన్ములైన పరమపూజ్య గురుదేవులు గాయత్రీ మంత్రజపం ద్వారానే విజయాలు సాధించారు. వారి జన్మ శతాబ్దినాటికి మనం అంటే దక్షిణ భారత విభాగం 2400ల కోట్ల గాయత్రీ మంత్రజపాన్ని సామూహికంగా నిర్వహించి గురుదక్షిణగా సమర్పించాలన్న నిర్ణయం జరిగింది. ఇప్పటికే అనేకచోట్ల ప్రారంభింపబడింది. పరిజనులందరు రోజుకు మూడు మాలలు మంత్ర జపం చేయాలి. మీమీ బంధుమిత్రులను ప్రభావితం చేసి వారిచేత జపం చేయించాలి. ఏ రోజైనా ఏ కారణంగానైనా చేయలేకపోయినట్లైతే మరియొకరోజు పూర్తి చేసుకోవచ్చు. సగటున రోజుకు మూడు మాలలు వచ్చేలా చూసుకోవాలి. మూడు మాలలకన్నా ఎక్కువ చేయగలిగితే మరీమంచిది. మూడుమాలలు చేయలేనివారు కనీసం ఒక్క మాలైనా చెయ్యాలి.

**ముఖ్యగమనిక :** ప్రముఖ కార్యకర్తలు, పరిజనులు తమతమ ప్రదేశాలలోని పాఠశాలలకు పర్యటించి విద్యార్థుల చేత కనీసం 10-15 నిమిషాలు మంత్రజపం చేయించాలి. ఇప్పటికే చీరాలలోని ఒక పాఠశాలలో చేయించుచున్నారు. "విద్యార్థులలో జ్ఞాపకశక్తి పెరిగింది. ఏకాగ్రత కుదిరింది. బుద్ధివికసించింది. ప్రవర్తనం మారింది" అని తెలియచేశారు. కనుక మన ప్రయత్నం ఆ వైపుగా సాగాలి. లెక్కింపు సౌకర్యార్థం క్రింద ఒక పట్టిక ఇవ్వబడింది. దానిలో 31 గడులు ఉన్నాయి. ప్రతిరోజు ఆ రోజు చేసిన మాలల సంఖ్యను ఒక్కొక్క గడిలో వెయ్యాలి. చేయనిరోజు డాష్ పెట్టాలి. నెలపూర్తికాగానే క్రింది ప్రొఫార్మాను నింపి క్రింది చిరునామాకు పంపాలి. ఈ పేజిని చింపుకొని నింపవచ్చు. లేకపోతే స్వయంగా తయారుచేసుకోవచ్చు.

*శ్రీ కె.పి.విఠల్, 48 LIG-II, బి.కె.గూడా,*
*సంజీవరెడ్డినగర్, హైదరాబాద్-500 038*
*ఫోన్ : 040-23705749, సెల్ : 9989655310*

ఇట్లు
మీ
అశ్విని సుబ్బారావు
*(విశ్వగాయత్రీ పరివార్-దక్షిణ భారత సంయోజకులు)*

**2400ల కోట్ల సామూహిక గాయత్రీ మంత్రజపము**

*తేదీ ........................ నుంచి .................. వరకు*

*నెం :* *పూర్తి జప మాలల సంఖ్య :* [ ]

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | *ప్రతిరోజు మీరు మంత్రజప మాలల సంఖ్యను పైన ఇచ్చిన గడులలో రాయండి* | | | | |

*పేరు :* ..............................................................

*గోత్రము :* ..........................................................

*చిరునామా :* ......................................................

..............................................................................

..............................................................................

*పుట్టిన రోజు మరియు వివాహదినము :* ........................

..............................................................................

*ఫోన్ :* ..............................................................

*యుగశక్తి గాయత్రి మాసపత్రికకు క్రొత్త చందాదారులను చేర్పించండి.*

**చిరునవ్వుఎంత కష్టమైన పనినైనా సుసాధ్యం చేస్తుంది.**



## బాలల భవితకు బంగారు బాట-5

# దేశభక్తుడైన మహర్షి దయానందుడు

125 సంవత్సరాల క్రిందటిమాట. గుజరాత్ ప్రాంతంలోని టంకారా అనేపేరుగల గ్రామంలో ఒక శిశువు జన్మించాడు. అతని పేరు మూలశంకర్. తండ్రి అంబాశంకర్. ఆయన గొప్ప శివభక్తుడు. మూలశంకర్ పదేండ్ల వయస్సుకు వచ్చాడు. మహాశివరాత్రి పర్వం వచ్చింది. తండ్రి కుమారుని పిలిచాడు. "నాయనా! మొదటి నుండి మన వంశం శివభక్తితోనే తరించింది. ఈరోజు శివరాత్రి. నువ్వుకూడా మాతోపాటు శివరాత్రి వ్రతం చెయ్యి" అన్నాడు. మూలశంకర్ తండ్రి మాట ప్రకారం ఆరోజు ఏమీ ఆహారం తీసుకోలేదు. కటిక ఉపవాసం చేశాడు. రాత్రికాగానే తండ్రితోకలసి శివాలయానికి వెళ్ళాడు. అందరూ శివుని ఆరాధించి భజనలు చేశారు. నైవేద్యాలు సమర్పించారు. ఉండగలిగినంతసేపు జాగారం చేశారు. మెల్లగా నిద్రలోకి జారుకున్నారు. తండ్రి అంబాశంకర్ కూడ నిద్రపోయాడు. కాని మూల శంకర్ నిద్రపోలేదు. కళ్ళమీద నీళ్ళు చల్లుకుంటూ భజన చేస్తున్నాడు. ఇంతలో ఒక చిట్టెలుక వచ్చింది. శివలింగం మీద పెట్టిన నైవేద్యాన్ని తినడం మొదలు పెట్టింది. మూలశంకర్ మనస్సులో అనేకమైన ఆలోచనలు తలెత్తాయి.

"నేను ప్రొద్దుటినుండి ఏమీ తినకుండా, త్రాగకుండా ఉపవాసం చేశాను. ఎందుకు? శివుని అనుగ్రహం కోసమే కదా! తన ఆహారాన్ని తాను రక్షించుకోలేని శివుడునాకేమి రక్షణ ఇస్తాడు? నెత్తిమీదకెక్కిన ఎలుకను తోలుకోలేని దేవుడు నా అవసరాలను ఎట్లా తీరుస్తాడు? ఈ చేతగాని వానికోసం ఉపవాసం ఉండడం అనవసరం" అనుకున్నాడు. తండ్రిని నిద్రలేపాడు. తన సందేహాన్ని విప్పి చెప్పాడు. సమాధానం కావాలన్నాడు.

"నాయనా! ఈ లింగం శివుని మూర్తిమాత్రమే. అసలైన శివుడు కైలాసంలో ఉంటాడు. మనకెవ్వరికీ కనిపించడు. కనిపించకుండానే అందరినీ రక్షిస్తూ ఉంటాడు. అందుకే ఆయన మూర్తికి పూజలు చేస్తాం" అని సమాధానం చెప్పాడు తండ్రి. తండ్రి అనుమతి తీసుకుని ఇంటికి వెళ్లాడు. శివుని మీద నమ్మకం తగ్గింది కాబట్టి ఆకలి అవడం మొదలు పెట్టింది. అమ్మనడిగి అన్నం పెట్టించుకుని తిన్నాడు. హాయిగా నిద్రపోయాడు. నిద్రలో కూడా ఒక్కటే ఆలోచన. నిజమైన శివుడిని చూడాలి అని నిర్ణయించుకున్నాడు.

కొన్ని రోజుల తర్వాత అతని చిన్న చెల్లెలు మరణించింది. అందరూ గుండెలు పగిలేలా ఏడుస్తున్నారు. కాని మూలశంకర్‌కి ఏడుపు రాలేదు. మృత్యువు నుండి రక్షించుకోవడం ఎలా? అని ఆలోచిస్తూ నుంచున్నాడు.

మరి కొన్నాళ్ళకు వాళ్ళ చిన్నాన్న చనిపోయాడు. ఆయన మూలశంకర్‌ని చాలా ప్రేమగా చూచేవాడు. ఆయన ఎడబాటును తట్టుకోలేకపోయాడు. మరల మరొక్క నిర్ణయం తీసుకున్నాడు. మృత్యువును జయించి తీరాలి అనుకున్నాడు. ఆరోజు నుండి అన్ని విషయాలలో ఉదాసీనంగా ఉంటున్నాడు. స్నేహితులు వస్తే ఇవే విషయాలు ప్రస్తావించేవాడు. యోగులు కనిపిస్తే చాలు "మృత్యువును జయించే ఉపాయం చెప్పమనే వాడు. నిజమైన శివుని చూచారా? అని ప్రశ్నించేవాడు. చూస్తూ ఉండగానే 20 సంవత్సరాల వయస్సు వచ్చేసింది. కాని ఆలోచనలలో మార్పురాలేదు.

అతని స్థితిని గమనించిన తల్లిదండ్రులు పెండ్లిప్రయత్నాలు మొదలు పెట్టారు. పిల్లవాడు పెండ్లివద్దని మొండికెత్తినా వినకుండా ముహూర్తాలు పెట్టించారు. మూలశంకర్‌కు ఏం చెయ్యాలో తోచలేదు. ఎవరికీ చెప్పకుండా ఇల్లువదలి వెళ్ళిపోయాడు. మధురకు చేరుకున్నాడు. సన్యాసం తీసుకున్నాడు. మహాపురుషులకు సేవలు చేశాడు. వారినుండి ఎంతోకొంత జ్ఞానాన్ని సంపాదించాడు. అయినా ఆయనకు సంతృప్తి కలుగలేదు.

చిట్టచివరకు అంధుడైన విరజానందస్వామి దగ్గరకు చేరుకున్నాడు. మధురలో ఆయనను సేవిస్తూ అక్కడే ఉండిపోయాడు. ఆయన శరీరం చాలా దృఢంగా తయారయింది. చాలా ఆరోగ్యంగా, అందంగా తయారయ్యాడు. అప్పటికి 37 సంవత్సరాల వయస్సు వచ్చింది. అతని బ్రహ్మచర్య దీక్షగురించి, అతని బలిష్ఠమైన శరీరాన్ని గురించి అనేక విధాలుగా చెప్పుకునేవారు. రోడ్డుమీద వంచిన తల ఎత్తకుండా నడిచిపోయేవాడు. చిన్నపిల్ల ఎదురుగా వచ్చినా సరే తల్లిలా భావించి అమ్మా! అని నమస్కరించేవాడు. మెల్లమెల్లగా దేశభక్తుడైన మహర్షిగా ఖ్యాతిగాంచాడు. ఆర్యసమాజాన్ని స్థాపించి ఎనలేని కృషి చేశాడు. బాలలూ! మహర్షి అంటే కేవలం ముక్కు మూసుకుని తపస్సుచేయడమే కాదు అని తెలిసిందికదూ!

**నీతి:** *మునులమఋషులమటంచున్*
*పనులను వీడుచు వనముల పరుగులు ఏలా?*
*జనులకు సేవలు చేయక*
*మనుటయు తగదిక మనుజుడు మహిలో బాలా!*

**మనిషిలోని మంచితనాన్ని గ్రహించే శక్తి సమాజానికి ఉండాలి.**

ధారావాహిక : ప్రజ్ఞోపనిషద్-4

# ప్రథమ మండలం - ప్రథమాధ్యాయం

*విభీషికాస్తు విశ్వస్య దూరీకర్తుం పునర్భువి*
*స్వర్గ్యవాతవృతిం కర్తు క్షమానాం దేవతాత్మనామ్* (76)

*మానవానాం తు సమ్భూతిః కఠినా కిన్తు తత్ర యే*
*యోగదానరతాస్తేషాం శ్రేయః సౌభాగ్యసంభవః* (77)

**టీకా:–** విశ్వంలోని భయంకర పరిస్థితులను రూపుమాపి పృథ్విపై స్వర్గీయ వాతావరణం తయారు చేసే దేవ మానవులను తయారుచేయటం కఠినమైనదే. కాని దీనిలో పాల్గొనేవారికి లభించే శ్రేయస్సు, సౌభాగ్యం తక్కువేమీ కాదు.

మానవుడు భౌతికంగా ప్రకృతి వైపరీత్యాలకు, ప్రమాదాలకు మూలకారకుడు అవుతున్నాడు. అంతకన్నా ఎక్కువగా అతని భ్రష్ట ఆలోచనలు, నికృష్ట నిర్ణయాలు ప్రకృతిని సర్వనాశనం చేసివేస్తున్నాయి. చివరకు జరిగేది ఏమంటే వికటించిన ప్రకృతి మానవజాతినే సర్వనాశనం చేసివేస్తుంది.

యుగ పరివర్తన సమయంలో అంతా తల్లకిందులు అయిపోతుంది. రాక్షసత్వం జీవన్మరణ సమస్యలో పడిపోతుంది. చిట్టచివరకు దైవత్వం రాక్షసత్వాన్ని అణచివేస్తుంది. భూమిమీదకు స్వర్గాన్ని తీసుకుని వచ్చే ప్రయత్నంలో అనేక కష్టాలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఇది చాలా కష్టతరమైనదే. కాని అసంభవం మాత్రం కాదు. గతంలో కూడా యుగపరివర్తనా సమయంలో ఇలాంటి సంఘటనలు అనేకం జరిగాయి. ఇలాంటి సమయంలోనే ముందుకు వచ్చిన దేవమానవులు సమాజానికి సహకరించి ధన్యులు అవుతారు. మానవత్వం కృతార్థత చెందుతుంది.

ప్రజ్ఞావతారుని దివ్య సత్తాయే ఈ కార్యానికి ప్రముఖ స్థానాన్ని స్వీకరిస్తుంది. అయినప్పటికీ ఒంటరిగా సమర్థించడం సాధ్యం కాదు. సైన్యం యొక్క సహకారం లేకుండా సేనాపతి ఒక్కడే యుద్ధం చేయలేడు కదా! వ్రేళ్లు లేకుండా చెయ్యి ఒక్క పని కూడా చెయ్యలేదు. పది వ్రేళ్లతోపాటు 28 కణుపులు కూడా చేతికి సహకరించాల్సి ఉంటుంది.

*జాగృతాత్మవతామేతం సందేశం ప్రాపయాస్తు మే*
*నోపేక్ష్యేను పమః కాలః క్రియతాం సాహసం మహత్* (78)

*మహాన్తం ప్రతిఫలం లబ్ధ్వా కృతకృత్యా భవన్తు తే*
*జన్మన ఇదమేవాస్తి ఫలముద్దేశ్యరూపకమ్* (79)

*అగ్రగామిన ఏవాత్ర ప్రజ్ఞాసంస్థాన నిర్మితౌ*
*ప్రజ్ఞాభియాన సూత్రాణాం యోగ్యాః సంచాలనే సదా* (80)

**టీకా:–** జాగృత ఆత్మలకు నా ఈ సందేశం అందించాలి. వారు ఈ అవకాశాన్ని జారవిడుచుకోకూడదు. గొప్ప సాహసం చెయ్యాలి. గొప్ప ప్రతిఫలాన్ని సాధించుకోవటంలో కృతకృత్యులవ్వాలి. ఇదే వారి జన్మ ఉద్దేశ్యం. అగ్రగాములైన వారిని ప్రజ్ఞా సంస్థానముల నిర్మాణంలోను ప్రజ్ఞా అభియాన్ సంచాలన లోను కలుపుకోవాలి.

చైతన్య వంతులు ఎన్నడూ అవకాశాన్ని జారవిడుచుకోరు. వారు జన్మకు మూలకారణాన్ని పూర్తి చేయకుండా విశ్రాంతి తీసుకోరు. ప్రకృతి ధర్మాలను అవగాహన చేసుకుంటారు. యుగ పరివర్తనకు సహాయపడతారు. కర్తవ్యాన్ని మరచి ప్రవర్తిస్తున్నవారు. వీరిని చూచి పశ్చాత్తాపపడతారు. క్రమంగా స్ఫూర్తిని పొందుతారు.

*సాహసాదర్శరూపా యే చేతనాముచ్చభూమికామ్*
*నిజేన బలిదానేన త్యాగేనోచ్చాభవన్తి యే* (81)

*ఆత్మ సంతోషమాసాద్య లోక సమ్మానమేవ చ*
*దైవానుగ్రహలాభం చ కృతకృత్యా భవంతి తే* (82)

**టీకా:–** ఆదర్శం, సాహసం గల వ్యక్తులు తమ త్యాగ బలిదానాల వల్ల ఉచ్చస్తరీయ చేతనత్వం పొందుతారు. ఆత్మ సంతోషం, లోక సన్మానం, దైవీ అనుగ్రహం అనే మూడు లాభములు ప్రాప్తించుకుంటారు, ధన్యులౌతారు.

నూతన సృష్టికి సర్వస్వాన్ని అర్పించిన వారు ఎప్పుడూ దేనినీ కోల్పోరు. భగవంతుని కార్యంలో లీనమైనవారు అసాధారణమైన మూడు లాభాలను పొందుతారు. అవి ఒకదానికి మరొకటి ప్రతి క్రియలుగా ఉపయోగపడతాయి. ఆదర్శవాదంతో సాహసాన్ని చూపుతారు. దాని ద్వారా అంతరిక ఆనందాన్ని అనుభవిస్తారు. బహిరంగంగా సన్మానాలు పొందుతారు. ఇతరుల నుండి సహకారాన్ని అందుకుంటారు. ఇలాంటివారి మీదనే దైవకృప విస్తారంగా ప్రసరిస్తుంది. వారు ధన్యులు అవుతారు.

**మన క్రియల్లో భౌతికవాదం ఉన్నప్పటికీ, కోర్కెల్లో ఆధ్యాత్మిక వాదం ఉండాలి.**

వృక్షాలు తమతమ ఆకులను నేలకురాల్చి ఎరువును అందిస్తాయి. దానికి బదులుగా తమ వ్రేళ్లకు ఉపయోగపడే అహారాన్ని పొందుతాయి. పువ్వులతోను, ఫలములతోను ఇతరులకు లాభాన్ని చేకూరుస్తాయి.

ఇలాంటి పరోపకార బుద్ధి నేడు మూర్ఖత్వంగా భావింపబడుతోంది. పరోపకారపారీణులు అవమానం పాలవుతున్నారు. కాని వాస్తవంగా ఆలోచిస్తే పరోపకారమే సమాజంలో ఖ్యాతినీ, జీవితంలో దైవానుగ్రహాన్ని సంపాదించి పెడుతుంది. వృక్షాలకు ఎప్పటికప్పుడు క్రొత్త క్రొత్త చిగుర్లను, క్రొత్త క్రొత్త పువ్వులను అందించడంలో ప్రకృతి ఎలాంటిలోటును కలిగించదు. ఎవరు? ఏది? ఇచ్చినా వడ్డీతో సహా లభిస్తుంది. ఇది ప్రకృతి ధర్మం.

చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖింపబడిన మహానుభావులంతా పారమార్థిక చింతనను స్వీకరించినవారే. వారంతా విత్తనంలాగా కృశించిపోయారు. వృక్షంలాగా ఎదిగారు. ఇదే మార్గంలో నడవాలి అనుకున్నవారు మొట్టమొదట తనలో పేరుకుపోయిన కుసంస్కారాలను తొలగించుకోవాలి. మంచి సంస్కారాలను అలవర్చుకోవాలి. దీని కోసం వారు చాలా శ్రమ పడాల్సి ఉంటుంది. ముఖ్యంగా స్వార్థాన్ని వదులుకోవాల్సి ఉంటుంది. తరువాతనే పరోపకారమార్గాన్ని పట్టుకోవాల్సి ఉంటుంది.

*భగవస్తం తతో నత్వా వాంఛా సామ్యం విచార్య చ*
*ప్రజ్ఞాపురాణ సన్దేశముపదేష్టుం జనం జనమ్* (83)

*జాగృతాత్మన్ ప్రజ్ఞాభియాన మార్గే నియోజితుమ్*
*సంకల్ప్య ధరణీమాయాత్ ప్రసన్న హృదయస్తదా* (84)

*సప్తర్షీణాం తపోభూమౌ విరభ్యాథ గతోక్లమః*
*యుగాంతరచితే రూపే విశ్వవ్యాపీ బ భూవ చ* (85)

**టీకా:–** నారదుడు భగవంతుడికి నమస్కరించాడు. ఆయన ఇచ్ఛతో తన ఇచ్ఛను కలుపుకుని, జనుల దగ్గరకు ప్రజ్ఞాపురాణ సందేశం వినిపించేందుకు, జాగృత ఆత్మలను ప్రజ్ఞా ఉద్యమ కార్యాచరణలో కలుపుకునేందుకు సంకల్పం తీసుకుని, ప్రసన్న హృదయంతో పృథ్విపైకి దిగాడు. సప్తఋషుల తపోభూమిలో కొంతసేపు విశ్రాంతి తీసుకుని యుగాంతంలో చేతనా రూపంలో విశ్వమంతా వ్యాపించాడు.

నిజమైన భక్తునికి తనకు అంటూ ఏమీ కోరికలు ఉండవు. అతను భగవంతుని పని చేయాలి అన్న సంకల్పంతోనే జన్మిస్తాడు. 'నేను' 'నాది' అనే భావాన్ని చైతన్య శక్తిలో కలిపివేస్తాడు. దేవఋషినారదుడు తన కోర్కెలను భగవంతుని ప్రేరణలోనే కలిపివేశాడు. ఒకసారి నారదుడు మోహంలో పడిపోయాడు. 'నేను భక్తుణ్ణి' అన్న అహంకారంతో భగవానుని మనస్సును అర్థం చేసుకోలేక పోయాడు. పరమాత్ముడు ఆయన అహంకారాన్ని అణచివేశాడు. కనువిప్పు కలిగించాడు. ఆనాటినుండి నారద మహర్షి తన కోరిక లన్నింటినీ భగవంతునిలోనే లీనం చేసివేశాడు. హాయిగా, ఆనందంగా ప్రభునామాన్ని గానం చేస్తూ గడిపివేశాడు.

*అనువాదం – శ్రీ మారెళ్ల కామరాజు*

## శ్రీ గాయత్రీ శతకం

22. *సన్మనంబుతో మంత్రమున్ జపము చేసి*
*అమ్మపూజలు పదిమార్లు ఆచరింప*
*సర్వపాపాల దోషాల సమయజేయు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

**భావం:** వేదమాత అయిన గాయత్రి విశ్వానికే జనయిత్రి. మంచి మనస్సుతో గాయత్రీ మంత్రాన్ని చదివి, పదిసార్లు పూజాది కార్యక్రమాలతో ఆరాధిస్తే సకల పాపాలవల్ల కలిగిన దోషాలను తొలగిస్తుంది.

23. *వందమారులు మంత్రమున్ పలుకునంత*
*ఆలకించిన ఆయమ్మ అభయమిచ్చి*
*ఒంటి కెటువంటి దోషమ్మునంటనీదు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

**భావం:** వేదమాత అయిన గాయత్రి విశ్వానికే జనయిత్రి. వందసార్లు గాయత్రీ మంత్రాన్ని జపిస్తే విన్నటువంటి ఆతల్లి ఇదిగో! నేనున్నాను నీకు భయం లేదంటూ, నీదేహానికి ఎటువంటి దోషాలను అంటకుండా చేస్తుంది.

*రచన*
*సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

**పురుషుని మంచితనం అతను చేయని పనులను బట్టి తెలుస్తుంది.**

తత్వ చింతన

# కాల చక్రంలో దాగిన విజ్ఞానం

నీటి ప్రవాహాన్ని కోరిన విధంగా కావలసిన వైపుకు త్రిప్పుకోవచ్చు. ఒక చోటనుంచి ఇంకోచోటకు తీసుకుపోవచ్చు. ఇదే మాట కాలచక్రం విషయంలో కూడా వర్తిస్తుంది. శ్వాస క్రియను తీవ్రతరం చేస్తూ భవిష్యత్తును పరికించవచ్చు. అదేవిధంగా శ్వాసక్రియను తగ్గిస్తూ స్తంభింపచేసి గడిచిపోయిన కాలాన్ని చాలా చాలా వెనకకు వెళ్ళి గుర్తుచేసుకోవచ్చు. ఇది సామాన్యులకు సాధ్యం కాదు. కాని యోగివరులకు చాలాసులభం వారు అర క్షణంలో కాలాన్ని తారుమారు చేసి, భూత,భవిష్యత్తు జ్ఞానాన్ని పొందగలుగుతారు. కాని ఒకానొక ప్రత్యక్షమైన శారీరక మానసిక పరిస్థితులలో సునాయాసంగా చేసి చూపగలుగుతారు.

ఇటువంటి ఒక సంఘటనను గురించి ప్రఖ్యాత చరిత్రకారుడు జాన్‌ఫోర్‌మైన్ తన పుస్తకం 'ది మార్క్ ఆఫ్ టైమ్' అన్నదానిలో చర్చించారు. ఆ సంఘటన 1969లో జరిగింది. పి.జె.చెజ్ అను పేరుగల ఒక వ్యక్తి ఒక రోజున వెల్లింటన్‌లో బస్ స్టాండ్‌లో బస్సు కోసం ఎదురు చూస్తున్నాడు. బస్సు రావడానికింకా సమయం పడుతుంది. అందువలన అతను ఇటు, అటూ తిరుగుతూ కొంచెం ముందుకొచ్చాడు. అతి శీఘ్రంగా అతను రెండు అందమైన కుటీరాలముందుకు జేరాడు. వాటికి నాలుగువైపులా ఎంతో అందమైన రంగులతో విచ్చుకున్న పువ్వులుగల పూదోటను చూశాడు. ఆ తోటలో ఒక బెంచీమీద కొన్ని ధార్మిక గ్రంధాలు అతని కళ్లబడ్డాయి. ఆతోటలో ఒక మూల తోటమాలి పని చేస్తున్నాడు. ఇంకొకడు మొక్కలకు నీళ్లు పోస్తున్నాడు. ఒక కుటీరం ముఖద్వారం దగ్గర ఒక వృద్ధురాలు చలికాచుకుంటున్నది. రెండవ కటీరంలో నుండి మాటల చప్పుడు నెమ్మదిగా వినిపిస్తుంది. దాని గుమ్మం మీద ఒక పలక తగిలించబడింది. దానిమీద ఆ కుటీరము నిర్మించిన కాలము 1837 అని వ్రాయబడి ఉంది. అది చూసే సరికి అతను ఆశ్చర్యపోయాడు. ఈ గడ్డిగుడిశ అంతకాలందా! అని విస్తుపోయాడు. ఐతే అతను దానిని గురించి ఎక్కువ ఆలోచించకుండా అక్కడ నుండి బస్సు వచ్చేసమయమయిందని బయలుదేరాడు.

మరునాడు ఆ కుటీరాలను గురించి చేజ్ తన తోటి ఉద్యోగితో ముచ్చటించాడు. కొంతసేపు ఆలోచించిన మీదట అతను అక్కడ ఇటుకలతో కట్టిన రెండు ఇళ్లున్నాయిగానీ కుటీరాలు లేవని ఖచ్చితంగా చెప్పాడు. మరుసటి రోజు సాయంకాలం చేజ్ మళ్లీ అక్కడకు వెళ్లి చూశాడు. ఆచోటును చూచేసరికి అతను లోగడ తాను చూసింది నిజమా? లేక భ్రమా? అన్న ఆలోచనలో మునిగిపోయాడు. అక్కడ ఇటుకలతో కట్టిన రెండు ఇళ్లు మాత్రమే ఉన్నాయిగాని, మరేమీ లేవు. అది చూసే సరికి అతని మనస్సు ఉద్విగ్నమయింది. తనది భ్రమేఐతే ఆ కుటీర ద్వారం మీద వ్రాయబడిన 1837 తోటలో పని చేస్తున్న తోటమాలి, చలికాచుకుంటున్న ముసలమ్మ, ఇంట్లోంచి వినబడిన మాటలు మొదలైనవన్నీ నిజం కాదా? అంతా భ్రమేనా? అన్న సందిగ్ధంలో పడ్డాడు. అక్కడున్న ఇటుకలతో కట్టిన ఒక ఇంట్లో నివసిస్తున్న ఒక ముసలివానితో మాట్లాడాడు. విషయమంతా చెప్పి అతనిని ప్రశ్నించాడు. అందుకా వ్యక్తి అక్కడ సుమారు 80 సంవత్సరాల క్రితం రెండు పాత గుడిసెలు ఉండేవనీ, అంతకు మించి తనకింకేమీ తెలియదనీ జవాబిచ్చాడు. అక్కడున్న తోటలను గురించి కానీ, ఆ కుటీరాలలో నివసించే వారిని గురించి గానీ అతనేమీ చెప్పలేకపోయాడు. అతని మాటలు విన్న మీదట చేజ్ మనస్సు కుదుటపడింది. తాను చూసింది నిజమేననీ, భ్రాంతికాదనీ అది "టయిమ్ స్లిప్"కు సంబంధించిన ఒక సంఘటన అని, అందుకే తాను కొన్ని దశాబ్దాల వెనుకకు పోయానని అర్థం చేసుకున్నాడు.

ఇటువంటిదే ఇంకొక సంఘటనను గురించి గొప్పజీవ శాస్త్రవిజ్ఞాన వేత్త "ఇవాన్ సేండర్ సన్" తాను రచించిన మోర్ థింగ్స్ అనే పుస్తకంలో పేర్కొన్నారు. ఆగ్రంధము యొక్క చివరి అధ్యాయంలో ఈ విషయాన్ని వివరిస్తూ ఆయన రహస్య విజ్ఞానం విషయంలో తనకు అంతగా ఇష్టముండేది కాదనీ, కానీ క్రింద తెలిపిన సంఘటన జరిగిన తరువాత తనకు ఆ విజ్ఞానం నందు శ్రద్ధ పెరిగిందనీ, అందువలన దానికి చెందిన అనేక పరిశోధనలు చేయడం జరిగిందనీ వ్రాశారు. ఆఘటనను వివరిస్తూ ఆయన క్రింది విషయాన్ని వ్రాశారు. ఒకసారి జీవశాస్త్ర సర్వే కోసం హైతీ వెళ్లవలసి వచ్చింది. ఆయనతో ఆయన భార్య కూడా వెళ్లింది.

**స్త్రీ మంచితనం ఆమె చేసే పనులను బట్టి తెలుస్తుంది.**

ఒక రోజున భార్యా భర్తలిద్దరూ సుప్రసిద్ధ అజూయే సరస్సును చూడడానికి బయలుదేరారు. దగ్గర త్రోవలో వెళదామని ప్రయత్నం చేస్తుండగా వాళ్లెక్కిన బండి బురదలో ఇరుక్కుంది. అందువలన ఆరాత్రంతా వాళ్లు కాలినడకన వెళ్లవలసి వచ్చింది. భార్యా భర్తలిద్దరూ ప్రక్క ప్రక్కన నడుస్తున్నారు. వారికి తోడుగా వచ్చిన ఫ్రెడరిక్ గారు, ఓల్సాప్ గారు వారికన్న కొంచెం ముందు నడుస్తున్నారు. ఆకాశం స్వచ్ఛంగా ఉంది. శుక్లపక్షం కావడం వల్ల వెన్నెలలో దోవ స్పష్టంగా కనబడుతోంది. అందువల్ల తేలికగా నడవగలుగుతున్నారు. నడుస్తుండగా అనుకోకుండా సెండర్‌సన్ మెడ పైకి లేచింది. అతనికి తాము నడుస్తున్న త్రోవకు రెండు వైపులా వివిధ రూపాలుగల మూడంతస్తుల భవనాలు కనబడ్డాయి. అవి ఎలిజబెత్ కాలానికి చెందినవనిపిస్తున్నాయి. కానీ అవి ఇంగ్లాండ్‌లో గాక ప్యారిస్‌లో ఉన్నట్లనిపిస్తున్నాయి. వాటిపై కప్పులు పోత పోసినవి. చెక్కతో చేసిన చిన్న కిటికీలున్నాయి. కిటికీలలో చిన్న అద్దాలు తగిలింపబడి ఉన్నాయి. వాటి వెనుకవైపున తేలికైన ఎర్రరంగు వెలుతురు ఇటు, అటు ప్రకాశిస్తోంది. అది కొవ్వొత్తుల వెలుతురనిపిస్తోంది. కొన్ని ఇండ్లలో ఇనపఊచల జాలీలున్నాయి. ఇవన్నీ గాలికి కదులుతున్నట్లు కనిపిస్తోంది. కానీ బైట కొద్దిపాటిగా కూడా గాలి వీచడం లేదు.

ఇవన్నీ చూసి సెండర్‌సన్ ఆశ్చర్యచకితుడయ్యాడు. అప్పుడు అతని భార్య అతనిని చూస్తూ నిలబడిపోయి వణకడం మొదలుపెట్టింది. సెండర్ సన్ వెంటనే ఆమె దగ్గరకు వచ్చి కారణం  అడిగాడు. కానీ ఆమె నోటినుంచి మాటపెగలడం లేదు. ఆస్థితిలో కొద్దిసేపుండి మరల మామూలు స్థితికి చేరుకుంది. తరువాత ఆమె భర్త చేతిని పట్టుకుని ఆ ఇళ్లవైపుకు చూపిస్తూ వాటిని గురించి వివరించడం మొదలుపెట్టింది. ఆమె వివరించేవన్నీ సెండర్‌సన్ అంతకు ముందు కళ్లారా చూసినవే.

వాళ్లిద్దరూ విస్మయంతో నిలబడిపోయి తాము చూసిన దృశ్యాన్ని గురించి మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. ఆ ఇళ్ల గోడలు మొదలైనవాటిని గురించి, వాళ్లు చూసిన ఒక్కొక్క వస్తువును గురించి ఎంతో విస్తారంగా మాట్లాడుకుంటున్నారు. ఆ విధంగా వాళ్లు చెప్పుకుని చెప్పుకుని చివరకు అలసిపోయారు. ఫ్రెడరిక్ చాలా ముందు వెళుతున్నాడు. సెండర్‌సన్ అతనిని పిలిచాడు.

ఆ తరువాత ఏమి జరిగిందో అతనికి గుర్తు లేకుండా పోయింది. బహుశా అతను వాటివైపుకు పరుగెత్తడం జరిగి ఉంటుంది. దానివల్ల మళ్ళీ తల తిరగడం మొదలయి ఒక పొదుగాటి రాతిమీద కూలబడ్డాడు. తరువాత ఫ్రెడరిక్ పరుగునవచ్చి అతని అలజడికి కారణం అడిగాడు. కాని అతడు అందుకు వెంటనే జవాబియ్యలేకపోయాడు. అతని దగ్గర సిగరెట్లున్నాయి. ఇద్దరికీ చెరిఒకటీ ఇచ్చి లయిటర్ వెలిగించాడు. ఆ వెలుతురులో సెండర్ సన్ తన కళ్ల ముందున్న ప్రతి వస్తువును స్పష్టంగా చూడగలిగాడు. అక్కడ పదిహేనవ శతాబ్దానికి చెందిన ప్యారిస్‌గాక, ముళ్లపొదలు, గడ్డిమొదలైన వాటితో నిండిన ఒక విశాలమైన మైదానం ఉంది. అతని భార్యకూడా లైటర్ వెలుతురుతో పూర్వపు స్థితికి చేరుకుంది. ఫ్రెడరిక్‌కు ఏమీ కనబడలేదు. తరువాత వాళ్లు జరిపిన చర్చల ఫలితంగా హైతీ ఒకప్పుడు ఫ్రాంస్‌కు చెందిన ప్రదేశమనీ, అందువల్లనే నేడు నిర్జన ప్రదేశంగా ఉన్నా అక్కడ ఆరోజుల్లో ఫ్రాంస్ వాస్తు శిల్పానికి చెందిన భవనాలు ఉండి ఉండవచ్చుననీ అనిపించింది.

కోలిన్‌విల్సన్ రచించిన "బియాండ్ ది ఆకల్ట్" అను గ్రంథంలో 'టయిమ్ స్లిప్' తో సంబంధమున్న మరియొక విషయాన్ని పేర్కొనడం జరిగింది. ఆ సంఘటన 1973వ సంవత్సరానికి చెందింది. కేంబ్రిడ్జ్‌కి చెందిన జెన్ ఓనీతా అనుపేరుగల ఒక ఉపాధ్యాయురాలికి సంబంధించింది. ఒకసారి జెన్ తన స్నేహితురాలితో కలిసి ఫోదరిథే చర్చిని చూడడానికి వెళ్లింది. అక్కడ ఒకప్పుడు మేరీక్వీన్ ఆఫ్ ఫోదరిథేని ఉరితీయడం జరిగింది. ఆవేదిక వెనుక గల ఉరికంబం యొక్క చిత్రాన్ని చూచి చాలా ప్రభావితురాలయింది. ఆమె ఆ విషయాన్ని తన స్నేహితురాలికి చెప్పింది. ఆమె అటువంటి చిత్రమేదీ అక్కడ లేదని గట్టిగా వాదించింది. ఆ తరువాత జెన్ ఆ చర్చిని ఏర్పాటు చేసినామెకు ఫోన్ చేసి అడిగింది. ఆమె ఆ చర్చిలో అటువంటి చిత్రమేదీ లేదనీ జవాబిచ్చింది. ఒక సంవత్సరం తరువాత వాళ్లిద్దరూ మళ్లీ ఆ చర్చిని చూడడానికి  వెళ్లారు. కానీ ఆ చర్చిలో ఎంతో మార్పు వచ్చింది. అది చూసి జెన్ ఆశ్చర్య పడింది. ఇంత త్వరగా అంతమార్పు ఎట్లా వచ్చిందో తెలుసుకోవాలని ఉబలాట పడ్డారు. దానిని ఏర్పాటు చేసినామె ఆచర్చి సంవత్సరం క్రితం ఉన్నట్లుగానే నేడు కూడా ఉందనీ, దానిలో ఏవిధమైన మార్పూ జరుగలేదని గట్టిగా చెప్పింది. దాంతో ఆమెకు అలజడి ఎక్కువయింది. దాని గత చరిత్రను పరిశోధించగా 1973లో జెన్‌కు ఏ చర్చి కనబడిందో అది 1953లో పడగొట్టబడిందని తేలింది. అంటే జెన్ అనుకోకుండా రెండు శతాబ్దాలు వెనుకకు

**అందరం సమస్యలను ఎదుర్కొంటూనే ఉంటాం - కాని ఎలా ఎదుర్కోన్నామన్నదే ముఖ్యం.**

వెళ్లిందన్నమాట. ఇదంతా ఎట్లా జరిగింది? ఈ విషయంలో ఆమె ఏమీ చెప్పలేక పోయింది. ఇది కాల చక్రం యొక్క రహస్యం దానిని విజ్ఞాన శాస్త్రం కూడా పరిష్కరించలేకపోయింది.

ప్రముఖ సాహిత్యవేత్త హరివంశరాయ్ బచ్చన్ గారు తన ఆత్మకథ "దశద్వార్ సే సోపాన్‌తక్" లో తన అనుభవాన్ని తెలుపుతూ తాను విదేశ మంత్రాలయంలో డిప్యూటీ సెక్రటరీగా పని చేస్తున్నప్పుడు ఆయన 219, డి1 ఇంప్లొమేటిక్ ఇన్ క్లేవ్‌లో కాపురముండే వారనీ, అక్కడ ఉన్నప్పుడు భగవద్గీతను 'జనగీత' అను పేరుతో పద్యాలలోకి అనువదించడం జరిగిందనీ, ఆ సమయంలో అనేకమార్లు తాను కూర్చుని అనువాదం కొనసాగిస్తున్న చోట ద్వారకనుంచి హస్తినా పురానికి వెళుతూ కృష్ణ పరమాత్మ తన రథాన్ని కొద్ది సేపు నిలబెట్టినట్లు చాలా సార్లు అనుభూతి కలిగిందనీ, ఆ రథానికి కట్టిన గుఱ్ఱాలు అలసిపోయినట్లు, ఆ రథానికి సారథిగాను, రథిగాను శ్రీ కృష్ణ పరమాత్మయే వ్యవహరిస్తున్న అనుభూతి కూడా తనకు కలిగేదని, సాక్షాత్తు ద్వాపరయుగంలోని అదృశ్యం ఉన్నదున్నట్లు తనకు ఇప్పుడు కూడా కలిగిందని వ్రాశారు.

గామ్ ఫ్లేఫేయర్ తాను వ్రాసిన "ది ఇండెఫినిట్ బౌండ్రీ" అను గ్రంథంలో తానొకసారి తన స్నేహితునితో కలిసి ఇబ్రశాయర్ నుంచి పోంట్‌ఫ్రెక్ట్ వెళుతున్నట్లూ, దారి మధ్యలో అతనికి ఒక పార్క్ కనబడినట్లూ, అది చాలా ఆకర్షణీయంగా ఉన్నట్లూ, ప్రతి చోట మనసును ఆకర్షించే పుష్పాలు విచ్చుకుని ఉన్నట్లూ, అనేక రకాల వృక్షాలతో ఆ పార్క్ నిండియున్నట్లూ, వివరించాడు. ఫ్లెఫ్లేయర్ స్నేహితుడు ఒక చోట కూర్చుని ఆ పార్క్ యొక్క అందచందాలను తిలకిస్తున్నాడు. ఫ్లెఫేయర్ నెమ్మదిగా తిరుగుతూ పార్క్ యొక్క అవతలి వైపుకు జేరుకున్నాడు. అక్కడ పాతకాలపు ఇళ్లుండడం చూసి దిగ్భ్రాంతుడయ్యాడు. ఆపాత పద్ధతిలో నిర్మింపబడిన ఇళ్లను గురించి ఆయన చదివాడు కానీ ఎప్పుడూ కళ్లారా చూడలేదు. కానీ ఇప్పుడు అవి కళ్లబడ్డాయి. ఆభవనాల నిర్మాణం వాటికి సంబంధించిన స్థాపత్య కళలను ఎంతో సూక్ష్మంగా అధ్యయనం చేయడం ఆరంభించాడు. వాటిలో అక్కడక్కడ కట్టిన పిట్టగోడలు అద్వితీయంగా ఉన్నాయి. పై కప్పుల మీదనుంచి వ్రేలాడుతున్న శిల్పసంపద ఆకాలానికి చెందిన వాస్తు కళయొక్క గొప్పతనాన్ని చూపిస్తున్నాయి. అప్పుడు అతను ఆలోచించడం మొదలుపెట్టాడు. అతని దృష్టి కాలగణనం వైపుకు మళ్లింది. వాటిని అతను చూసింది 1966వ సంవత్సరం మే నెలలో. ఆ కాలంలో వ్రాయబడిన ఇంగ్లాండు చరిత్రలో ఆ డిజైన్ ఇళ్లు 14వ శతాబ్దానికి చెందినవని తెలుపబడింది. అంటే ఆ ఇండ్లు, ఇంచుమించు ఆరువందల సంవత్సరాలనాటివని తేలుతుంది. అంత కాలం గడిచినా అవి యథాతథంగానే నిలిచిఉన్నాయి. అప్పుడే కట్టినట్లున్నాయి. అది ఏవిధంగా సంభవమౌతుంది? వాటిలో ఏ విధమైన చిన్నపాటి మార్పులేదు. అందుకు కారణమేమిటో అర్థం కావడం లేదు. అతను ఆ విధమైన ఆలోచనలలో మునిగి ఉండగా అతని మిత్రుడి గొంతు వినబడింది. అతను పిలుస్తున్నాడు. అప్పటికే చాలా ఆలస్యమయింది. త్వరగా వెళ్లాలి అని అనుకుంటూ వేగంగా మిత్రుని వైపుకు నడవడం మొదలుపెట్టాడు. స్నేహితునితో బండిమీద ప్రయాణించడం మొదలుపెట్టాడు. అతడు మళ్లీ ఆ ఇళ్లను గురించి ఆలోచించడం ప్రారంభించాడు. స్నేహితునికి విషయమంతా వివరించాడు. అతను ఆ పార్క్ చుట్టుప్రక్కల అటువంటి కట్టడాలేమీ లేవని చెప్పాడు. ఫ్లేఫెయర్ అతని మాటను అంగీకరించలేకపోయాడు. తాను తన కళ్లతో చూసింది కాదనడమెట్లాగ? అతనిని మళ్లీ ఒకసారి పార్క్ దగ్గరకు తీసుకువెళ్లి చూపించాలని నిర్ణయించుకున్నాడు. ఇద్దరూ తిరుగు ప్రయాణంలో మళ్లీ పార్క్ దగ్గరకు వచ్చారు. పార్క్ చట్టుప్రక్కలంతా వెతికి వెతికి చూశారు. ఎక్కడా ఒక్క భవనం కూడా కనబడలేదు. ఐతే ఫ్లెఫేయర్‌ది భ్రమ అనడానికీ వీలు లేదు. అతను ఆరువందల సంవత్సరాల క్రిందటి కాల ఖండంలో ప్రవేశించి ఆ భవనాలను చూశాడు. చరిత్ర కారులు కూడా ఆ కాలంలో అక్కడ ఒక అందమైన నగరం ఉండేదని తమ పరిశోధనల ద్వారా నిరూపించి అతని ఆలోచనలను నిజమని నిరూపించారు.

అలలతో కూడిన ప్రవాహం వలె కాలం కూడా ఒక ప్రవాహమే. ప్రవాహం వెనుక నుండి ముందుకు ప్రవహించినట్లే కాల ప్రవాహము వర్తమానం నుండి భవిష్యత్తుకు ప్రవహిస్తుంది. నదీ ప్రవహానికి అడ్డుకట్టవేసి దాని ప్రవాహ దిశను మార్చవచ్చును. అది ఒక ఉన్నతమైన విజ్ఞానానికి చెందిన పని. అది తెలిస్తేనే ఆ విధంగా చేయడం కుదురుతుంది. అదే విధంగా కాల ప్రవాహం విషయంలో కూడా సాధ్యమౌతుంది. దీనిని సామాన్యులు కూడా తమ నడవడి, ఆలోచనలు, ఆచరణలో మార్పుతెచ్చుకుని వాటిని సక్రమంగా ఆచరిస్తే చాలు. దానివల్ల ఈ క్షణాలనే కాల ప్రవాహ దిశను మార్చుకోవచ్చు.

*అనువాదం: కె.బి.సోమయాజులు*

*(అఖండ జ్యోతి మార్చి 2000)*

**దీక్షగా చేస్తే అన్ని పనులూ పూర్తి అవుతాయి.**

ధారావాహిక: పరమేశ్వరుని చిరునామా-10

# కోరినంతనే అభీష్టసిద్ధి

ప్రాణుల అవసరాలు, కోరికలు, వాటి శారీరక, మానసిక శక్తులు భౌతికపరిస్థితులను సృష్టిస్తాయి. ఈ నిజాన్ని కొంచెం లోతుగా ఆలోచిస్తే సహజంగానే గమనించవచ్చు. అనేక ఋజువులను కూడా పొందవచ్చు.

వర్షాలు కురిస్తే వృక్షాలు, వనస్పతులు ఉత్పన్న మవుతాయని అందరికీ తెలుసు. అయితే వృక్షాలు పరుగులు తీసే మేఘాలను అడ్డుకొని తమ ప్రాంతంలో వర్షం పడేలా చేస్తాయి. వర్షాలు కురవని పెద్ద ఎడారి ప్రాంతంలో ఇపుడు అడవులను పెంచితే ప్రకృతి క్రమం మారిపోయి సునాయాసంగానే వర్షాలు కురుస్తాయి. అధిక వర్షపాతం ఉన్న ప్రాంతాలలో అక్కడి వనసంపదే మేఘాలను వర్షించేలా వత్తిడి చేస్తుందనే సిద్ధాంతం అంగీకరించబడింది. మేఘాలతో పోలిస్తే వృక్షాలలో చైతన్యం ఎక్కువగా ఉంటుంది. అందువలననే విస్తరించడంలో మేఘాలకంటే తక్కువ అయినా కూడా సామర్థ్యంలో ఎక్కువ.

ఆత్మరక్షణ ప్రాణులకు అతి ముఖ్యమైనది. జీవులలో జాగరూకతను, పరాక్రమాన్ని సజీవంగా ఉంచడానికి ప్రకృతి శత్రువర్గాలను సృష్టించింది. జీవులన్నీ శాంతంగా, సురక్షితంగా, సౌకర్యంగా ఉంటే వాటిలో స్ఫూర్తి, నైపుణ్యం వికసించదు. అవి త్వరగా నశించిపోతాయి.

సింహము, పులి, పంది, ఏనుగు, మొసలి లాంటి భారీ శరీరం గల జంతువులు పదునైన తమ పళ్ళతో ఆత్మరక్షణ చేసుకుంటాయి. వాటి సహాయంతో ఆహారాన్ని కూడా సంపాదించుకుంటాయి. పాము, తేలు, కందిరీగ, తేనెటీగ మొదలైనవి తమ కొండెతో కాటు వేసి శత్రువులని ఓడిస్తాయి. నత్తలు, నులిపురుగు మొదలైన వాటి శరీరం నుండి వెలువడే దుర్గంధం శత్రువులు ముక్కు మూసుకోని పారిపోయేలా చేస్తుంది. తాబేలు, ముత్యపుచిప్ప, నత్త మొదలైన వాటి చర్మం మీద కఠోరమైన కవచం (గట్టిపెంకు) ఉంటుంది. దానివలన వాటికి రక్షణ కలుగుతుంది. మిడత యొక్క పచ్చ గడ్డి రంగు సీతాకోకచిలుకకు ఉండే పూలరంగులు, చిరుతకు ఉండే చెట్ల, ఆకుల రంగు పలువన్నెలుగా ఉంటాయి. ఊసరవెల్లి వాతావరణంలో వచ్చే మార్పులకు అనుగుణంగా తన రంగును మార్చుకుంటూ ఉంటుంది. ధృవ ప్రాంతాలలో ఉండే ఎలుగ్గొడ్డు మంచులాంటి తెల్లటి రంగును సొంతం చేసుకుని తనని తాను శత్రువుల చేతికి చిక్కకుండా దాచుకుంటుంది. కంకర, రాయి, ఇసుక, మట్టి, చెత్తా – చెదారం మొదలైన వాటి రంగును తీసుకుని ఎన్నో ప్రాణులు ఆత్మరక్షణ చేసుకుంటాయి, షార్క్ చేప కరెంటు షాక్‌లాగా కొట్టడంలో దిట్ట. అనేక ప్రాణుల ప్రవర్తన ఎంత భయంకరంగా ఉంటుందంటే దానిని చూసి శత్రువులు ఎంతో తెలివిగా ఆలోచించి దాడి చేయవలసి వస్తుంది.

వేటాడే జంతువులు అధిక పరాక్రమం చూపించాలి. ఈ దృష్ట్యా వాటికి దంతములు, గోళ్ళు, పంజాలకే ఆసాధారణ బలం ఉండడమే కాక తోక వరకు కూడ ప్రత్యేకత కలిగి ఉంటాయి. ఈ వరాలను అవి తమ సంకల్ప శక్తితోనే ప్రకృతి నుండి పొందాయి.

సింహం బరువు అత్యధికంగా 400 పౌండ్లు ఉంటుంది. ఆవు బరువు దానికంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువగా ఉంటుంది. అయితే సింహం సమతుల్యతతో దానిని నోటకరుచుకుని 12 అడుగుల ఉన్న ముళ్ల కంచెను తేలికగా ఎగిరి దాటగలదు.

ప్రాణుల శరీర రచన, బుద్ధి, సంస్థానం కూడా వాటికవే గొప్పవి. అయితే వీటన్నింటికంటే ముఖ్యమైనవి సంకల్ప శక్తి, కోరిక మరియు ఆవశ్యకత. ఈ అనుభూతులు ఏ ప్రాణిలో ఎంత తీవ్రంగా ఉంటాయో అవి ఆ మేరకు వరాలను ప్రకృతి నుండి పొందుతాయి. మనిషికి లభించిన శక్తులకు కారణం అతనిలో పెరిగిన సంకల్పశక్తిగా గుర్తించబడింది.

★★★

ప్రేమించగలిగితే అసూయకు ఆస్కారం ఉండదు.

మనం - మన ఆరోగ్యం

# ఆయుర్వేద సిద్ధాంతాలు-మన ఆరోగ్యం

విజ్ఞాన సమ్మతమైన చికిత్సా శాస్త్రం ఆయుర్వేదం, ప్రాచీన కాలం నుండి మనదేశంలో మానవ జీవనం యొక్క సంపూర్ణ విజ్ఞానంగా మానవునికి ఆధి దైవిక, ఆధి భౌతిక, ఆధ్యాత్మిక రూపంలో ఆరోగ్యాన్ని కలుగచేస్తున్నది. చికిత్సా విజ్ఞానంలో ఏ ఇతర చికిత్స విధానాల్లో లేనంతగా ఆయుర్వేద చికిత్స యొక్క వ్రేళ్ళు లోతుగా ప్రాకిపోయాయి. ఈ శాస్త్రం మానవునికి యవ్వనమును, యశస్సునూ ప్రసాదించగలది. ఈ చికిత్సా పద్ధతి మానవ జీవనంలోని అనేక సమస్యలకు పరిష్కారం తెలియచేస్తుంది.

ఇతర దేశాలలోని అన్ని చికిత్సా పద్ధతులకంటె ఆయుర్వేద చికిత్సా పద్ధతి శ్రేష్ఠమైనది. ప్రాణదాయకమైంది. ఆయుర్వేదాన్ని గురించి ఈ శ్లోకంలో వివరణ ఇవ్వబడింది.

***హితాహితం సుఖం దుఃఖ మాయుస్తస్య హితాహితమ్।***
***మానంచ తచ్చ యత్రోక్త మాయుర్వేదః సఉచ్యతే॥***

హితాయువు, అహితాయువు, సుఖాయువు, దుఃఖాయువులకు ఏదిహితమో, ఏది అహితమో, ఏది ప్రమాణమో, ఏది అప్రమాణమో, అలాగే ఆయువు స్వరూపమేమిటో తెలియ చెప్పేది ఆయుర్వేదం.

ఆయుర్వేదం యొక్క మూల ఉద్దేశ్యాన్ని గురించి శాస్త్ర వాక్యం ఇలా ఉంది. ***"స్వస్థస్య స్వాస్థరక్షణ మా-తురస్య వికార ప్రశమనం చ".***

ఆరోగ్యవంతుని ఆరోగ్యాన్ని పరిరక్షించడం, రోగిలోని వికారాన్ని శ్రమింపచేయడం ఆయుర్వేదం యొక్క మూల ఉద్దేశ్యం.

**ఆరోగ్యవంతుని లక్షణాలు ఈ విధంగా ఉంటాయి.**

***సమదోషః సమాగ్నిశ్చ సమధాతుమల క్రియః ।***
***ప్రసన్నాత్మేన్ద్రియమనాః స్వస్థ ఇత్యభిధీయతే ॥***

ఎవరైతే వికార రహితులుగ ఉంటారో, ఇంద్రియములూ, మనస్సూ, ఆత్మా ప్రసన్నంగా ఉంటుందో వారే ఆరోగ్యవంతులు, దీని వలన మన ఋషులకు ఆరోగ్యాన్ని గురించిన పరిపూర్ణ దృష్టి ఏ విధంగా ఉండేదో తెలుస్తున్నది.

ఆయుర్వేదంలో వాతము, పిత్తము, కఫము ఈ మూడింటికి ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుంది. ఇవి సమంగా ఉన్నపుడు మనిషిలో ఏ విధమైన రోగమూ ఉండదు. వీటిలో దోషాలున్నపుడు రస, ధాతువుల నిర్మాణం సరిగా ఉండదు. మలిన పదార్థాలు బయటకు సంపూర్ణంగా బయటికి వెళ్ళవు. దినచర్య, రాత్రిచర్య, ఋతుచర్యలను విధి విధానంగా పాటించినపుడు ఏ రోగాలూ ఉండవు. ఇప్పటి రోగాలకన్నిటికి కారణం పైన ఉదహరించిన పగలు, రాత్రి, ఋతువులకు సంబంధించి శ్రద్ధలేకపోవడం ఆహారం, నిద్ర, బ్రహ్మచర్యము మొదలైన వాటిని సరిగా పాటించకపోవడం.

దిన చర్యలో పాటించవలసినవి-బ్రహ్మముహూర్తంలో లేవడం, ఆత్మబోధసాధన, పృథ్వీమాతకు నమస్కారం, ఉదయం నీరు త్రాగడం, శౌచము, దంతధావనము,నూనెతో మాలిష్ చేసుకోవడం, ఉదయంపూట నడవడం, వ్యాయామము, క్షౌరకర్మ, స్నానం, వస్త్రధారణ, సంధ్యావందనము, స్వాధ్యాయము, భోజనము మొదలైనవి.

ఋషుల దృష్టి కోణంలో దిన చర్య ఎలాంటిదో తెలుసుకుందాం. '

***'బ్రాహ్మీముహూర్తే త్త్యుత్తిష్ఠే జీర్ణా నిరూపయన రక్షార్థ మాయుషః స్వాస్థో"*** ***(అ.సూ.3)***

***బ్రాహ్మీముహూర్తే ఋధ్యేత స్వస్థో రక్షార్థ మాయుషః ।***

***భా.ప్ర. 1/24***

**ఆరోగ్యవంతుడు రాత్రి భుజించిన ఆహారం జీర్ణమయిందా లేదా అని ఆలోచిస్తాడు. బ్రహ్మముహూర్తంలోనే లేస్తాడు.**

**మను మహర్షి ఇలా చెప్పాడు -**

***బ్రాహ్మీముహూర్తే ఋధ్యేత ధర్మార్థా ననుచింతయేత్ ।***
***కాయక్లేశాంశ్చ తన్మూలాన్వేద తత్వార్థ మేవ చ॥***

***(మను 4/92)***

ప్రతి ఒక్కరు బ్రహ్మముహూర్తంలో లేచి ధర్మము, అర్థము మొదలైన వాటిని గురించి ఆలోచించాలి. శరీరము యొక్క రోగం,

**ఏకాకిగా జీవించేవానికి ఎక్కడా విలువే ఉండదు.**

రోగకారణాలను తెలుసుకోవాలి, వేద రహస్యాలను గురించి కూడ ఆలోచించాలి.

ఈ రోజుల్లో జరుగుతున్నది. రాత్రిళ్ళు ఆలస్యంగా భుజించడం, టి.వి. ఫిల్ములు చూడడం. అలాంటపుడు ఉదయం తొందరగా లేవలేరు. ఆరోగ్యవంతులుగా ఉండాలంటే ఈ పద్ధతులు మార్చుకోవాలి. 24 గంటలలో బ్రహ్మముహూర్తం చాలా శ్రేష్ఠమైంది. ఆ సమయం లోనే లేవాలి. ఎంతో పుణ్యం చేసుకుంటేగాని మానవ జన్మ లభించదు. ఇక్కడ ప్రతిక్షణం ఎంతో విలువైంది. "ప్రతి రోజు ఒక క్రొత్త జన్మ అనే భావంతో జీవన క్రమాన్ని నిర్ధారించుకోవాలి.

ప్రాతఃకాలము ఎంత అందమైంది! సూర్యోదయానికి కమలాలు వికసిస్తాయి. పక్షులు మధురమైన ధ్వనులు చేస్తుంటాయి. నెమ్మది నెమ్మదిగా వీచే చల్లనిగాలి ఇవన్నీ సృష్టిలో ఒక జీవనాన్నీ నూతన స్ఫూర్తినీ, నూతన చైతన్యాన్ని కలిగిస్తుంది. శారీరిక, మానసిక ఆరోగ్యం, ఆత్మవికాసం ఇవన్నిటినీ దృష్టిలో ఉంచుకొని చూస్తే బ్రహ్మముహర్తంలో లేవడం తప్పనిసరి అని తెలుస్తుంది. ఈ సమయంలో ఆరోగ్యం, ప్రసన్నత, మేథావృద్ధి అలాగే ఆత్మిక వికాసం వీటన్నిటినీ ప్రకృతి దోసిళ్ళలో వర్షింప చేస్తుంది.

ఆయుర్వేద గ్రంథాల్లో ఈ విధంగా చెప్పబడింది.

***వర్ణ కీర్తింమతి లక్ష్మీం స్వాస్థ్యమాయుశ్చ విందతి ।***
***బ్రాహ్మే ముహూర్తే సంజాగ్రాచ్ఛియం వ పంకజం యథా***

అనగా ప్రాతఃకాలంలో లేవటం వల్ల సౌందర్యం, కీర్తి, బుద్ధి, ధనధాన్యం, ఆరోగ్యం, దీర్ఘాయువు ప్రాప్తిస్తాయి. శరీరం కమలంలాగ వికసిస్తుంది. ప్రాతఃకాలమునందే నిద్రలేచి ఈశ్వర ప్రార్థన, ఆత్మ బోధసాధన, మనకు జన్మనిచ్చిన భూ మాతకు నమస్కరించాలి.

ఆత్మబోధ సాధనను కూడ ప్రాతఃకాలంలోనే చేయాలి. రాత్రిపూట నిద్రలో ఈదృశ్యజగత్తంతా సమాప్తమౌతుంది. మనిషి స్వప్న, సుషుప్తి అనే వేరే ప్రపంచంలోకి వెళ్ళిపోతాడు. నిద్రలో స్థూలశరీరం తను శ్వాసించడం మొదలైన అనివార్య పనులు చేస్తుంది. లేవగానే క్రొత్త జన్మ సంతరించుకుంటుంది.

లేవగానే పద్మాసనం వేసుకుని కూర్చోవాలి. చలి ఎక్కువగా ఉంటే ఏదైనా వస్త్రం కప్పుకోవాలి. రెండు చేతులనూ ఒడిలో పెట్టుకోవాలి. దీర్ఘశ్వాసను తీసుకుంటూ నీలి వర్ణప్రకాశాన్ని ధ్యానించాలి. తర్వాత శ్వాసను వదలాలి. రెండో సారి శ్వాస తీసుకున్నపుడు పసుపు పచ్చని ప్రకాశాన్ని ధ్యానించాలి. శ్వాసను తీసుకోవాలి. శ్వాసను నెమ్మదిగా వదలాలి. పరమాత్మ ఎంతో దయతో మనకు క్రొత్త జన్మ ప్రసాదించాడని భావిస్తూ ప్రసన్నచిత్తులు కావాలి. తర్వాత రాత్రిపూట నిద్ర.

నిద్ర లేవగానే భూమాతకు నమస్కరించి ఆమె గుణాన్ని అనుభవిస్తూ ఈ క్రింది శ్లోకాన్ని ధ్యానించాలి.

***సముద్రవసనే దేవి పర్వతస్తనమండలే***
***విష్ణుపత్ని నమస్తుభ్యం పాదస్పర్శం క్షమస్వమే***

సముద్రమే వస్త్రంగా, పర్వత రూపంలో ఉన్న స్తన మండలాలతో శోభించుచున్న విష్ణుపత్ని పృథ్వీమాతకు నమస్కారం, నీ మీద పాదం మోపి మా దినచర్యను ప్రారంభిస్తున్నాను. నన్ను క్షమించు.

దినచర్యలో ఈ ప్రార్థన తర్వాత ఉషాపానం చేయాలి. శౌచానికి వెళ్ళేముందు ఉషాపానం చేయాలి. ప్రాతఃకాలంలో చేసే ఈ ఉషాపానం వల్ల శరీరం రోగ రహితమై ఆరోగ్యంగా ఉంటుంది. ఉషాపానం చల్లటి నీటితో చేయాలి. మన దురదృష్ట మేమంటే ఈ రోజుల్లో నిద్ర లేవగానే 'బెడ్‌టీ' త్రాగుతున్నాం, ఆరోగ్యానికి ఇది హానికరం. మన ఆరోగ్యసూత్రాలకు విరుద్ధం. చల్లటి నీరు పళ్ళకు లాభకరము. జీర్ణశక్తికి కూడ ఉపయోగ పడుతుంది. ఎక్కువ వేడి పదార్థాల వల్ల ఆహార నాళంలోని నాజూకు నరాలు కాలిపోతాయి. పుండులాగా తయారై తర్వాత కేన్సరుగ మారుతుంది.

చల్లటి నీరు త్రాగడం వల్ల రాత్రి జీర్ణంకాని స్థితి కూడ సరిగ్గా ఉంటుంది. భావ ప్రకాశ్‌లో ఈ విధంగా వ్రాశారు.

***సవితు: సముదయకాలే ప్రసృతి సలిలస్య నివేదష్టౌ,***
***రోగజరా పరిమక్తో జీవేద వత్సర శతం సాగ్రమ.***

**అంటే ప్రతి ఉదయం సూర్యోదయానికి ముందే ఎనిమిది దోసిళ్ళ నీరు తీసుకున్నవాడు రోగాల నుండి ముక్తుడౌతాడు. ముసలి తనం అతని వద్దకు రాదు.** వంద సంవత్సరాలకు పైగా జీవిస్తాడు. ఋషులకాలంలో ఇలాగే ఉండేది.

ఉషాపానం వల్ల మలము శుభ్రపడుతుంది. శరీరం ఉత్సాహంగా ఉంటుంది. వీర్య సంబంధమైన రోగాలు పోతాయి. రోజూ ఒకే విధంగా నీరుత్రాగడం వల్ల కామ వికారాలు, శరీర ఉష్ణోగ్రత, కడుపు నొప్పి, తలనొప్పి, కంటి బాధలూ

**నలుగిరి మధ్యా నమ్రతగా బ్రతికితేనే విలువ.**

తొలగిపోతాయి. రోజుకు రెండు సార్లు మల విసర్జన చేయాలి. ఉదయం ఆత్మబోధ సాధన తర్వాత, సాయంకాలము ఒకసారి. మలమూత్రాలను నిరోధించడం చాలా హానికరం.

చాలా మందికి ఉదయం మల విసర్జన సరిగా జరుగక రెండు, మూడు సార్లు వెళ్ళాల్సి వస్తుంది. మల బద్ధకం పోవడానికి నియమిత వ్యాయామం యోగాసనాలు లాభకరం, పొట్టుతో కూడిన పిండితో రొట్టె, ఆకు కూరలతో ఆహారం తీసుకోవడం లాభదాయకం, పొట్టుతో ఉన్న పప్పు, మొలకెత్తిన గింజల ఆహారం వల్ల మలబద్ధకం ఉండదు.

ఇంకా మలబద్ధకం పోలేదంటే నియమాను సారం ఉదయాన్నే నీరు త్రాగడం చాలా లాభదాయకం, వారంలో రెండు సార్లు ఎనిమా చేసుకోవాలి. హరిత చూర్ణం కానీ, త్రిఫలా చూర్ణం కానీ రాత్రి పూట వేడి నీటితో తీసుకుంటే మలబద్ధకం ఉండదు. శౌచం తర్వాత కాళ్ళూ, చేతులూ, ముఖం, కడుక్కోవాలి, ఇలా చేసినందువల్ల అలసట తీరి కళ్ళు కూడ ప్రకాశవంతంగా ఉంటాయి.

దిన చర్యలో దంతధావనం కూడ ముఖ్యం. దంతధావనం సరిగ్గా చేయక పోతే రోగాలు వస్తాయని ఋషులకు తెలుసు. పళ్ళను ముత్యాలతో పోలుస్తారు. ముత్యాల మెరుపు అందర్నీ ఆకర్షిస్తుంది. దంతాలు శరీర నిర్మాతలు, రక్షకుల రూపంలో ద్వారంవద్ద ఉంటాయి. దంతాల ఆరోగ్యం మీదే శరీర ఆరోగ్యం కూడా ఆధారపడి ఉంటుంది. పళ్ళు లేకపోతే ముఖానికి అందమే ఉండదు. మనము పుట్టిన కొన్ని నెలలకే పళ్ళు వస్తాయి. పళ్ళను ఆరోగ్యంగా ఉంచడానికి కొన్ని జాగ్రత్తలు అవసరం, ప్రతిదినం వీటిని జాగ్రత్తగా కాపాడుకోకపోతే తొందరగా ఊడిపోతాయి.

మన ప్రాచీన ఆచార్యులు దంతధావనానికి వాడే పుల్లలకు ప్రాధాన్యమిచ్చారు. వేప,రావి, బాదామ్ మొదలైనవి చాలా మంచివి.

***అవేక్ష్యరుం చదోషం చరసం వీర్యంచ యోజయతే ।***
***కషాయం మధురం తిక్తం కటుకం ప్రాతరుత్థితః ॥***
***నిమ్బశ్చ తిక్తకే శ్రేష్ఠః కషాయే ఖదిరస్తథా ।***
***మధూకో మధురే శ్రేష్ఠః కరఞ్జః కటుకే తథా ॥***

సుశ్రుతుని ప్రకారం చేదు వృక్షాలవల్ల క్రిములు నశిస్తాయి. దుర్గంధం ఉండదు, పళ్ళలోని మురికి, కఫమూ నశిస్తాయి.

పళ్ళు తోముకోవడం కూడా ఒక కళ. కూర్చొని పళ్ళు తోమాలి. పళ్ళు తోముకుంటూ ఇతరులతో మాట్లాడడం ఇటూ, అటూ ఉమ్మడం సరైనది కాదు. పందుం పుల్ల 12 అంగుళాల పొడవూ, చిటికిన వేలంత లావూ ఉండాలి, బాగా నమిలి కుచ్చులాగా చేయాలి. కుచ్చుగా ఉన్న దాంతో పైనా, క్రిందా బాగా తోమాలి. శుభ్రంగా నోరు కడుక్కొని పుల్లను సగానికి చీల్చి నాలుకను శుభ్రం చేసుకోవాలి. చిగుళ్ళను గట్టిగా రుద్దాలి. బొటనవ్రేలితో నాలుకను, నోటిపై భాగాన్ని శుభ్రపరచుకోవాలి.

అనగా నాలుకను శుభ్రం చేసే నాలుక బద్ద వెండిదిగానీ, బంగారపుది గానీ, లేదా వంకరగాఉన్న పుల్ల, మెత్తగా, నునుపుగా పది అంగుళాలంత ఉండాలి. పళ్ళుతోమే పుల్లలు దొరకనప్పుడు బ్రష్, పేస్ట్ ఉపయోగించుకోవచ్చు.

పళ్ళపొడికి ఉపయోగించే ఔషధాలు చాలా ఉన్నాయి. సైంధవలవణం, ఆవనూనె, శొంఠి, జామ ఆకుచూర్ణం, త్రిఫలా చూర్ణం, మొదలైనవి. మధ్యవేలితోనే పళ్ళుతోమాలి. తిన్నప్పుడల్లా పళ్ళు శుభ్రపరచుకోవాలి. రాత్రిళ్ళు పాలు త్రాగాక పళ్ళు తోముకోవాలి. లేకుంటే క్రిములు చేరతాయి. ఈ విధంగా పళ్ళు శుభ్రపరచుకుంటే రోగాలు దరి చేరవు.

*అనువాదం - కె.అరవిందమ్మ*
*ఏప్రియల్, అఖండజ్యోతి-1999*

## అన్యాయాన్ని ఎదిరించలేని జీవితం వ్యర్థం

*రెక్కలు తెగిన జటాయు పక్షిని ఒడిలోనికి తీసుకుని శ్రీరాముడు తన కన్నీటితో దానికి అభిషేకం చేశాడు. ఎంతో ప్రేమతో దాని తల మీద చేతితో రాస్తూ "నాయనా! రావణుడు అపరిమితమైన బలశాలి అని నీకు తెలుసును కదా! అటువంటి వానితో యుద్ధమెందుకు చేశావు?" అని అడిగాడు.*

*తన కన్నుల నుంచి ముత్యాలు రాలుస్తూ జటాయువు "ప్రభూ! నాకు మరణ భయం లేదు. కానీ అన్యాయాన్ని ఎదిరించే శక్తి లేకుంటేనే భయం కలుగుతుంది." అని జవాబిచ్చింది.*

*అందుకు శ్రీరాముడు "నాయనా! నీవు ధన్యుడివి, నీ వంటి సంస్కారవంతుల ద్వారానే ఈ జగత్తుకు కళ్యాణం కలిగించే మార్గాన్ని చూపించడం జరుగుతుంది." అని అన్నాడు.*

**సత్యం కోసమే తపిస్తాను - జీవిస్తాను - మరణిస్తాను - మహాత్మాగాంధీ.**



ధారావాహిక: హనుమత్ కథామృతం-23

# బాల హనుమాన్‌పై వజ్రాయుధ ప్రయోగం

అస్తవ్యస్తమైన ఆలోచనలనుండి ఇంద్రుడు కొద్దిగా తేరుకున్నాడు. మళ్ళీ ఒక్క క్షణం తీక్షణంగా ఆలోచించాడు. ఒక్కసారిగా కుడిచేతిలో ఉన్న వజ్రాయుధాన్ని బలంగా పట్టుకున్నాడు.

వజ్రాయుధం అంటే ఏమిటి? ఎలా తయారయింది? ఎవరు ఎవరికి ఇచ్చారు? ఎందుకు ఇవ్వబడింది? అన్న విషయాలు ఇంద్రుని మనస్సులో ఒక్కసారిగా సినిమా రీలు వలె తిరగడం మొదలు పెట్టాయి. వృత్రాసురుని వధ కనులముందు కదలాడింది.

వృత్రాసురుడు భయంకరమైన రాక్షసుడు. దీక్షగా, ఘోర తపస్సు చేశాడు. అనేక వరదానాలు పొందాడు. ముల్లోకాలను స్వాధీనపరచుకున్నాడు. స్వర్గాన్ని రక్షించుకోవడానికి దేవతల బలం సరిపోలేదు. నిరాశతో దేవతలందరు బ్రహ్మదేవుని శరణు వేడారు. దేవతల ప్రార్థన విని బ్రహ్మదేవుడు ధ్యానమగ్నుడయ్యాడు.

కొద్ది సేపటికి కన్నులు తెరిచాడు. చిరునవ్వుతో ఇంద్రునివైపు చూశాడు. మనమంతా ఇప్పుడు విష్ణుమూర్తి దగ్గరకు వెడదాం అన్నాడు. అందరు విష్ణుమూర్తిని చేరుకున్నారు. దేవతలందరినీ వెంటబెట్టుకుని వచ్చిన బ్రహ్మదేవుని చూచి శ్రీహరి చిరునవ్వునవ్వాడు. వచ్చినకారణం అడిగాడు. "ప్రభూ! సర్వాంతర్యామి అయిన మీకు తెలియంది ఏమీలేదు. వృత్రాసురుడు వరగర్వంతో దేవతలను హింసిస్తున్నాడు. ఆతనిని వీరెవ్వరూ ఎదిరించి నిలవలేకపోతున్నారు. వీరి అస్త్రశస్త్రాలు ఏవీ పని చేయడంలేదు. మీ శరణుకోరి వచ్చారు మీరే ఏదైనా దోవ చూపించాలి". అంటూ విషయం వివరించాడు.

ఇంద్రుని మాటలు విని శ్రీహరి కొంచెంసేపు గంభీరంగా మారి పోయాడు. మెల్లగా "ఇంద్రా! ఆ మహా రాక్షసుణ్ణి ఇప్పుడు నా సుదర్శన చక్రం, ఈశ్వరుని త్రిశూలం కూడా ఏమీ చేయలేవు. వీటన్నిటికీ అతీతంగా వరాలు సంపాదించుకున్నాడు. ఆతనిని జయించాలంటే ఒకే ఒక ఉపాయం ఉంది" అని పూర్తిగా అన్నాడో లేదో అందరు ఒక్కసారిగా చెప్పండి స్వామీ! చెప్పండి' అంటూ తొందర చేశారు. "దేవతలారా! తొందరపడవద్దు. ముందునేను చెప్పేది శ్రద్ధగా వినండి. తర్వాత ఏం చెయ్యాలో, ఏం చేస్తారో ఆలోచించండి" అని మరలా మొదలు పెట్టాడు. "మహా తపస్సంపన్నుడైన మహర్షి యొక్క ఎముకలతో చేసిన ఆయుధంతోనే వృత్రాసురుని వధ జరగాలి" అనగానే దేవతలు హతాశులయ్యారు. ఆలోచనలో పడ్డారు. మహర్షి ఎముకలతో తయారు చేసిన ఆయుధం అంటే! ఒక తపస్విని పట్టి వధిస్తేనే గదా అది సాధ్యం అయ్యేది. ఏమిటీ పరీక్ష? అని బిత్తరపోతున్నారు. అది గమనించిన విష్ణుమూర్తి. "దేవతలారా! నిరాశపడకండి. అక్కరలేని ఆలోచనలతో బాధపడకండి. సకలసృష్టిలో సర్వశ్రేష్ఠ తపస్వి మన దధీచి. ఆతని హత్య చేయడం ఎవ్వరితరమూ కాదు. ఆయన గొప్ప శివభక్తుడు. సదాశివుని వలెనే ఆతడుకూడ దయా సముద్రుడు. తన ఆరాధ్యుని వలె అడిగిన వారిని నిరాశతో తిరిగి పంపించడు. మీరు ఆయనను శరణు వేడవచ్చు" అన్నాడు.

ఇంద్రాదులు మరల ఆలోచనలో పడ్డారు. ఇతరుల క్షేమం కోసం తన ఎముకల్ని దానం చేసేవారు కూడా లోకంలో ఉన్నారా? ఇది సాధ్యమా? కాని చెప్పింది సర్వాంతర్యామి అయిన శ్రీహరి కదా! అనుకుంటూ బయలు దేరారు. అందరూ బిక్కు బిక్కు మనుకుంటూ దధీచి ఆశ్రమం చేరుకున్నారు. చల్లకు వచ్చి ముంత దాచుకుంటే లాభం లేదుకదా! భయపడుతూనే తమ అవసరాన్ని, కోర్కెను దధీచి ముందు విప్పి చెప్పారు. మహర్షికి జీవన మరణాలు, సుఖదుఃఖాలు, కష్టసుఖాలు అన్నీ సమానమే. ఇంద్రునితో "ఇంద్రా! ఏమి నాభాగ్యము! అశాశ్వతమైన నా ఈ శరీరం సమాజకల్యాణానికి ఉపయోగపడుతుందా?" అని ఆనంద పడుతూ ఉంటే ఇంద్రాది దేవతలు తమచెవులను తామే నమ్మలేకపోతున్నారు. అన్నివేళలా తన స్వార్థాన్ని మాత్రమే ఆలోచించే ఇంద్రుడు ఇలాంటి సన్ని వేశాన్ని ఊహించనుకూడా ఊహించలేదు. ఎంతటి దయామయుడైనా స్వయంగా ఎముకల్ని దానం చేస్తాననడం కొరుకుడు పడడంలేదు. అయినా జరుగుతున్నది వాస్తవం అని తెలియగానే కొన్ని క్షణాలు ఏమీ మాట్లాడలేకపోయాడు.

ఇంద్రునివైపు తదేకంగా చూస్తూ దధీచి మహర్షి తన ఆశ్రమంలో పద్మాసన స్థితిలో కూర్చున్నాడు. కన్నులు

ప్రపంచాన్ని సృష్టించేది సత్యమే - అరవిందుడు.

మూసుకున్నాడు. దీర్ఘమైన శ్వాస తీసుకున్నాడు. కాని ఎందుకోగానీ మరల కన్నులు తెరచి ఇంద్రుని వైపు చూచాడు. "దేవేంద్రా! మీతో నాదొక విన్నపం" అంటూ అనుమానిస్తున్నాడు. చెప్పండి మహర్షీ! నన్ను ధన్యుణ్ణి చేయండి" అన్నాడు ఇంద్రుడు.

"ఇంద్రా! ఇది కేవలం నా కోరిక మాత్రమే. నా అస్థికలతో చేసిన ఆయుధాన్ని దుర్మార్గుల మీద మాత్రమే ప్రయోగించాలి. దైవ భక్తుల మీద ప్రయోగించరాదు" అని మాట తీసుకున్నాడు. మాట తీసుకుంటూ"దేవేంద్రా! ఈ మాటను నీవు ఎప్పటికీ తప్పక పాటించాలి. ఇది నామృత్యుసమయంలో ఇస్తున్న మాట. ఎప్పటికీ గుర్తుపెట్టుకోవాలి" అని గట్టిగా నొక్కి చెప్పాడు.

ఈ విధంగా పలికి మహర్షి ధ్యానంలో నిమగ్నుడు అయ్యాడు. ఆయన ప్రాణపక్షి పైకి ఎగిరిపోయింది. సుషుమ్నా మార్గం ద్వారా ఆతని చైతన్య శక్తి సహస్రార చక్రంలోనికి చేరిపోయింది. కొద్దిక్షణాలు మౌనం రాజ్యం చేసింది. తరువాత ఓంకార నాదం వినిపించింది. మహర్షి ప్రాణాలు మహాదేవునిలో విలీనం అయ్యాయని అందరికీ అర్థం అయిపోయింది. దేవవైద్యులు అశ్వినీకుమారులు మహర్షిశరీరాన్ని పరీక్షించారు. ఆయన ప్రాణాలు విడిచినట్లు వారు తేల్చి చెప్పేశారు. దేవతల ఆశయం నెరవేరింది. అయినా ఇలాంటి మహా భక్తులు, మహా త్యాగులు లోకంలో ఉంటారా? అన్న ఆశ్చర్యం నుండి తేరుకోలేకపోతున్నారు. ఇంతవరకు వాళ్ళకు తెలిసింది ఏమంటే మానవులు దేవతలను ఏదో ఒకటి కోరుకుంటూ ఉంటారు. కానీ ఈనాడు దానికి విరుద్ధంగా జరిగింది. దేవతలే మానవుని వరం కోరుకోవడం, ఆతను నెరవేర్చడం వారికే వింతగా ఉంది.

ఇంద్రుడు దేవశిల్పి విశ్వకర్మను పిలిపించాడు. ఇంద్రుడుసైగ చేయగానే దధీచి శరీరం నుండి ఎముకలను వేరు చేశాడు. తన నేర్పును ఉపయోగించి వజ్రాయుధాన్ని తయారు చేశాడు. దాన్ని ప్రయోగించి ఇంద్రుడు వృత్రాసురుని వధించాడు. స్వర్గాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. తరువాత్తరువాత ఈ వజ్రాయుధం అనేకమంది రాక్షసులను వధించడానికి ఉపయోగ పడింది. ఇంద్రుని వజ్రాయుధం అంటే అమోఘమైనదిగా పేరుపడి పోయింది. ఇంద్రుని చేతిలో అది ఎన్నడూ ఓటమిని చవిచూడలేదు. ఒకానొక మహా తపస్వి యొక్క అస్థికలతో చేయబడిన ఆయుధం ఆయన త్యాగానికి చిహ్నం. అది ఓటమి చెందడం అనేది దుర్లభం.

ఈనాడు అదే ఆయుధం ఇంద్రుని చేతిలో ఉంది. దానినే బలంగా పట్టుకున్నాడు. సహజంగా తన ఆయుధాలు ఏవీ పని చేయలేకపోయినప్పుడే దీనిని ఉపయోగించేవాడు. కాని ఈనాడు తన ఎదురుగుండా గ్రహరాజు రాహువు ఉన్నాడు. ఆతని ప్రభావమన్నా కావచ్చు. మరేదయినా కావచ్చు. దేవేంద్రుడు తన వజ్రాయుధాన్ని బలంగా బాలుడైన హనుమాన్ పై విసిరివేశాడు.

*(అఖండజ్యోతి, మే 2009)*

## కదిలించే కళ్లు

21.సీ॥ గోముఖక్షేత్రాన గొప్ప గొప్ప ఋషులు
స్థూలదేహాలతో చూచుచుండ్రి
వారితో కలిపించి వైనంబుతోడుత
భావిపనుల గూర్చి దోవ చూపి
రెండు క్షేత్రంబులన్ రెండు రూపాలతో
ఒక్కటే సమయాన ఒప్పునటుల
స్థూల సూక్ష్మ సరణి సూక్ష్మంబుగా దెల్పి
తీర్చిదిద్దగలను తిరముగాను

తే॥ అనెడి గురుదేవు పల్కుల నాదరించి
ఆచరించిన విధమంత తూచినటుల
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

22.సీ॥ "బ్లావటస్కీ తాను భవ్యమౌ భావాల
సిద్ధయోగినియంచు స్థిరతగాంచె
స్థూల దేహంబుతో సూక్ష్మ దేహులతోడ
సంబంధముల్ కల్గిసాగు చుండె
మహిమాన్వితంబైన మంచుకొండల మధ్య
సిద్ధయోగుల గూర్చి చేర్చి వ్రాసె
ఆమె వ్రాసిన వారి నందరన్ చూపింతు
కల్లగాదు వినుము కనుము నీవు"

తే॥ అనెడి గురుదేవు పల్కుల నాదరించి
ఆచరించిన విధమంత తూచినటుల
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

రచన-మధుర కవయిత్రి
పొన్నూరు హైమవతీ శాస్త్రి

ప్రపంచం యొక్క అందచందాలు నీ దృష్టిని బట్టే కనిపిస్తాయి.

కుటుంబ నిర్మాణం

# యుగనిర్మాణంలో రెండవ చరణం

యుగ నిర్మాణంలోని మొదటిచరణం ఆత్మ నిర్మాణమైతే, రెండవ చరణం కుటుంబ నిర్మాణం. మానవులందరూ కుటుంబాన్ని ఏర్పరచుకునే జీవిస్తారు. స్నేహ, సహకారాలు పరస్పరం ఇచ్చి పుచ్చుకునే వరకు ఆత్మకు తృప్తి కలగదు.

ఒక విధంగా కుటుంబమే ఒక చిన్న దేశం. విస్తృతమైన సమాజానికి సంక్షిప్తరూపం. యుగనిర్మాణశక్తిని వికసింపచేసుకోవటానికై కుటుంబమనే పాఠశాలలో శిక్షణ పొందాలి. భోజనం, వస్త్రాలు, సరదాలు, చదువు మొదలైనవి ఏర్పరచినంత మాత్రాన కుటుంబ అవసరాలు పూర్తికావు. ఈ కుటుంబంలోని ప్రతి ప్రాణికీ సమున్నతమైన సంస్కృతిని అందించినప్పుడే అది పూర్తవుతుంది. ధనాన్ని అనుసరించి విలువైన వస్త్రాలు, భోజనం, వినోదాలు, ఇతర సుఖసాధనాలు లభించవచ్చు. కానీ సమగ్రమైన వ్యక్తిత్వ వికాసానికై కావలసిన సంస్కారాలు సరియైన వాతావరణంలో మాత్రమే లభిస్తాయి. ఇటువంటి వాతావరణం కొంటే దొరికేది కాదు. దానిని మనం స్వయంగా ఏర్పరచుకోవాలి. గొప్పవారు కావడం తేలికేకానీ ఉత్తములుగా, సజ్జనులుగా కావడం చాలా కష్టం. సుఖ, శాంతులతో ఉండడం, తోటివారిని సంతోషపర్చి, సంతృప్తులను చేయడానికై గొప్పదనమేకాక విశాలహృదయం కూడా అవసరం. దీనిని పొందటమే మానవ జీవితంలో గొప్ప విశేషం. చీకటికి స్వతంత్రమైన అస్తిత్వం లేదు. వెలుగు లేకపోవడమే చీకటి. ఈ మాటే కుటుంబ వాతావరణంలో కూడా పనికి వస్తుంది. ఎక్కడ సద్భావనలు పెంచి, పోషింపబడవో అక్కడ చెడు ఆలోచనలు, చెడు ప్రవర్తనలు అనే ముళ్ళ మొక్కలు మొలుస్తాయి. వాటిముళ్ళు గుచ్చుకోకుండా ఉండవు. ఇదే కుటుంబ కలహాలకు, క్లేశాలకు కారణమౌతుంది. అధిక ధనం, అధికమైన వైభవం పొందిన మానవులు సుఖ శాంతులతో గడపలేరు. ఆనందం, ఉల్లాసం సంస్కారవంతులైన వ్యక్తులలో భాగమౌతాయి. వారు స్వయంగా సంతృప్తులై ఉండడమే కాక తోటి వారికి కూడా ఆనందాన్ని ప్రసాదిస్తారు.

కుటుంబ నిర్మాణం వస్తుతః ఒక దర్శనం.దానిని పనుల వరకే హద్దులను ఏర్పరచి ఉంచలేం. ఏవిధమైన వ్యవస్థను కోరుకుంటారో దానికోసమై కుటుంబసభ్యుల మనఃస్థితిని ఏర్పాటు చేయాలి. ఇది సిద్ధించాలంటే మనోయోగాన్ని, సమయాన్ని, శక్తిని వినియోగించాలి. ఈ వారసత్వ నిర్వహణ ఎంత ముఖ్యమైనదో అర్థం చేసుకున్నప్పుడే ఈ అభిరుచి, తత్పరత, నిమగ్నత కలుగుతాయి.

ఈ విషయంలో కుటుంబ వాతావరణం సరిఅయిన పద్ధతిలో ఉండడం. కుటుంబ సభ్యులను సరియైన మార్గం వరకు చేర్చడం దీనిలో ఒక భాగం మాత్రమే. కుటుంబ నిర్మాణంలో రెండవది, ముఖ్యమైనది స్వయంగా వారి అలవాట్లను, విశ్వాసాలను, ప్రవర్తనను నిర్ధారించుకుని, నియంత్రించుకోవాలి. ఈ పని కుటుంబమనే ప్రయోగ శాలలోనే సాధ్యమౌతుంది. నీటిలో దిగకుండా ఈదటమోలా సాధ్యమౌతుంది?

దీనికై కుటుంబాన్ని మించిన సాధనం ఇంకొకటి లభించదు. ఏ జనుల మధ్య మనం నివశించవలసి ఉంటుందో వారిని మార్చే ప్రయత్నం చేయాలి. మన ప్రవృత్తిని కూడా మార్చుకోవాలి. ఇతరులను ప్రభావితం చేయగలిగే విధంగా మన వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకోవాలి.

జీవనోపాధికై వెచ్చించే సమయాన్ని మినహాయించి మిగిలిన సమయంలో కొంత సమయాన్ని కుటుంబనిర్మాణానికై ఉపయోగించాలి. పేకాట, సినిమాలు, కబుర్లు, బద్ధకం, పనులు చేయటంలో నిరుత్సాహం మొదలైన వానివల్ల మనం చాలా సమయాన్ని కోల్పోతుంటాము. లెక్క చూసుకుంటే మనం ఎంత సమయాన్ని వృథా చేస్తున్నామో తెలుస్తుంది. మనం ఈ సమయాన్ని కుటుంబనిర్మాణానికి అవసరమైన, ముఖ్యమైన పనులు చేపట్టవచ్చు. మనోల్లాసంలో ముఖ్యమైనది, సార్థకమైనది, తేలికైనది కుటుంబనిర్మాణం మాత్రమే. ఇందులో కేవలం మనమేకాక కుటుంబ సభ్యులందరూ సంతోషాన్ని పొందుతారు.

వికృతమైన, చెడు వ్యవస్థలతో సమరం చేసేందుకై కుటుంబ సభ్యులందరూ శౌర్య-సాహసాలను పెంపొందించుకోవాలి. పరిశుభ్రతపై మంచి అభిరుచిని పెంచుకోవడం ఈ ఉద్యమంలోని

**గౌరవాన్ని పోగొట్టుకున్నాక చచ్చినా, బ్రతికినా ఒక్కటే - శరత్.**

రెండవభాగం. కుటుంబంలోని ప్రతి సభ్యుడు మంచి వ్యవస్థను ఏర్పరచడానికై శ్రద్ధతో వ్యవహరించడం అలవాటు చేసుకోవాలి. ఈ అలవాటు వస్తువుల్ని అందమైన పద్ధతిలో ఉంచటం వరకే పరిమితం చేయక ఆలోచనలను, కర్తవ్యాలను, ఇతర క్షేత్రాలవరకు విస్తరింపచేసేదిగా ఉండాలి. మానవులను జాగరూకులను చేసేందుకు అసాధారణమైన రూపంలో సహాయపడేలా ఉండాలి. చిన్న పనులను ఏవగించుకోక, మంచి వ్యవస్థలో ఉత్పాదకతను మనోరంజనగా భావించి, ఖాళీ సమయాన్ని ఉపయోగించుకోవాలి. బద్ధకంతో పనులను అర్థాంతరంగా వదిలివేయకూడదు. మంచి అలంకరణపట్ల అభిరుచి పెంచుకోవడం వంటి మంచి గుణాలను పెంచుకోవాలి. ఇది చూడటానికి చిన్నవిగా కన్పించనప్పటికీ, ప్రకృతిలోని అంగాలై ఎదురుగా కన్పించే పనులను సరియైన పద్ధతిలో చేయడం వల్ల కలిగే విజయంలో ముఖ్యభాగాలౌతాయి.

కుటుంబంలో జ్ఞానాభివృద్ధికై కావలసిన అవసరాలను పూర్తిచేయాలి. జీవితంలో, సమాజంలో గల సమస్యలను అర్థం చేసుకోకపోవటం వల్ల వ్యక్తులు మోసపోవలసి వస్తుంది. ప్రతి గృహస్థు వీలయిన సమయంలో వార్తలద్వారా, కథలద్వారా అవసరమైన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. కథలు చెప్పడం ద్వారా మానసిక సంతోషం, ఆకర్షణ కూడా కల్గుతాయి. ఈ విధంగా పరోక్షంగా చెప్పబడిన విద్య ప్రభావం మనసుపై పడుతుంది. పంచతంత్రం, హితోపదేశం పేరుగల సంస్కృత గ్రంధాలు మూర్ఖులైన రాజకుమారులను యోగ్యులుగా చేశాయి. మనం కూడా ఆ రీతిరివాజులను సొంతంచేసుకుని, కుటుంబ సభ్యులకు ఉపయోగకరమైన మార్గదర్శనం చేస్తూ ఉండవచ్చు.

ఇంట్లో ఆస్తిక వాతావరణం నెలకొని ఉండాలి. ఇంట్లోని ప్రతివారూ భగవంతుని స్మరిస్తూ, సమస్కరించే అలవాటు కలిగి ఉండాలి. సరియైన స్థానంలో గాయత్రీ మాత చిత్రాన్నుంచి, దినచర్య ప్రారంభించే ముందు ఆ చిత్రానికి నమస్కరించి కనీసం 5 సార్లైనా గాయత్రీ మంత్రాన్ని జపించి ముందుకు సాగటం అలవాటు చేసుకోవాలి. నియమబద్ధమైన పరంపరను ఏర్పరచటంలో ఈ కొంచెం సమయం కూడా తక్కువ విలువైనది కాదు. దాని వలన పిల్లలలో ఆస్తికత ఏర్పడి వృద్ధి పొందుతుంది. దీని ఫలితంగా ఉత్తమమైన ఆదర్శాలు లభిస్తాయి. సాయంత్రాలలో సామూహికంగా హారతి నివ్వటం, సంగీతసభలను ఏర్పాటు చేయటం వలన ఉత్సాహం, సద్భావనా వాతావరణం ఏర్పడుతాయి.

చదువుకున్నవారు చదువురానివారికి చదువు చెప్పడం, కలిసి ఆడటం, కలిసి సేవచేయడం ఎవరికి వచ్చినది వారు ఇతరులకు నేర్పడం చేయాలి. భోజనం కలిసిచేయాలి. భోజనం తయారు చేసే సమయంలో కూడా అందరు కలిసి పని చేయాలి. ఈ విధంగా చిన్న పెద్ద పనులన్నింటిలోనూ ఒంటరిగా కాక కలిసి పని చేయాటం వల్ల సహకార ప్రవృత్తి పెరిగి మంచి ఫలితాలు కన్పిస్తాయి. ఎవరైనా ఖిన్నులైనా, ఉదాసీనంగా ఉన్నా, కోపంగా ఉన్నా వారిని వదిలివేయక కారణం తెలుసుకునేందుకు, పరిష్కారం కనుక్కొనేందుకు ప్రయత్నం చేయాలి. ప్రతివారూ ఇతరులను గౌరవంగా సంబోధించాలి. మీరు అని సంబోధించి, చివరన గారు చేర్చాలి. ఇది కుటుంబసభ్యుల సభ్యతను తెలియచేస్తుంది.

కుటుంబ సభ్యుల సహకారం నియమబద్ధమైన రూపంలో వికాసం పొందాలి. ప్రతి సభ్యుడు వారి కర్తవ్యాన్ని, అధికారాన్ని మర్యాదలను అర్థం చేసుకోవాలి. కొందరు మౌనంగా శ్రమిస్తుంటే, మరి కొందరు ఊరికే తిరుగుతూ ఉండకూడదు. పెద్దవారు, వృద్ధులు కూడా ఖాళీగా కూర్చోకుండా, వారి శక్తిని అనుసరించి పని చేస్తూ కుటుంబవికాసానికి పాటుపడాలి.

కుటుంబాన్ని ఒక సమాజంలాగా, దేశంలాగా భావించాలి. దీని ఆకారం చిన్నదైనా, సమాజంలోనూ, దేశంలోనూ ఉండే సమస్యలన్నీ కుటుంబంలో కూడా ఉంటాయి. ప్రధానమంత్రి లేక రాష్ట్రపతి దేశాన్ని సమున్నత స్థానంలో నిల్పడానికి ఏ విధంగా ఆలోచిస్తారో అదే విధంగా గృహస్థులు కూడా కుటుంబనిర్మాణానికై ఆలోచించాలి. మంచి తోటమాలి ఏ విధంగా తన ఉద్యాన వనాన్ని అందంగా, వికసింపచేయటానికి ప్రతి మొక్కపై ధ్యాసనుంచి వాటికి కావలసిన నీటిని అందిస్తూ జాగ్రత్త వహిస్తాడో అదే విధంగా కుటుంబంలోని ప్రతి ఒక్కరూ మంచి సంస్కార వంతులవటానికి వారితో నెమ్మదిగానూ, అవసరమైనప్పుడు కఠినముగానూ వ్యవహరిస్తూ ఉండాలి.

యుగనిర్మాణంలో రెండవ చరణమైన కుటుంబ నిర్మాణం లక్ష్యాన్ని సిద్ధింపచేయటంలో ముఖ్యమైన పాత్రను వహిస్తుంది.

*అనువాదం – ఎ.ఆర్.నిర్మల*

**బుద్ధిని పోగొట్టుకుంటే అన్నింటిని పోగొట్టుకున్నట్లే.**



ధారావాహిక : భక్తిగాథ-28

# భక్తునికి అహంకారము శోభనుఇవ్వదు

హర్షోల్లాసాలతో నిండిన అంతఃకరణలతో ఋషులూ మొదలైన వారంతా పులకించి పోయారు. భావనలు భక్తిమయమైనపుడు ఆధ్యాత్మిక తత్వాలు ప్రకాశిస్తాయి. భక్తునికీ భగవంతునికీ మధ్య అడ్డంకిగా నిలిచేది అహంకారము. అది భక్తుని భగవంతునితో కలువనివ్వదు. అది భక్తుని పతనావస్థకు తీసికెళ్తుంది, విషయలాలసలనేగాలి వివేకంఅనే దీపాన్ని ఆర్పివేస్తుంది. మనస్సు పతనమైనపుడు ఇక ఏమి మిగుల్తుంది? యుగయుగాల నుండి సాధకుని స్థితి ఈ విధంగానే తయారవుతోంది. ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తున్నవాడు ఈ విధమైన అనుభవాన్ని అనుభవిస్తూనే ఉన్నాడు.

భగవద్భక్తుడైన దేవర్షి మనస్సులో గతంలోని సంఘటనను గురించి స్మృతి తరంగాలు కదులుతున్నాయి. అందరూ మౌనంగా దేవర్షి తన భక్తి సూత్రాన్ని గురించి ఆలోచిస్తున్నారేమోనని భావించారు. కానీ వారు గతంలో తనకు కలిగిన అనుభవాన్ని గురించి తలచుకుంటూ తన క్రొత్త సూత్రంతో దాన్ని జోడించుకుంటున్నారు. వారి అంతర్గతాన్ని గురించి ఎవ్వరికీ చెప్పకపోయినా ప్రజ్ఞాలోకంలోని సత్ప్రకాశం బహిర్గతమౌతుంది.

ఈ ప్రకాశాన్ని తెలుసుకున్న బ్రహ్మర్షి విశ్వామిత్రుడు దేవర్షితో మేమంతా మీ క్రొత్త, సూత్రం కోసం నిరీక్షిస్తున్నామని అన్నారు. దేవర్షి నెమ్మదిగా ఇలా ఉచ్చరించారు.

*"ఈశ్వరస్యాప్యభిమాన ద్వేషిత్వాద్ దైన్య ప్రియస్వాచ్చ" (27)*

**అర్థం:** ఈశ్వరునికి గర్వమంటే ద్వేషం, వినయమంటే ప్రేమ. అందరి ముఖాల్లో ఈ సూత్రం యొక్క వివరణ తెలుసుకోవాలన్న ఆకాంక్షను దేవర్షి గమనించాడు.

తన అనుభవాన్ని గురించిన సత్యాన్ని చెప్పనారంభించారు. ఇప్పుడు నేను చెప్తున్నది చాలా కాలం క్రితం నాకు అనుభవమైన సంఘటన. ఐనా ఇప్పుడిప్పుడే జరిగినట్లుగా అనిపిస్తోంది. హిమాలయ ప్రాంగణంలోనే నాకీ అనుభవం కలిగింది. హిమాలయశ్వేత కిరణాల కాంతి అప్పుడూ ఇలాగే ఉంది. వెండీ, బంగారు కిరణాల కాంతి ప్రకాశిస్తోంది. క్షీర సాగర శయనుడైన శ్రీమన్నారాయణుని దర్శించి నేను తిరిగివెళుతున్నాను. ఆకాశమార్గంలో వెళ్తున్న నన్ను హిమాలయ ఆధ్యాత్మికత ఆకర్షించింది. ఈ అనూహ్యమైన ఆకర్షణకు నేను క్రిందికి దిగాను.

"హిమాలయాల్లో భ్రమిస్తున్నాను. అక్కడి చెట్లూ, పశుపక్షులూ, నాకు సహచరులయ్యాయి. ఆనంద పారవశ్యంలో అలా తిరుగుతూ తిరుగుతూ ఒక గుహను చేరాను. ఆ హిమగుహలో కూర్చొని సమాధి స్థితిలో ఉండిపోయాను. నా సమాధి స్థితిని చూచి దేవేంద్రునికి భయం పట్టుకుంది. వెంటనే మన్మధుని తన సహచరులతో నా వద్దకు పంపాడు. వారంతా ఎన్ని కామ చేష్టలు చేసినా ప్రభు స్మరణ అనే కవచాన్ని ధరించిన నన్ను ఏమీ చేయలేకపోయాయి. నేను సురక్షితంగా ఉండిపోయాను. సమాధిస్థితి నుండి తేరుకున్న తర్వాత వారంతా నాకు పాదాభివందనం చేసి క్షమించుమని ప్రార్థించారు. నేను సహజ భావంతో వారిని క్షమించాను."

ఇంతవరకు సాత్వికభావంతో జరిగిన సంఘటనలో ఆకస్మాత్తుగా ఎక్కణ్నుంచీ వచ్చిందో గానీ రాజస అహంకారం నాలో ప్రవేశించింది. ప్రభు కృప వల్ల జరిగిన ఈ సంఘటనకు నేనే కర్తనని విర్రవీగసాగాను. మన్మధుని జయించానన్న గర్వం నన్ను ఆవరించింది. నేను కర్తనన్న భావనా కాలుష్యం మనసుని మలినపరచింది. దేవలోకానికి వెళ్ళి నా గొప్పను చెప్పుకున్నాను. అందరూ ప్రశంసించారు. అక్కణ్ణుంచి బ్రహ్మలోకానికి వెళ్లాను. బ్రహ్మదేవుడు నన్ను హెచ్చరించాడు. గర్విష్టికి ఈ హితబోధ ఎలారుచిస్తుంది? శివలోకానికి వెళ్ళి చెప్పుకున్నాను. సదాశివుడు నన్ను హెచ్చరించి "ఈ కథను నాకు చెప్తే చెప్పావుకానీ శ్రీహరికి చెప్పవద్దన్నాడు." కానీ గర్వం అనే తీవ్రమైన జ్వరం నా చిత్తాన్ని వహించింది. విష్ణుభగవానుని వద్దకు వెళ్ళి నా గొప్ప చెప్పుకున్నాను. బదులుగా శ్రీహరి మందహాసం చేశారు. ఆ చిరునవ్వుకు అర్థం ఏమిటో నాకు అప్పుడు బోధపడలేదు. కాని భగవతి యోగమాయ గ్రహించింది. నా గర్వాన్ని అణచాలని అనుకుంటున్నారని తెలుసుకుంది. అప్పటికప్పుడు తన మాయతో ఒక రాజ్యాన్ని తయారుచేసింది. ఆ రాజ్యానికి రాజు శీలనిధి. రాజ కన్యవిశ్వమోహిని. నేను వెళ్తూ వెళ్తూ ఆ నగరానికి వచ్చాను. రాజకన్య అందానికి ముగ్ధుడనయ్యాను. కామరోగం నన్ను

**ప్రతి మనిషీ నిత్యం పరిశీలించేది ఎదుటి వారి పొరపాట్లనే.**

పట్టుకుంది. కామంతో విహ్వలుడనై నేను ఈ రాజకన్యతో వివాహం జరిపించుమని భగవంతుని ప్రార్థించాను.

రాజకన్య వివాహ స్వయంవరంలో శివగణాలు కూడా ఉన్నాయి. సదా శివుడు నన్ను హెచ్చరించినా అర్థం చేసుకునే స్థితిలో నేను లేను. ఆయన నన్ను ఎగతాళి చేసినా గ్రహించలేకపోయాను. రాజకన్య వరమాలను విష్ణువు మెడలో వేయడం చూచి నేను సహించ లేకపోయాను. రాగం ద్వేషంగా మారి ప్రభువును శపించాను. శాప, వరదానాలేవీ అంటని ప్రభువు నాశాపాన్ని స్వీకరించాడు. ప్రభువు అధరాలపై చిరునవ్వు ఇంకా అలాగే ఉంది. ఆ చిరునవ్వే నా అజ్ఞానాన్ని పోగొట్టింది. జ్ఞానోదయం అయ్యాక ప్రభులీలలోని సత్యాన్ని గ్రహించాను. నా అహంకారాన్ని పోగొట్టడానికి పన్నిన సన్నాగమని గ్రహించాను. పశ్చాత్తాపపడ్డాను.

నేనేమి చేయగలను? ప్రాయశ్చిత్త విధానాన్ని తెలుపమని భగవంతుని ప్రార్థించాను. వారు ఎంతో దయతో శివశత నామాన్ని జపించుమని ఉపదేశించారు. ప్రభుఆదేశానుసారం నేనలాగే చేశాను. సదాశివుని అనుగ్రహం వల్ల నాకు జ్ఞాన, భక్తి, వైరాగ్యాలనే మహా సంపద మళ్ళీలభించింది. ఈ నా అనుభవాన్ని నేనెప్పటికీ మరిచిపోలేను. ఈ సత్యం నాలో ఎప్పుడూ మెదులుతూనే ఉంటుంది. భగవద్భక్తునికి అహంకారం ఉండకూడదు. అహంకారం ఉంటే భక్తి రాణించదు. ప్రభువుకు ఎల్లప్పుడూ నేను సేవకుడను అనే భావం ఉండాలి. దాని వల్లే అతనికి శుభం కలుగుతుంది.

*అనువాదం – కె. అరవిందమ్మ*
*(అఖండజ్యోతి – మే 2008)*

## చందాదారులకు గమనిక

**"యుగశక్తి గాయత్రి"** మాసపత్రిక చందాదారులకు మనవి చేయునది.

పత్రిక ఎటువంటి వ్యాపార ప్రకటనలు లేకుండా నడుపుట మీ అందరికి తెలిసినదే. ముద్రణా ఖర్చులు, కాగితం ఖర్చు పెరిగినందువల్ల మాసపత్రిక చందా రుసుమును ఈ క్రింది విధంగా పెంచటమైనది.

**వార్షిక చందా:- రూ॥ 120/- 3 సంవత్సరముల చందా:- రూ॥350/- 10 సంవత్సరముల చందా:- రూ॥ 1116/-**

**పోషకులు శాశ్వత చందా - రూ॥ 2516/- (10 రూ॥ల లోపు నూతన ముద్రణ పుస్తకములు ఎల్లప్పడు ఉచితం)**

**రాజ పోషకులు శాశ్వత చందా - రూ॥ 5116/- (25 రూ॥లలోపు నూతన ముద్రణ పుస్తకములు ఎల్లప్పడు ఉచితం)**

**మహారాజ పోషకులు శాశ్వత చందా - రూ॥ 10,116/- (50 రూ॥ల లోపు నూతన ముద్రణ పుస్తకములు ఎల్లప్పడు ఉచితం)**

**కార్యకర్తలకు మనవి :** మీ మీ పట్టణాలలో/గ్రామాలలోగల ప్రతిష్ఠిత వ్యక్తులను కలిసి మన యుగ నిర్మాణ మిషన్ విషయములను చెప్పి పోషకులు, రాజపోషకులు, మహా రాజపోషకులుగా చేర్పించగలరు. యుగశక్తి గాయత్రి మాసపత్రిక శాశ్వతంగా పంపబడును. ముఖ్యమైన గాయత్రీ పరివార్ కార్యక్రమాలన్నింటిలోనూ ముఖ్య అతిథులుగా పిలవబడుదురు.

## ◀ అందరికీ ఆహ్వానం ▶

26.03.2010 నుండి 03.04.2010 వరకు నారాకోడూరు గాయత్రీ శక్తిపీఠం నందు గాయత్రీ జప సాధనా శిబిరం నిర్వహించబడుతుంది. పాల్గొనదలచిన వారు 25.3.2010 సాయంత్రం నారాకోడూరు శక్తి పీఠమునకు చేరాలి. భోజన వసతి సౌకర్యముల ఏర్పాటు కలదు. సాధనలో తోడ్పడే పుస్తకములు ఆత్మకథ, అమృత కలశం, యమనియమములు, గాయత్రీ మహావిజ్ఞాన్ మూడు భాగములు, గాయత్రీ హవనవిధి, జపమాల కూడా అవసరం. సుమారు 200 రూపాయలు అయ్యే ఈ పుస్తకములు స్వాధ్యాయమునకు తప్పనిసరి. ఈ పుస్తకములు గాయత్రీ శక్తిపీఠం నందు లభ్యమవుతాయి. సాధకులకు పసుపు రంగు వస్త్రములు తప్పనిసరి.

**ఫోన్ : 0863 2534440, 0863 2534658**

సంప్రదించండి: **శ్రీ వాసుదేవానంద (కోట సుబ్బారావుగారు)**

**పర్యవేక్షకులు, గాయత్రీశక్తి పీఠం - నారాకోడూరు**

***గమనిక:*** *గుంటూరు – తెనాలి, గుంటూరు – పొన్నూరు మార్గమున నారాకోడూరు సెంటర్‌లో దిగి ఆటోలో శక్తిపీఠమునకు రావలయును.*

నిత్యం పరిశీలించాల్సింది ఇతరుల తప్పులు కావు - నీ పొరపాట్లు.

ప్రత్యేక వ్యాసం: మహా వీర జయంతి సందర్భంగా

# దీక్షాపరుడు మహా వీరుడు

ఇక్ష్వాకువంశంలో సిద్ధార్థుడు అనే రాజు పాలించేవాడు. ఆయన రాజధాని కుండినపురం. భార్యపేరు త్రిశల. సిద్ధార్థుడు ధర్మంగా పాలిస్తూ అందరి మెప్పుపొందాడు.

ఒకనాడు రాణి ధర్మాత్ముడైన కొడుకు పుట్టబోతున్నట్లు కలగాంచింది. ఆ కలవచ్చిన నాటి నుండి రాజ్యంలో అన్నీ శుభశకునాలే కనిపించసాగాయి. అన్ని రంగాలలో రాజ్యం ఉన్నతిని పొందసాగింది. చైత్రశుక్ల త్రయోదశి సోమవారం నాడు రాణికి పుత్రుడు పుట్టాడు. శిశువు బంగారు వర్ణంతో మెరిసిపోతున్నాడు. రాజదంపతుల ఆనందానికి అవధుల్లేవు. ఒకనాడు సంజయ్, విజయ్ అనే ఇద్దరు మహాత్ములు వచ్చి శిశువును దర్శించారు. వారి మనసుల్లోని సందేహాలన్నీ పటాపంచలయ్యాయి. వారికి నూతన జ్ఞానోదయమయింది. పిల్లవానికి వీరుడు, వర్ధమానుడు అని రెండు పేర్లు పెట్టారు.

ఒకసారి రాజకుమారుడు తన స్నేహితులతో కలసి చెట్టుపైకి ఎక్కుతూ దిగుతూ ఆడుకుంటున్నాడు. పిల్లవాడు చెట్టుపైకెక్కాడు. ఇంతలో ఎక్కడి నుండి వచ్చిందో కాని ఒక నల్ల త్రాచు చెట్టుపైకి ఎక్కింది. తోటి పిల్లలందరూ భయపడిపోయారు. కాని వర్ధమానుడు ఏ మాత్రం భయపడలేదు. పాము పడగలపై కాలు పెట్టి క్రిందికి దిగివచ్చాడు. అంతేకాదు, దాని తోకపట్టుకుని ఇష్టం వచ్చినట్లు ఊపేశాడు. ఆ విధంగా చాలాసేపు పాముతో ఆడుకున్నాడు. తరువాత బంగారు బిందెతో నీరు తెచ్చి బాలునికి స్నానం చేయించారు. ఆ రోజునుండి వీరుడు కాస్తా మహావీర్‌గా మారిపోయాడు.

5 సంవత్సరాల వయస్సులో ఆనవాయితీ ప్రకారం మహావీర్‌ని గురుకులంలో చేర్పించారు. అతడు కొద్ది కాలంలోనే విద్యలన్నీ నేర్చుకున్నాడు. 8 సంవత్సరాల వయస్సులోనే నిజమైన సుఖం త్యాగంలోనే ఉందని భావించాడు. లోకంలోని సుఖాలన్నీ దుఃఖంతోనే కలసిఉంటాయని నిర్ణయించుకున్నాడు. చిన్నవయస్సు నుండే అహింస మొదలైన కఠోర నియమాలను పాటించడం మొదలుపెట్టాడు. ఇంటిలో ఉన్నంతకాలం తన కర్తవ్యాలను తు.చ. తప్పకుండా పాటించేవాడు. ఈ జనన మరణాల దుఃఖాం నుండి విముక్తి ఎలా లభిస్తుందా? అని ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండేవాడు. తల్లి దండ్రుల మాటను, గురువుల మాటను గౌరవించేవాడు. పెండ్లి చేసుకోకుండా కఠోర బ్రహ్మచర్యాన్ని పాటించాడు.

ఆయన సంస్కృతంతోపాటు ఇతర భాషలలో కూడా విద్వాంసుడు. ఒక రోజున భగవంతుని గురించి ఆలోచిస్తూ ఉన్నాడు. ఎదురుగా ఆయన గత జన్మలన్నీ కనిపించసాగాయి. ఈ జన్మ వచ్చి కూడా 30 సంవత్సరాలు గడిచిపోయాయి. అయినా ఈ మోహబంధాలు వీడిపోవడం లేదు. అని అనుకోగానే అంతులేని దుఃఖం వచ్చింది. వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టాడు. ఒక్కసారిగా ఇల్లు వదిలి వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాడు. తల్లి దండ్రులను సమాధానపరచి అనుమతి తీసుకున్నాడు. ఇంటిని శాశ్వతంగా వదిలి వెళ్ళిపోయాడు. అడవికి చేరగానే రాజదుస్తులు, ఆభరణాలు తీసివేసి, గుండు గీయించుకున్నాడు. కఠోరమైన తపస్సును మొదలుపెట్టాడు. ఒకసారి 6 నెలలు సమాధి స్థితిలో ఉన్నాడు ఈ 6 నెలలు ఏమీ తినలేదు, త్రాగలేదు. తరువాత లేచి కులపురం వెళ్ళాడు. అక్కడి రాజు అతనికి స్వాగతం పలికాడు. ప్రేమగా భోజనం తినిపించాడు. భగన్నామం చేసుకుంటూ రాజ్యమంతా పర్యటించాడు. భయంకరమైన ఆడవుల్లో తిరిగాడు. అక్కడే నివసించాడు. ఒకసారి 'కౌశాంబి' అనే నగరానికి వెళ్ళాడు. అక్కడ 'చందన' అనే పేరుగల ఒక ఉత్తమురాలైన ధర్మాత్మురాలు పరిచయమైంది. ఆమె చేసిన ఉపదేశాలు మహావీరునిపై గొప్ప ప్రభావం చూపించాయి. ఆమె కూడా ఆజన్మ బ్రహ్మచారిణి. 36 వేల మంది స్త్రీలకు ధర్మాన్ని బోధించింది. జీవితమంతా ధర్మ ప్రచారానికే వినియోగించింది.

ఇల్లు వదలిన 12 సంవత్సరాల వరకు మహావీరుడు కఠోర తపస్సు చేశాడు. చివరకు ఋజుకుల నది ఒడ్డునగల (శాల) వేగిసచెట్టు క్రింద జ్ఞానాన్ని పొందాడు. ఆయన సందేహాలన్నీ తీరిపోయాయి. సమాజసేవకే అంకితమయ్యాడు. ప్రతాపవంతుడైన మగధరాజు శ్రేణిక బింబిసారుడు ఆయన పాదాల దగ్గర కూర్చుని ఉపదేశాలు వినేవాడు.

ఆ రోజుల్లో పండిత ఇంద్రభూతి గొప్ప విద్వాంసుడు. విద్వత్తువల్ల గర్విష్ఠిగా మారిపోయాడు. ఆయన ఒక రోజున మహావీరుని దర్శించాడు. ఆ పవిత్రదర్శనంతో ఆయన గర్వం పూర్తిగా నశించింది. అందరిలాగానే తాను కూడ మహావీరుని గురువుగా స్వీకరించాడు. మహా వీరుని మరణానంతరం ఇంద్రభూతికి సంపూర్ణజ్ఞానం లభించింది. ఒక్క ఇంద్రభూతే కాదు. అలాంటి మహామహా పండితులు అనేకమంది మహావీరుని గురువుగా భావించారు.

మహావీరుడు జ్ఞానాన్ని పొందిన తరువాత 30 సంవత్సరాలు ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించాడు. చివరకు పావాపురి అనే చోట దీపావళి పండుగ రోజున సంధ్యాసమయంలో దేహ బంధాలను వదిలించుకుని పరలోకగతుడయ్యాడు. ఆయన గోళ్ళను, వెంట్రుకలను సముద్రంలో పడవేశారు.

ఇప్పటికీ మనదేశంలో లక్షలాది ప్రజలు ఆయన స్థాపించిన జైన మతాన్ని అవలంబించి ధన్యులు అవుతున్నారు. బాలలూ! త్యాగంలోనే సుఖం ఉన్నదన్న విషయంపై మనస్సు నిలపండి.

★★★

**సమస్యలను ధైర్యంగా, తెలివిగా ఎదుర్కోవాలి.**



## పూజ్య గురుదేవుల అమృతవాణి-4

# శౌర్యం - సాహసం

మంచికైనా, చెడుకైనా విజయం సాధించాలంటే ముందుగా కావలసింది సాహసం. అంటే మనోబలం అన్నమాట, దాన్నే శౌర్యం అని కూడా అంటారు. ఒకరు ఇద్దరు బందిపోట్లు గ్రామంలో ప్రవేశిస్తారు. గ్రామస్థులందరినీ భయపెడ్తారు. చూస్తుండగానే సమస్తమూ దోచుకుని పారిపోతారు. అడవుల్లో ప్రవేశిస్తారు. గుట్టల్లో మిట్టల్లో పడి పరుగులు తీస్తారు. ఏ కందకంలోనో గుహలోనో దూరి నిద్రిస్తారు. అక్కడ ఎదురయ్యే పాములను, తేళ్ళను ఎదుర్కొంటూ కటిక చీకటిలో గడిపివేస్తారు. వారికి అక్కడ సహకరించేది శౌర్య సాహసాలే.

శరీర నిర్మాణంలో, బరువులో మనిషికీ మనిషికీ మధ్య పెద్దగా తేడా ఉండదు. అలాగే మామూలు మనిషికీ, బందిపోటుకూ మధ్య శారీరికంగా పెద్దగా తేడా ఉండదు. తేడా అంతా సాహసంలోనే. మహాపురుషులు గాని, బందిపోట్లుగాని రిస్కుతో కూడిన పనులనే చేపడతారు. ఆ రిస్కులను సాహసంతో ఎదుర్కొంటారు. ఈ శౌర్యం, సాహసాలను పెంచి పోషించేది జపం. జపం చేయడానికి శౌర్యం, సాహసం చాలా అవసరం. శౌర్య సాహసాలు లేని జపం యాంత్రికంగా సంప్రదాయాలను పాటించడమే అవుతుంది. కావలసిన ఫలితం రాదు. అందువల్లనే జపంలో అనుష్ఠాన శక్తిని గురించి గొప్పగా చెపుతారు. జపం కన్నా అనుష్ఠాన బలం ఎక్కువ. అనుష్ఠానంలో "గాయత్రీమంత్రం, మాల, జపం" అన్నీ అవే. అయినా అనుష్ఠానంలో శక్తి ఉద్భవిస్తుంది. ఎందుకు? అనుష్ఠానంలో కాఠిన్యత పాలు ఎక్కువ ఉంటుంది. మిమ్మల్ని నేను ఇప్పుడు చాంద్రాయణ వ్రతం చేయడానికి పిలిచాను. మీతో కఠినంగా ఉంటూ, నియమనిష్ఠలతో చేయించాలని నిర్ణయించుకున్నాను. ఇప్పుడు నేర్చుకున్న ఈ అనుష్ఠాన విధానం ప్రతీసారి పాటించాల్సి ఉంటుంది.

నా విషయంలో మా గురువులు చాలా కఠినంగా వ్యవహరించారు. ఆ కఠినత్వమేనన్ను మరింత బలవంతునిగా చేసింది. సమ్మెట దెబ్బలను తిని, తిని లోహం బలిష్ఠంగా మారుతుంది. దాంతో ఆయుధాలు తయారు చేస్తారు. పనిముట్లు తయారు చేస్తారు. సమ్మెట దెబ్బలు తిన్న తర్వాత, సాన పట్టిన తర్వాత ఖడ్గం పదునెక్కుతుంది. సానపట్టకపోతే ఖడ్గం ఎందుకూ పనికిరాదు. దానికర్తవ్యం అది నెరవేర్చలేదు. ఖడ్గాన్ని ఉపయోగించుకోవాలి అంటే పదును పెట్టక తప్పదు. కష్టం అనిపించినా సాన పట్టాల్సిందే. అనుష్ఠానానికి కూడ ఇదే సూత్రం వర్తిస్తుంది. అనుష్ఠానానికున్న సామాన్య నియమాలను నవరాత్రుల సందర్భంగా తెలుసుకున్నాం. నవరాత్రి అనుష్ఠానాలు మీరు చేసి ఉంటే మీలో మార్పు వచ్చేది. 27 మాలల జపం చేయాలి. ఏ విధంగా చేయాలి? చాపమీద పడుకుని కూడా మానసిక జపం చేయవచ్చునని చెప్పాను. మీ శక్తిసామర్థ్యాలను గమనించి, మిమ్మల్ని ఎక్కువగా బంధనాలలో బిగించలేదు.

మన ఉపాసనలో సంకల్పబలం, మనోబలం ఉంటే ఉపాసన ఫలిస్తుంది. శక్తివంతం అవుతుంది. ఉపాసనలో, అనుష్ఠానంలో ఉన్న కాఠిన్యాన్ని, దాని ఫలితాన్ని మీరు కూడా అర్థం చేసుకోవాలి. ఆచరించడానికి సాహసం చెయ్యాలి. నా జీవితంలో సంవత్సరానికి ఒక్కటి చొప్పున 24 సంవత్సరాలు 24 అనుష్ఠానాలు చేశాను. ప్రతిరోజూ 6 గంటలు జపం చేశాను. మీరూ 6గంటలు చేస్తాము అనవచ్చు. చేయవచ్చు. కాని నేనుచేయడంలోనూ మీరు చేయడంలోనూ తేడా ఉంటుంది. నా శరీరం మీద చాలా కట్టుబాట్లున్నాయి. వాటిల్లో లోపం రాకూడదు. ఒక చోట ఆసనం వేసుకుని కూర్చుంటే 6 గంటలు జపం పూర్తి చేశాకే లేవాలి. మీరు ఆ విధంగా చేయలేరు. ప్రయత్నించి చూడండి. ప్రతీక్షణం ఎంత వత్తిడి భరించాల్సి వస్తుందో మీకే తెలుస్తుంది. వాటిన్నింటినీ తట్టుకుని నేను బయటపడ్డాను. సాహసం చేశాను.

చాంద్రాయణవ్రతం ఎన్నో రకాలుగా ఉంటుంది. మిమ్మల్ని చిన్న పిల్లలుగా భావించి కొంచెం తేలిక చేస్తున్నాను.

**బలహీనమైన మనస్సుతో బలమైన ఆలోచనలు చేయలేరు.**

మనోబలం లేని వారికి, తనువు – మనసు బలహీనంగా ఉన్నవారికి నేను శిశుచాంద్రాయణవ్రతాన్ని చెపుతున్నాను. దానివల్ల కొంతలో కొంత మేమూ చేశామన్న తృప్తి లభిస్తుంది. దానితో పాటు తపస్సుయొక్క కఠోరత కూడ అర్థం అవుతుంది. మనస్సుకు ఏ విధంగానైనా నేర్పుకోవచ్చు. చాంద్రాయణ వ్రతంలో కొన్ని నియమాలు చాలా కఠినంగా ఉంటాయి. అవి మీకు విధించడం లేదు. మీరు మోయలేని బరువును మీమీద వెయ్యడంలేదు. మీకు అన్న పానాల విషయంలో కొంతవరకు చెప్పాను. వాటి విషయంలో నేను మాత్రం చాలా నిష్ఠగా పాటించాను. ఇనుమును ఉక్కుగా తయారు చేయడానికి ఏ విధంగా తపింపచేయాలో,ఆ విధంగా జిహ్వను (నాలుకను) తయారు చేయాలి. ఏ జిహ్వతో మంత్రాన్ని ఉచ్చరించానో, ఏ జిహ్వతో భగవానుని ప్రార్థించానో, ఏ జిహ్వతో ప్రజలకు వరాలవర్షం కురిపించానో, ఏ జిహ్వతో పరిజనులకు సందేశాలిచ్చానో ఆ జిహ్వకు తగిన విధంగా పదును పెట్టాను. కత్తికి పదును పెట్టిన విధంగా నాలుకకు పదును పెడితే గాని అది సక్రమంగా ఉపయోగపడదు. ఈ విధంగా నా శరీరంమీద, నాలుక మీద ఆంక్షలు విధించుకుని నా విధిని నిర్వర్తించుకున్నాను. 24 సంవత్సరాలు జిహ్వ పట్ల కఠినాతికఠినంగా ప్రవర్తించాను.

ఇతరులు భోజనం చేస్తుంటే నాకు కూడ తినాలి అనిపించేది. అందరూ తింటూ ఉంటే మనం ఎందుకు తినకూడదు అని నాలుక ప్రశ్నించేది. "నీవు నా నోటిలో ఉన్నావు కాబట్టి, నేను చెప్పినట్లు నీవు వినీతిరాలి." అని నేను శాసించేవాడిని. "అయితే నాకు సెలవుఇచ్చేయి నేను వెళ్ళిపోతాను" అనేది నాలుక. "అదేమీ కుదరదు. నీవు నాకోసం పుట్టావు. నా ఇంట్లో ఉంటున్నావు.నీకు నేను బానిసను కాదు. నాకు నువ్వే బానిసవు" అని నేను వాదించేవాడిని. ఈ విధంగా మా ఇద్దరి మధ్య యుద్ధం కొనసాగుతూనే ఉండేది. ఒకటికాదు. రెండుకాదు. 24 సంవత్సరాలు సాగింది. కొద్దిగా మిఠాయి తినిపించుమని ఎన్నో సార్లు వేడుకొన్నది. పెండ్లి పేరంటాలు, పండుగ – పబ్బాలు వచ్చినప్పుడల్లా గగ్గోలు పెట్టేది.

"నేను కొన్ని సిద్ధాంతాలకు కట్టుబడిఉన్నాను. అందరూ అన్నీ తింటారు కానీ నేను తినను. సాధకునికి, సామాన్యునకు అదే తేడా. సామాన్యులు రుచులను, సుఖ సంతోషాలను కోరుకుంటారు. సాధకుడు కట్టుబాట్లకు కట్టుబడి ఉంటాడు. కాబట్టి నా దగ్గర అనవసరమైన ప్రసంగాలు తేవద్దు". అని ఖచ్చితంగా చెప్పివేశాను. కిమ్మనకుండా జిహ్వ సహకరించేది. కనుకనే ఈనాడు మీముందు ఈ విధంగా నిలబడి చెప్పగలుగుతున్నాను.

24 సంవత్సరాలు జిహ్వను అదుపులో ఉంచినందువల్లనే ఈనాడు దానితో ఏమంత్రం చెప్పినా, ఏ జపం చేసినా ఫలితాన్ని ఇస్తున్నాయి. ఆనాడు అంతకఠినంగా లేకపోయినట్లైతే ఈనాడు నేనేమీ చేయగలిగేవాడిని కాదు. జప సంఖ్యపూర్తి కావచ్చు. అంతమాత్రాన ఫలితం రాదు. పక్వత చెందిన జిహ్వతో లోకులకు కథలు చెప్పవచ్చు. వ్యాఖ్యానాలు చెప్పవచ్చు. ప్రజలకు సుఖం కలిగించవచ్చు. అనుష్ఠానంతో పటిష్ఠం చేయబడిన జిహ్వ చాలా శక్తివంతమైనది. జిహ్వయొక్క మహత్తును తెలిపే ఒక కథ చెపుతాను వినండి. ఋష్యశృంగ మహర్షి కొన్ని మంత్రాలను పఠించి దశరథునకు పుత్రులుకలగాలని ఆశీర్వదించాడు. అది నూటికి నూరు పాళ్ళు ఫలించింది.

మంత్రాలలో శక్తి ఉంటుందా? ఉండదు. కొన్ని అక్షరాల సముదాయం మంత్రం. అది ముద్రణాలయంలో ముద్రింప బడుతుంది. దానిని టేపుమీద రికార్డు చేసుకుంటే కావాలను కున్నప్పుడల్లా వినవచ్చు. వినిపించవచ్చు. తేలు మంత్రం, పాము మంత్రం టేపు చేసుకుని వినిపిస్తే ఫలితం రాదు. సాధకుడు ఉచ్చరిస్తేనే ఫలితం వస్తుంది. దీనిని బట్టి శబ్దాలలో శక్తి లేదనీ, సాధకుని ఉచ్చారణలోనే శక్తి ఉందనీ అర్థం అవుతోంది. సాధకుడు నాలుకను స్వాధీనం చేసుకోవడంలోనే రహస్యం ఇమిడి ఉంటుంది. అదే సాధన. అనుకున్నది సాధించుకోవడానికి కష్టాలను సహించాల్సి ఉంటుంది. కష్టాలను సహించాలంటే సాహసం కావాలి. సాహసం చూపించాలంటే శౌర్యం కావాలి.

శౌర్యం సాహసం పరస్పర పూరకాలు.

(పరమపూజ్య గురుదేవులు 1979లో శాంతికుంజ్‌లో ఇచ్చిన సందేశం నుండి)

★★★

**తృప్తి - ఆనందం జంటకవుల్లా కలిసే ఉంటాయి.**

ఆధ్యాత్మిక విజ్ఞానం

# ఋషుల ప్రయోగశాల - యజ్ఞశాల

యాజ్ఞవల్క్య మహర్షి తమ ఆశ్రమంలో శిష్యులకు యజ్ఞవిద్య యొక్క లోతుపాతులను వివరిస్తున్నారు. యాజ్ఞవల్క్య మహర్షి యజ్ఞవిజ్ఞానంలో చాలా పరిశోధనలు చేశారు. ఆయన చాలా కాలంగా యజ్ఞవిజ్ఞానం యొక్క వ్యాపకత్వంపై సూక్ష్మంగా, లోతైన అన్వేషణలో మునిగిపోయారు. వీరు జనకుని రాజ్యంలో ఒక చక్కటి ప్రాకృతిక భూభాగంలో తమ యజ్ఞాల కొరకు ఆశ్రమం స్థాపించారు. అతి విశాలమైన ఈ ఆశ్రమంలో అనేక చిన్నాపెద్ద యజ్ఞశాలలున్నాయి. వీటిలో నిరంతరం పరిశోధన జరుగుతూ ఉంటుంది. ఈ యజ్ఞశాలలలో రకరకాల ఆకారంగల యజ్ఞకుండాలున్నాయి. త్రికోణం, చతుష్కోణం, షట్కోణం, శత, సహస్ర కమల కుండములు, మండలాకారం, కుంభాకారం ఇంకా ఎన్నెన్నో రకరకాల కుండాలున్నాయి.

మహర్షి ఆశ్రమంలో విశాలమైన వనౌషధుల ఉద్యానవనం, దట్టమైన అరణ్యప్రాంతం కూడా ఉన్నాయి. ఔషధ ఉద్యానవనంలో దాదాపు అన్ని రకముల వనౌషధాల మొక్కలు పెంచబడుతున్నాయి. ఇవి వేరు వేరు వైజ్ఞానిక విధానాలలో ప్రయోగించబడతాయి. ప్రక్కనే ఉన్న దట్టమైన అరణ్యంలో భిన్న భిన్న జాతుల వృక్షాలున్నాయి. వీటి కొమ్మలను సమిధలుగా వైజ్ఞానిక ప్రయోగాలలో ఉపయోగిస్తారు. విశాలమైన ఈ ఆశ్రమంలో పంటభూములు కూడా ఉన్నాయి.

వీటిలో అనేక రకాల పంటలను పండించి, వాటిపై యజ్ఞం యొక్క ప్రభావాలను వైజ్ఞానికంగా పరీక్షిస్తారు. ఉద్యాన వనంలో విహరించే పశుపక్ష్యాదులను తమ యజ్ఞీయ ప్రయోగశాలలోని సభ్యులుగానే మహర్షి భావించేవారు. యజ్ఞం మానవుల కొరకు, పృథ్వికొరకు మాత్రమే కాదనీ, సమస్త సృష్టి కొరకేనని మహర్షి అంటుంటారు. అందువల్ల అందరూ దీనిలో భాగస్వాములు కావాలనీ, అందరినీ లాభాన్వితులుగా చేయాలనీ ఆయన అంటారు.

యాజ్ఞవల్క్యుని యజ్ఞఆశ్రమంలోని ఒకే ఒక ప్రదేశానికి అందరికి ప్రవేశం ఉండేది కాదు. ఇక్కడ జీవన సంచాలనంలో అడ్డంకులు కలిగించే, సంపదలను నాశనం చేసే ఆసురీ శక్తుల నియంత్రణ కోసం వాటిని అణచివేసే రక్షోఘ్న ప్రయోగాలు జరుతాయి. అంతేగాక అవి చేసే వినాశకరమైన పనులను అదుపుచేసే ప్రయోగాలు కూడా జరుగుతాయి. ఈ కార్యక్రమాలను కాకక్ఋషి నిర్వహించేవారు. ఆయన గొప్ప దేశభక్తుడేగాక మహారౌద్రతేజం కలిగి ఉండేవాడు. ఆయన పేరంటేనే అసురులకు భయం. ఆయన మహాతేజస్సు కలిగి ఉన్నప్పటికీ అతి సౌమ్యుడు, చాలా కాలం నుండి యాజ్ఞవల్క్యునికి సహకారం అందిస్తున్నాడు. కాకక్ ఋషి ఇప్పుడు మహర్షి వద్ద కూర్చుని ఉన్నాడు. వీరితో పాటు దీర్ఘతమ ఋషి, కుత్స, గృత్సమద ఋషులు కూడా ఉన్నారు. వీరు మహర్షికి మిత్రులు.

మహాయోగి, మహాయజ్ఞ విజ్ఞాని యాజ్ఞవల్క్య మహర్షి సాన్నిధ్యం అతిదుర్లభం, అతి పుణ్యప్రదం. అటువంటి ఆయన ఇప్పుడు ఇతరులకు ఉపయోగించే ప్రతిపని యజ్ఞమేనని అర్థం అయ్యేటట్లు వివరిస్తున్నారు. ఏ పనులలో స్వార్థం, అహంకారం కొంచం కూడా లేవో, అవి అన్నీ యజ్ఞకర్మలే అని చెపుతున్నాడు. "ఇదం నమమ" అంటే "ఇది నాది కాదు నా కొరకు కాదు, లోకహితం కొరకే అని నొక్కివక్కాణించారు." భగవంతుడు ఈ సృష్టిని యజ్ఞీయ భావంతోను, యజ్ఞ ప్రయోగంతోను, యజ్ఞకర్మతోను తయారు చేశాడు. అందువల్లనే ఆయనను శ్రేష్ఠుడైన యజ్ఞకర్తగా, యజ్ఞపురుషునిగా చెప్తారు. యజ్ఞం సర్వోత్కృష్ట విజ్ఞానం. దీని వివిధ ప్రయోగాలు బాహ్యజగత్తులో, అంతర్ జగత్తులో స్థూలకర్మకాండల ద్వారా, సూక్ష్మక్రియల ద్వారా చేయబడతాయి.

యజ్ఞప్రయోగంలో భౌతిక, ఆధ్యాత్మిక శక్తులు ఉపయోగపడతాయి. యజ్ఞం యొక్క భౌతిక శక్తులగురించి మాట్లాడితే విభిన్న రకాలుగా వేడినిచ్చే చెట్ల సమిధలు ఉదాహరణకు మామిడి, అశ్వద్ధ, ఉటుంబర, అర్క, బిల్వ ఈ సమిధలు ఇచ్చే వేడి వేరు వేరుగా ఉంటుంది. యజ్ఞంలో ప్రయోగించే విభిన్న గుణముల ఓషధులు భౌతిక శక్తులకు వాహకంగా పని చేస్తాయి. యజ్ఞకుండముల వివిధ ఆకారాలు కూడా యజ్ఞశక్తిని రక్షిస్తాయి. వృద్ధి పరుస్తాయి.

యజ్ఞాలలో రకరకాల మంత్రాలు వాటి ఉచ్చారణ ఆరోహణ, అవరోహణా క్రమం ద్వారా ఆధ్యాత్మిక శక్తులు

హృదయం లేని మాటలకన్నా - మాటలు లేని హృదయం మిన్న.

ఉపయోగించబడతాయి. యజ్ఞ ప్రయోగంలో పాలుపంచుకునే ఋత్విక్, హోతా మొదలైన సాధకుల సంకల్పం కూడా ఒక ఆధ్యాత్మిక శక్తియే. అంతరిక్షంలోని శక్తి ప్రవాహాలను వేరు వేరు తిథులలో, విశిష్టమైన ప్రయోగాలలో ఉపయోగించుట వల్ల యజ్ఞాలు సమర్థవంతంగా తయారువుతాయి. పర్జన్య, పర్యావరణ పరిశోధనా రహస్యాలు కూడా పొందుపరచబడి ఉన్నాయి. యాజ్ఞవల్క్య మహర్షి యొక్క వ్యాఖ్య శ్రోతలను మంత్ర ముగ్ధులను చేసింది. ఇప్పుడు గృత్సమద్ ఋషి మనస్సులో అంతర్ యజ్ఞ జిజ్ఞాస తళుక్కుమన్నది.

తత్వవేత్తా,అంతర్ జ్ఞానీ మహాయోగీ అయిన యాజ్ఞవల్క్యుడు చిన్నగా నవ్వుతూ ఇలా అన్నారు.

"బాహ్య యజ్ఞం వలనే అంతర్ యజ్ఞ ప్రయోగం కూడా విశిష్టమైనది. దీనిని సవ్యంగా ఉపయోగించడం వల్ల అసాధారణ అధ్యాత్మిక శక్తి వికసిస్తుంది." కొంచెం సేపు ఆగి ఇంకా ఇలా అన్నారు. "మన అస్తిత్వం, మన వ్యక్తిత్వం స్వయంగా ఒక విశిష్టమైన యజ్ఞ కుండమే. దీనిలో కూడా బాహ్య కుండంలో వలె మనస్సు–ప్రాణం–దేహం అనే మూడు ఆవరణలు ఉన్నాయి. వీటిలో సంకల్పం ద్వారా సృజించే మనోమేఖల (మనస్సు అనే ఆవరణ) యొక్క అధిష్ఠాత బ్రహ్మ. పోషణ నిచ్చే ప్రాణమేఖల (ప్రాణం అనే ఆవరణ) యొక్క అధిష్ఠాత విష్ణువు, దేహమేఖల (దేహం అనే ఆవరణ) యొక్క అధిష్ఠాత రుద్రస్వరూపుడైన మహేశ్వరుడు." ఈశ్రేష్ఠమైన యజ్ఞ ప్రయోగం గురించి చర్చిస్తూ శృతి ఇలా చెప్తుంది.

***తత్వైవం విదుషో యజ్ఞస్యాత్మా యజ్ఞమానః***
***శ్రద్ధా పత్నీః ఉరేవేది వేద శిఖా, వాగ్ హోతా,***
***ప్రాణం ఉద్గాతా, చక్షురర్ధ్వర్యు, మనోబ్రహ్మ,***
***శ్రోత మాగ్రీధ్వ మన్యు రవం తథా హ్రనీయః ఉద్గాతా***

"ఆ ఆధ్యాత్మిక యజ్ఞంలో ఆత్మ యజ్ఞంయొక్క యజమాని గానూ, శ్రద్ధ యజమానియొక్క భార్యగానూ, హృదయం వేదికగానూ, వేదం శిఖగానూ, వాణి హోతగానూ, ప్రాణం ఉద్గాతగానూ, కన్నులు అధ్వర్యులుగానూ, మనుస్సు బ్రహ్మగానూ, చెవులు అగ్నీధ్రులుగానూ, నోరు ఆహవనీయ అగ్నిగానూ పనిచేస్తాయి. ఈ విశేషమైన యజ్ఞంలో ప్రజ్వలించబడిన కుండలినీ మహాజ్వాలలు సంస్కారముల యొక్క ఆహుతులు స్వీకరించి, ఆత్మకు పరమాత్మ స్వరూపమును కల్పిస్తాయి." మహర్షి వచనములు గృత్సమద్ ఋషికి చాలా ఆనందాన్ని కల్గించాయి. కాని యాజ్ఞవల్క్య ఋషి చెప్పవలసి ఉన్నది ఇంకా మిగిలి ఉన్నది. "యజ్ఞముల యొక్క వైజ్ఞానిక ప్రయోగాలలో నా కంటే నిష్ణాతుడు విశ్వామిత్ర మహర్షి. ఈ సందర్భంగా ఆయన చెప్పిన విషయాలు అతి మహత్వ పూర్ణమైనది.

*అఖండ జ్యోతి జూలై 2009*

## గో సంవర్ధన మహిమ

*గురుకులాల్లో చదువుకోవడం అంటే గదులలో బందీగా ఉండి చదువుకోవడం కాదు. గురుకులాధిపతి విద్యార్థుల మనస్సు తెలుసుకొని ప్రకృతిలో తిప్పుతూ పాఠాలు చెపుతాడు. దాని వల్ల వారి మనస్సులు వికసిస్తాయి. ఆ చదువు వారికి జీవితంలో అనేక రకాలుగా వినియోగిస్తుంది.*

*మహర్షి జరత్కారుని గురుకులానికి విద్రుధుడు అనే విద్యార్థి వచ్చాడు. అతని శ్రద్ధను, బుద్ధిని గురువు పరీక్షించాలి అనుకున్నాడు. 100 గోవులను ఇచ్చాడు. పాఠ్యపుస్తకాలను వీపుకు కట్టాడు. వాటిని అడవిలో మేపుకుంటూ చదువుకోమని చెప్పాడు. 100 గోవులు వెయ్యి గోవులయ్యాకనే గురుకులానికి తిరిగి రమ్మన్నాడు. శిష్యునికి 100 గోవులను 1000 చెయ్యడానికి 12 సంవత్సరాల కాలం పట్టింది. ఆ సమయంలో అతనికి అనేక మంది మహా వ్యక్తులతో పరిచయం అయింది. సత్సంగం లభించింది. అంతేగాక ఎలాంటి సమస్యలు ఎదురైనా, స్వయంగా ఎదుర్కోవడం అలవాటు అయింది. దానివల్ల ప్రతిభ అనేకరెట్లు పెరిగింది.*

*విద్రుధుడు 100=0 గోవులను తీసుకుని ఆనందంగా ఆశ్రమానికి వచ్చాడు. అతని ముఖం బ్రహ్మతేజస్సుతో వెలిగిపోతోంది. ఆశ్రమంలోనే ఉండి పాఠాలు నేర్చుకున్న తోటి శిష్యుల కంటే అనేక రెట్లు అదనపు జ్ఞానాన్ని పొందాడు. బ్రహ్మతేజస్సుతో వెలిగిపోతున్న శిష్యుని చూచి గురువు చాలా సంతోషించాడు. తన ఆశ్రమాన్ని అతనికే అప్పగించాడు. విద్రుధుడే 'ఉత్తరాధికారి' అని ప్రకటించాడు. తాను మరొక మహత్కార్యం నిమిత్తం మరొక్క చోటుకు వెళ్లిపోయాడు.*

*గోవులను పోషించడంలోనూ, గోవుల మధ్య నివసించడంలోను ఉన్న మహత్తువల్ల జ్ఞాన సిద్ధి, బ్రహ్మజ్ఞానం కలుగుతాయి.*

**సత్యం వల్ల తయారైన ధర్మమే సూక్ష్మం. అదే ధర్మ సూక్ష్మం.**

జీవించేకళ

# ధనాన్ని తలలో దాచుకో

ధనం లేకుండా ధనవంతులు కావటం అనే మాట మీకు ఆశ్చర్యాన్ని కల్గించవచ్చు. ఈ ప్రపంచంలో జేబులో ఒక్క పైసా లేకుండా, లేక అసలు జేబే లేకుండా కూడా ధనవంతులైన వారు అనేకమంది ఉన్నారు. ఎవరి శరీరం ఆరోగ్యంగా, హృదయం ఉదారంగా, మనస్సు పవిత్రంగా ఉంటుందో వారే ధనవంతులు. ఆరోగ్యవంతమైన శరీరం వెండి కంటే విలువైనది. ఉదార హృదయం బంగారం కంటే విలువైనది. పవిత్రమైన మనస్సు ఖరీదైన రత్నాలకంటే అధికమైన విలువ కల్గినది. లార్డ్ కాలింగ్‌వుడ్ "ధనం కోసం కొట్టుకుచచ్చేవారిని చావనీ, నేను మాత్రం ధనం లేకున్నా ధనవంతుడినే. ఎందువల్లనంటే నేను ఎంత సంపాదించినా, న్యాయంగా సంపాదిస్తాను" అన్నాడు. నావద్ద న్యాయబద్ధంగా సంపాదించిన ధనం కొంత ఉంది. అదినాకు కోటీశ్వరులకంటే అధికమైన ఆనందాన్ని ప్రసాదిస్తుంది.

దధీచి, వశిష్ఠుడు, వ్యాసుడు, వాల్మీకి, తులసీదాసు, సూరదాసు, రామదాసు, కబీరు మొదలైనవారు ధనం లేకున్నా ధనవంతులే. మానవులకు కావలసిన ఆహారాలన్నీ నోటి ద్వారా మాత్రమే లోనికి వెళ్తాయనీ, జీవితాన్ని ఆనందమయం చేసే వస్తువులన్నింటినీ ధనంతో కొనలేమనీ వారికి తెలుసు. జీవితమనే పుస్తకంలోని ప్రతి పేజీలోనూ అమూల్యమైన రహస్యాలను ఈశ్వరుడు ముద్రించే ఉంచాడు. మనం కోరుకుంటే వాటిని గుర్తించి జీవితాన్ని ప్రకాశవంతం చేసుకోవచ్చు. ఒకవిశాల హృదయం, ఉన్నత ఆత్మగల వ్యక్తులు గుడిసెలో కూడా రత్నాల వెలుగును పుట్టించగలరు. సదాచారవంతులు, ఇతరులకు ఉపకారం చేసేవారు. ఈ లోకంలోనే కాక, పరలోకంలోనూ ధనవంతులే. వారివద్ద ధనం లేనప్పటికీ వారు అన్నివేళలా ధనవంతులే. మీరు వినయశీలురు, ప్రేమగలవారు, నిస్వార్థులు, పవిత్రులు ఐనట్లయితే మీరు అనంత ధన సంపదకు అధిపతులని విశ్వసించండి.

ధనం లేని వారిని బీదవారని అంటారు. కానీ ఎవరి వద్ద కేవలం ధనం మాత్రమే ఉందో వారు బీదవారి కంటే దరిద్రులు. జ్ఞానాన్ని, సద్గుణాలను అందరం ధనంగా భావించాలి. అష్టావక్రుని శరీరం ఎనిమిది వంకరలు కల్గి ఉండేది. ధనం లేదు. జనక మహారాజు సభలో ప్రవేశించి తన గుణాలను పరిచయం చేసుకున్నప్పుడు జనకమహారాజు అతనికి శిష్యునిగా మారాడు. ద్రోణాచార్యుడు ధృతరాష్ట్రుని రాజదర్బారులో ప్రవేశించినపుడు అతని శరీరంపై నిండుగా వస్త్రాలు కూడా లేవు. కానీ అతని అస్త్రజ్ఞానం అతనికి రాజకుమారుల గురువుగా గౌరవప్రదమైన స్థానాన్ని ఇప్పించింది. మహాత్ముడైన డయోజనీజ్ వద్దకు ప్రపంచ విజేత అయిన సికిందర్ వెళ్ళి "మహాత్మా నేను మీకోసం ఏ వస్తువును సమర్పించను?'' అని అడిగాడు. ఎండకు అడ్డుపడకుండా ఇంకొక ప్రక్కన నుంచో. నువ్వునాకు ఇవ్వలేని వస్తువును నానుండి దూరం చేయకు" అన్నాడు. అందుకు సికిందర్ "నేను సికిందర్‌ను కానట్లయితే డయోజనీజ్ అవటాన్ని ఇష్టపడతాను అన్నాడు.

గురుగోవిందసింగ్, హకీకతరాయ్, ఛత్రపతి శివాజీ, రాణా ప్రతాప్ మొదలైనవారు వారి జీవితాన్ని ధన సంపాదనకై వెచ్చించలేదు. గౌరవనీయుడైన గోఖలే వద్దకు ఒక ధనవంతుడు వచ్చి మీరు రాజకీయ నాయకుడు అయినప్పటికీ బీద జీవితాన్ని ఎందుకు గడుపుతున్నారు? అని అడిగాడు. అందుకు సమాధానంగా గోఖలే నాకు ఇదే ఎక్కువ. ధన సంపాదనకై జీవితంలో అధిక భాగాన్ని వృధా చేయటం బుద్ధిమంతుల లక్షణం కాదు." అన్నాడు.

ఒకసారి ధనవంతుడైన ఒక మిత్రుడు ఫ్రాంక్లిన్‌ను తన ధనాన్ని ఎక్కడ దాచాలని సలహా అడిగడానికి వెళ్లినాడట. అతను ఆసంచులను తలలో పోసుకోమని చెప్పాడట. అందుల కాతడు "ఇదేమి హాస్యం? సరిగా అర్థం అయ్యేటట్లు చెప్పు" అన్నాడట. అంటే ఆధనాన్ని ఉపయోగించి జ్ఞానాన్ని సంపాదించు. జ్ఞానం అనేది మెదడులో స్థిరంగా ఉంటుంది. దానిని ఎవ్వరూ దొంగిలించలేరు. అనేక మందికి ఉపయోగపడుతుంది. నీవు ఎంత ఖర్చు చేసినా పెరిగిపోతూనే ఉంటుంది. కాని తరిగిపోదు. జ్ఞాన ధనాన్ని మించిన ధనం లేదు" అని వివరించి చెప్పాడట.

అనువాదం - టి. జ్ఞాన ప్రసూన

**కేవలం ధనం మాత్రమే ఉన్నవారు బీదవారికంటే దరిద్రులు.**



ధారావాహిక: వృద్ధాప్యం-జీవితనవనీతం-3

# మృత్యు మహోత్సవానికి సన్నాహం

### యౌవనంలో వృద్ధాప్యానికి తయారీ

వృద్ధాప్యానికి తయారీ బాల్యం నుండే జరగాలి. అది జరిగితే శారీరికమూ, మానసికమూ, ఆర్థికమూ అయిన ఎలాంటి సమస్యా ఎదురుకాదు. **వృద్ధాప్యం శాంతియుతమైన ఆత్మచింతనకూ, భగవద్ భజనకూ ఉద్దేశించబడిందన్నది పరమపూజ్య గురుదేవుల నిర్దేశం.** మనిషి తన పరలోక భవంతికి పునాది వేసుకునే విలువయిన తరుణం ఇది. మొదటినుంచీ ఇందుకు తయారీ జరిపినపుడే ఇది సాధ్యపడుతుంది. యౌవనంలో అధికంగా శ్రమించి, వ్యక్తి తన కర్తవ్యాలను పూర్తిగా నిర్వహించాలి. తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించే విధంగా మనిషి తన సంతానాన్ని తయారుచేయాలి. మనిషి తన కోసం కూడ స్థిరమైన పరిస్థితులను నిర్మాణం చేసుకోవాలి. అవి ముందు ముందు అతడికి నిజమైన సహచరులు అవుతాయి. సంయమనం, నియమ పాలన, కఠోరమైన వ్రత పాలనద్వారా శక్తినీ, తపోతేజాన్ని సమీకరించాలి. వాటి ఆధారంగా అతడు చివరి క్షణం వరకు ప్రశాంతంగా ఉండగలుగుతాడు.

జీవితంలో వృద్ధాప్యం అనివార్యం. అందరూ ఒక రోజున వృద్ధులు కావలసిందే. వృద్ధాప్యంలో కూడబెట్టే అవకాశం ఉండదు. ఖర్చు చేయడం మాత్రమే ఉంటుంది. ఈ ఖర్చు కోసం యౌవనంలోనే తగినంత కూడబెట్టాలి. యౌవనాన్ని అస్తవ్యస్తంగా గడిపివేసేవారు వృద్ధాప్యంలో ఎన్నో కష్ట నష్టాలను భరించవలసి ఉంటుంది. యౌవనపు పొంగులో వృద్ధాప్యపు క్రుంగుదలను చూడకపోవడం దూరదృష్టి లోపమే అవుతుంది. ఈ లోపానికి ఫలితాన్ని వారు వృద్ధాప్యంలో అనుభవించవలసి వస్తుంది. జీవమూ జవమూ కలిగిన యౌవనంలో సహించగలిగిన కష్టాలను మనిషి వృద్ధాప్యంలో సహించలేడు. కనుక, మనిషి యౌవనంలో తనను తాను బాగా అరగదీసుకోవాలి. అప్పుడు అతడు వృద్ధాప్యపు బరువును తేలికగా మోయగలుగుతాడు.

ఋషి సంప్రదాయం ప్రకారం ఆశ్రమ జీవన విధానాన్ని అనుసరించేవారు మోసపోవడం అరుదు. బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం అనే విభాగాలకు అనుగుణంగా సాగిన జీవితం విఫలం కావడం బహు అరుదు. ఆ వ్యక్తి తాను కూడబెట్టిన శక్తి ఆధారంగా తన జీవితమంతా కుటుంబానికీ, సమాజానికీ, దేశానికీ ఏదో రూపంలో ప్రయోజనకారిగా ఉండితీరుతాడు. తన వృద్ధాప్యం సమస్యల విషవలయంగా మారకుండా ఉండాలని కోరే వ్యక్తి యౌవనంలోనే వృద్ధాప్యానికి నిచ్చెనలు వేసుకుని ఆ తర్వాత వృద్ధాప్యాన్ని చేరుకోవాలి.

బాల్యదశలో, యౌవనదశలో ఏదైనా లోపం జరిగినప్పటికీ, మనిషి నిరాశ పడవలసిన అవసరం లేదు. ఇప్పటికీ తరుణం మించిపోలేదు. దృఢ నిశ్చయంతో విపరీత పరిస్థితులను తారుమారు చేసి అనుకూల పరిస్థితులుగా వానిని మార్చుకోవచ్చు.

### 1. తన జీవితాన్ని సమీక్షించుకోవాలి

వృద్ధులు శాంత చిత్తంతో తమ కార్యకలాపాలపై దృష్టి సారించాలి. ఎక్కడ ఏ పొరపాటు జరిగిందో న్యాయమూర్తివలె విచారణ చేయాలి. ఇతరుల పొరపాట్ల మీద దృష్టి పెట్టకూడదు. ఎవడు ఏది చేయాలో అది చేసివేశాడు, ఇంకా చేస్తున్నాడు. అతనిని మార్చాలంటే ఆ పని అతడే స్వయంగా చేసుకుంటాడు. కేవలం ఎవరిని వారు సంస్కరించుకోవడానికి ప్రయత్నించాలి. 'తనను తాను సంస్కరించుకోవడం ప్రపంచానికి ఉత్తమోత్తమమైన సేవ' – అనే సూక్తిని సదా దృష్టిలో ఉంచుకోవాలి. తమ పొరపాట్లను సవరించుకోవడానికి యథాశక్తి ప్రయత్నించాలి.

**ఆత్మ సమీక్ష, ఆత్మక్షాళన మానవ జీవితానికి మౌలిక ఆవశ్యకత:** మానవ జన్మలోనే అది సాధ్యపడుతుంది. ఏ ఇతర ప్రాణీ ఆ పని చేయజాలదు. ఇదే అధ్యాత్మయొక్క ప్రధాన లక్ష్యం. ప్రతి వ్యక్తీ సదా ఈ కృషిలో నిమగ్నం కావాలి. ప్రతి రోజూ నిద్రపోయేముందు ఆ రోజు చేసిన పనులను కొద్దిసేపు సమీక్షించుకోవాలి. మనసుద్వారా కాని, మాటద్వారా కాని, క్రియలద్వారా కాని మనం ఏదైనా అనైతిక చర్య జరపలేదు కదా అని పరీక్షించుకోవాలి. ఒక వేళ జరిగితే అలాంటిది మళ్ళీ జరుపనని సంకల్పం చేయాలి. నిండు మనసుతో ఆ సంకల్పాన్ని పూర్తిచేయాలి.

పేదరికం గారడీ చేస్తే పోయేది కాదు - తీవ్రమైన కృషి చేయాలి - నెహ్రూ.

### 2. అవసరాలను తగ్గించి పరిస్థితులతో సర్దుకోవాలి

వృద్ధాప్యంలో సహజంగానే తిండి, బట్టవంటి అవసరాలు చాలా తక్కువగా ఉంటాయి. వాటిని మరింత హేతుబద్ధం చేయాలి. అన్నిటికన్న ముఖ్యమైనది పరిస్థితులతో సర్దుబాటు చేసుకోవడం, మీ కుటుంబంలో, ఇరుగుపొరుగులో మంచి-చెడు వాతావరణం ఏది ఉన్నా, దానిలోనే ఆనందంగా ఉండడం అలవాటు చేసుకోవాలి. ఉన్నదంతా ఈశ్వరేచ్ఛ అని భావించి, అన్ని పరిస్థితులలోనూ హాయిగా ఉండాలి. ఈ సంతృప్తి మిమ్మల్ని ఎన్నడూ ఉద్రిక్తతకు లోనుకానివ్వదు. కమలం బురదలోనే ఉండవలసివస్తుంది. అటువంటప్పుడు దిగులుపడి ఏమి లాభం?

### 3. వానప్రస్థాన్ని స్వీకరించాలి

మన ఋషి సంప్రదాయం ప్రకారం- 50 సంవత్సరాల వయస్సు దాటిన తర్వాత మనిషి వానప్రస్థాన్ని స్వీకరించాలి. దీని అర్థం ఇల్లూ వాకిలీ వదిలి అడవిలో నివసించడం కాదు. **వానప్రస్థం అంటే సరైన అర్థం - కుటుంబంపట్ల అనవసర వ్యామోహాన్ని వదులుకోవడం; సమాజ సేవలో తమ ప్రతిభనూ, శక్తి సామర్థ్యాలనూ లగ్నం చేయడం.** కుటుంబ బాధ్యతలనుండీ, సమస్యలనుండి తమను తాము దూరం చేసుకోవాలి. పిల్లలు పెద్దవాళ్లు అయ్యారు. ఆ పనులన్నింటినీ వారిని చేసుకోనివ్వాలి. వారు కోరినప్పుడు మాత్రమే సలహా, సహకారం ఇవ్వాలి. ఇందువల్ల వారు స్వయంగా తమ బాధ్యతలను గుర్తిస్తారు. వీరి గౌరవమూ నిలుస్తుంది. జ్ఞాన విజ్ఞానాలు శరవేగంతో పురోగమిస్తున్నాయి. వాటితో సర్దుకుపోయే సామర్థ్యం సాధారణంగా వృద్ధులకు ఉండదు. అయితే, యువతరం రోజుకొక క్రొత్త విషయం నేర్చుకుంటూ ఉంటుంది. ఈ స్థితిలో పాతకాలపు ఆలోచనలపై ఆధారపడిన వృద్ధుల సలహాలు తరచు ఆచరణ యోగ్యంగా ఉండవు. కనుక - జోక్యం కలిగించుకోక పోవడమే మంచిది.

సాధ్యమైనంతవరకు భోజనం, నిద్రలవరకే కుటుంబంతో గల సంబంధాన్ని పరిమితం చేయాలి. అత్యధిక సమయాన్ని సమాజ సేవకు సమర్పించాలి. ఇరుగుపొరుగున, పేటలో, గ్రామంలో, నగరంలో సేవా సహాయాలు అందవలసినవారు ఎందరో ఉంటారు. సదాలోచనలను సమీకరించి ప్రచారం చేయవచ్చు. ప్రజలను దుర్గుణాలనుండి, దుర్వ్యసనాల నుండి తప్పించడానికి కృషి చేయవచ్చు. సేవా కార్యాలకు కొదువ లేదు, పరిమితి లేదు. స్థానిక సమస్యలకూ, పరిస్థితులకూ అనుగుణంగా తగు సేవా కార్యక్రమాలను రూపొందించవచ్చు. ఇందుకు హెచ్చుగా ఖర్చు కాదు. చూస్తూ ఉండగానే, సమాజంలోని ఇతర వ్యక్తులు కూడ ముందుకు వస్తారు. ఈ విధంగా సమాజంలో వృద్ధుల ప్రతిష్ఠ పెరుగుతుంది. వీరి ప్రతిభ, సామర్థ్యం సద్వినియోగం అవుతాయి. మానవ ధర్మాన్ని పాటించడమూ జరుగుతుంది.

మానవ ధర్మానికి మూలాధారం 'సర్వే భవన్తు సుఖినః' మనం చేసే పని వల్ల అందరికీ ప్రయోజనం కలగాలి. ఎవ్వరికీ అపకారం జరగకూడదు. హెచ్చు తగ్గులు, ధనికులు-పేదలు మున్నగు తేడాలను వదిలి దీనులకూ దుఃఖితులకూ సేవ చేయాలి. అందరి మంచి కోసం ప్రయత్నించాలి. అందులో మనకు కొంత నష్టం జరిగినా. మన అవసరాలను కనీస స్థాయికి తగ్గించుకోవాలి. కొద్ది సాధనాలతోనే జీవితం గడపాలి. ఇతరుల హితం కోసం వృద్ధులు తమ అధికారాన్ని కూడా వదులుకోవడానికి సిద్ధపడాలి. ఇదే నిజమైన వానప్రస్థం.

### పరమపూజ్య గురుదేవుల సందేశం ఇది -

'ఆత్మీయతనూ, మమతనూ చిన్నదయిన కుటుంబానికి పరిమితం చేసుకోకుండా, దానిని విశ్వ మానవుల వరకు విస్తరింపచేయడం, వికసింపజేయడం వానప్రస్థంలోని మూల ఉద్దేశ్యం. గతంలో చిన్న పరిధి (కుటుంబం)కే బంధుత్వ భావన పరిమితమై ఉండేది. ఆ భావన పెరిగితే, అనేకమంది వ్యక్తులు తమ కుటుంబీకులని అనిపిస్తే - ఆత్మ విశాలం అయిందనీ, ఆత్మయొక్క దృక్పథం, స్వభావం విస్తృతం అయినాయనీ భావించవచ్చు. ఈ ప్రగతియే ఆత్మను పరమాత్మగా, నరుణ్ణి నారాయణుడుగా చేస్తుంది.

### 4. ఆధ్యాత్మికతను అవలంబించాలి

వాస్తవానికి ప్రతి వ్యక్తీ ఆధ్యాత్మికతను పాటించాలి. ఇది మానవ జీవనానికి ప్రధాన ఆవశ్యకత. నేడు ప్రతి ఒక్కడూ డబ్బుకోసం, పదవి కోసం, ప్రశంస కోసం, సన్మానం కోసం ప్రాకులాడుతున్నాడు. వీటి కోసం ఏ పని చేయడానికైనా సిద్ధపడుతున్నాడు. జీవితానికి మౌలిక అవసరం అయిన ఆధ్యాత్మికతను తెలుసుకోవడానికి ప్రయత్నించే తీరిక ఎవరికీ

పురుషునికి పరీక్ష స్త్రీ - స్త్రీకి పరీక్ష బంగారం.

ఉండడం లేదు. వృద్ధాప్యంలో అయితే – సుఖ శాంతులకు ఈ ఆధ్యాత్మికత అత్యవసరం.

ఆధ్యాత్మిక జీవనం అంటే అర్థం – మనిషి అంతర్ముఖుడై, లోచూపు అలవరచుకుని, ఆలోచన, మనన, ధ్యాన, సాధనలలో నిమగ్నం కావడం. మానవజన్మ నాకు ఎందుకు లభించింది? నేను ఎవరిని? నా ఆత్మకూ పరమాత్మకూ సంబంధం ఏమిటి? – అనే ప్రశ్నలను మనిషి వేసుకోవాలి. తన కర్మలను నమోదు చేసే పరమాత్మ తనతోపాటు సదా సాక్షిగా ఉన్నాడని మనిషి గుర్తుంచుకోవాలి. తన కర్మల ఫలితాన్ని తానే అనుభవించాలి అని ఆలోచించి, మానవ ధర్మాన్ని పాటించడమే ఆధ్మాత్మికత.

నిష్ఠతో, శ్రద్ధతో, విశ్వాసంతో తన జీవితానికి మూలాన్నీ, పరమ లక్ష్యాన్నీ తెలుసుకోవడానికీ, అర్థం చేసుకోవడానికీ, పొందడానికీ ప్రయత్నించే వ్యక్తికి సుఖ శాంతులు, ఆనందం లభించితీరుతాయి. పరమాత్మతో ఇలాంటి అనన్య సంబంధాన్ని ఏర్పరచుకున్న వ్యక్తి సదా ప్రయోజనాన్నే పొందుతాడు. పూర్తి నిష్కామ భావంతో భగవంతుణ్ణి ఉపాసిస్తే, ఆయనపట్ల విశ్వాసం గట్టిపడుతుంది; అంతఃకరణలో అలౌకిక శాంతి నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. శాంత చిత్తంలో జ్ఞానంతోపాటు వివేకంకూడ పెరుగుతుంది. వివేకం మేలుకుంటే, వైరాగ్య భావన బలపడుతుంది. సంసారం నిస్సారమని తెలుస్తుంది. మనసు మాయా మోహములకు దూరం అవుతుంది. అలాంటి దశలో ఆచరణ వాటికవిగా సంయమనాన్ని పాటిస్తాయి. పరిమితులను పాటిస్తాయి. నిద్రిస్తున్న ఎన్నెన్నో శారీరిక, మానసిక శక్తులు మేలుకుంటాయి. జీవితానికి కాయకల్ప చికిత్స జరుగుతుంది. ఫలితంగా – ఓజస్సుతో, తేజస్సుతో, వర్చస్సుతో వ్యక్తిత్వం ప్రకాశిస్తుంది. ఆధ్యాత్మిక జీవనానికి ప్రయోజనం ఇదే.

బాల్య, యౌవనాలలో వ్యర్థమైన సమయాన్ని కనీసం వృద్ధాప్యంలో అయినా తప్పక భర్తీ చేసుకోవాలి. స్వాధ్యాయ సత్సంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. సత్ సాహిత్యాన్ని అధ్యయనం చేయడం వల్ల, విద్వాంసులూ అనుభవజ్ఞులూ అయిన సంత్‌లతో సత్సంగంవల్ల లోభం, మోహం, ధనవాంఛ వంటి వాటినుండి విముక్తి పొందగలుగుతారు. జీవితమూ, ఈ సంసారమూ క్షణ భంగురములనే బోధ కలుగుతుంది. ఇందువల్ల జీవుడు సంసార బంధనాలనుండి విముక్తి పొందుతాడు.

తాము ధార్మికులమనీ, ఆధ్యాత్మికవేత్తలమనీ పలువురు వ్యక్తులు నటిస్తూ ఉంటారు. కానీ, వారి ఆచరణ అందుకు విరుద్ధంగా ఉంటుంది. కషాయ – కల్మషాలతో, అసూయా ద్వేషాలతో, రకరకాల దురాలోచనలతో వారి మనస్సు నిండి ఉంటుంది. వృద్ధాప్యంలో లిప్స, లాలస, వాంఛ మరింతగా పెరుగుతాయి. సంసారం నుండి విముక్తి పొందేందుకు బదులు వ్యక్తి ఆ లంపటంలో, ఆ బురదలో మరింతగా కూరుకుపోతాడు. తన ఆలోచనను మార్చుకోవడానికి ప్రయత్నించనంతవరకు, మనిషి సంసార మాయాజాలం నుండి విముక్తి పొందజాలడు. సంసారంలోని భౌతికవాద వాతావరణంలో జీవించక తప్పదు. భౌతికవాద చర్యలను స్వయంగా జరపక తప్పదు. వృద్ధులు కనీసం తమ ఆలోచననూ, ఇచ్ఛలనూ ఆధ్మాత్మికంగా నిలిపి ఉంచుకోవాలి. క్రియలలో భౌతికవాదం ఉండవచ్చు. అయినా, కోర్కెలలో ఆధ్యాత్మికవాదం ఉండాలి. ఇదే మోక్షానికి మార్గం.

### 5. మౌనవ్రత అభ్యాసం

వృద్ధాప్యం వచ్చాక సాధ్యమైనంత తక్కువగా మాట్లాడాలి. కళ్ళూ, చెవులూ సదా మెలకువతో ఉండాలి. నలువైపులా జరగుతున్న దానిని చూడాలి, వినాలి. కానీ సాధ్యమైనంతవరకు దానికి స్పందించకూడదు. ఇలా చేస్తే – పెక్కు చిక్కులకు దూరమవుతారు. మౌనంవల్ల చిత్తం ప్రశాంతంగా ఉంటుంది. శారీరిక శక్తి ఖర్చు కాదు. రోజంతా మాట్లాడే మాటలలో హెచ్చుభాగం అకారణమైనవి, నిరర్థకమైనవి. మాట్లాడాలనే ఉబలాటంలో శక్తులను వృథా చేసుకోరాదు; మానసిక ఉద్విగ్నతను పెంచుకోరాదు. మౌనాన్ని అభ్యాసం చేయడంవల్ల ఆలోచన, మననములకు సదవకాశం లభిస్తుంది.

### 6. స్వయం సహాయకా కేంద్రాలు

ప్రతి గ్రామంలో, పేటలో, నగరంలో ఉన్న వృద్ధులు తమకు తాము సహాయం చేసుకోవాలి. అప్పుడు అందరికీ సుఖం కలిగించే పరిస్థితులు ఏర్పడతాయి. పూర్వకాలంలో రచ్చచావడి ఉండేది. ఇప్పుడు గ్రామాలలో సైతం ఈ ఏర్పాటు లేదు. దీన్ని పునరుద్ధరించాలి. ఇరుగుపొరుగున నివసించే వృద్ధులు తాము కలుసుకోవడానికి ఏదో ఒక స్థలాన్ని నిర్ణయించుకోవాలి. ఆలయంలో, సత్రంలో లేదా పార్కులో అంతా మూడు నాలుగు గంటలపాటు కలసి భజన – కీర్తనలు, స్వాధ్యాయ – సత్సంగాలతో

పెద్దల ప్రవర్తనే పిల్లలకు అసలు సిసలైన పాఠం.

సమయం గడపాలి. అందువల్ల సమయం సద్వినియోగం అవుతుంది. సమస్యలు సర్దుబాటు అవుతాయి. సమర్థులైన వృద్ధులు ఇతరులకు సాయపడవచ్చు. తమ జ్ఞానం ద్వారా, అనుభవం ద్వారా పరస్పర ప్రయోజనం పొందవచ్చు. ఈ విధంగా వారి ఒంటరితనం తొలగిపోతుంది. నిష్క్రియత్వం స్థానంలో క్రియాశీలత వస్తుంది. ఫలితంగా – జీవితంలో ఉత్సాహం, ఉత్తేజం పెరుగుతాయి.

వృద్ధాప్యంలో మనిషి ఏమీ చేయలేడని భావించడం భ్రమ. **తులసీదాసు రామచరితమానస మాహాకావ్యరచనను తన 80వ సంవత్సరంలో ప్రారంభించి, 120వ సంవత్సరంలో పూర్తిచేశాడు.** పూర్తి శ్రద్ధతో ప్రారంభమైన కార్యాలు వార్ధక్యపు అవరోధాలను అధిగమించిన ఉదాహరణలు కోకొల్లలుగా ఉన్నాయి. మీరూ అలా ప్రారంభించండి.

తమకు తాము సహాయపడడంలో నిమగ్నులు అయినవారికే పరమేశ్వరుడు సహాయపడతాడు. తనను తాను సంస్కరించుకోవడానికి సదా కృషి చేస్తూ ఉండడం తనకు చేసుకునే సహాయాలలో అత్యుత్తమమైనది. మనస్సుమీద కఠోరమైన నియంత్రణ ఉంచడానికి ప్రయత్నించాలి. తెగిన గాలిపటంలా దాన్ని గాలికి తిరగనివ్వరాదు. అలా చేస్తే, మనస్సు అందరికన్న మంచి మిత్రము అవుతుంది; నిజమైన మార్గదర్శకుడు అవుతుంది. అవకాశాల అన్వేషణలో నిమగ్నులు అయితే – ఎన్నెన్నో మార్గాలు ఎదురుగా తలుపులు తెరుచుకుంటాయి. ఈ కృషిలో శారీరికంగా, మానసికంగా కాయకల్ప చికిత్స పొందుతారు. అనుభవం, అభ్యాసముల ద్వారా నిజమైన కర్మయోగులు కావడంలో సాఫల్యం పొందుతారు.

## 7. మృత్యు సన్నాహం

మనిషి ఆయుష్షు నిర్ణీతమైనది. మరణ ఘడియనుండి తప్పించుకోలేడు. ఏ వ్యక్తీ అమరుడు కాడు. అమరమైనది ఆత్మ ఒక్కటే. శరీరం నశించిపోతుంది. మనం మాసిన బట్టలు విడిచి ఉతికిన బట్టలు వేసుకుంటాం. అలాగే – ఆత్మ ప్రస్తుత శరీరం నశించిన తర్వాత క్రొత్త శరీరంలో ప్రవేశిస్తుంది. జనన మరణాలు స్థూల శరీరానికే. ఈ శరీరంలో నివసించే జీవుని అస్తిత్వం వేరు. అతడు తన సంచిత కర్మలతో పాటు క్రొత్త శరీరంలోనికి వెళ్లిపోతాడు. తన సంస్కారాన్ని బట్టి, తన ప్రారబ్ధాన్ని బట్టి అతడు కర్మఫలాన్ని అనుభవించడానికైన వివిధ ప్రాణులలో ప్రవేశించవలసివస్తుంది. 84 లక్షల జీవరాశులతో కూడిన ఈ చక్రం నుండి వెలికిరావడం సులభం కాదు.

నిర్ణీతమైన ఈ జనన–మరణ చక్రం పట్ల కళ్లు మూసుకుని ప్రయోజనం లేదు. ఏదో ఒక రోజున చనిపోతాం కనుక ఈ లోగా భోగ విలాసాలను అనుభవిద్దాం – అని పలువురు అంటారు. అయితే – ఈ భోగ విలాసాలు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. మరో ప్రక్క – ఆలోచననూ, శీలాన్ని భ్రష్టు పట్టిస్తాయి. ఇవి లోభం, మోహం, స్వార్థం, అసూయ, ద్వేషం వంటి దుర్గుణాలను పెంచుతాయి. మనిషిని ఎన్నెన్నో పాపకార్యాలలో ముంచివేస్తాయి. ఫలితంగా మనిషి జీవితం నరకంగా మారుతుంది. భవిష్యత్తులో అతడు అనేక నీచ జన్మలు ఎత్తి దారుణమైన యాతనలను అనుభవించవలసి వస్తుంది.

ఇదంతా తెలిసినప్పుడు – మరణం అంటే భయం ఎందుకు? చావును గురించి ఏడవడం ఎందుకు? వాస్తవానికి మరణానికి స్వాగత సన్నాహాలు చేయాలి. సంకుచిత పాప కర్మలు నశించడానికీ, పుణ్య కర్మలను పెంచడానికీ శేష జీవితాన్ని సద్వినియోగపరచాలి. అలాచేస్తే, ప్రస్తుత జీవితం ఆనందమయం అవుతుంది. మరణం తర్వాత ఉత్కృష్టమైన జన్మ లభిస్తుంది; సుఖమయ పరిస్థితులు నిర్మాణం అవుతాయి. పురుషార్థ, ప్రాయశ్చిత్తాల ద్వారా మాత్రమే ఇది సాధ్యపడుతుంది. భోగ విలాసాలవల్ల ఎంత హాని జరుగుతుందో తెలుసుకుంటే – జీవితాన్ని సార్థకం చేసుకోగలుగుతాం. ఇందులోనే ఉంది విజ్ఞత.

మరణానికి స్వాగతం చెప్పడానికి తయారయేటప్పుడు ఒక విషయాన్ని ప్రత్యేకంగా గుర్తించాలి. భగద్గీతలో భగవానుడు ఇలా ప్రవచించాడు–

**యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరమ్ ।**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥**

*– శ్రీమద్ భగవద్గీత 8/6*

“కుంతీపుత్రుడవైన ఓ అర్జునా! మనిషి మరణ సమయంలో ఏయే భావాలను స్మరిస్తూ శరీరాన్ని వదులుతాడో (తర్వాతి జన్మలో) ఆయా భావాలనే పొందుతాడు.”

మనిషి ఎప్పుడూ ఏ ఆలోచనలలో నిమగ్నం అవుతాడో ఆ ఆలోచనలే మరణ సమయంలో అతడికి గుర్తుకువస్తాయి. వాటికి అనుగుణంగానే అతడి ప్రారబ్ధం ఏర్పడుతుంది. అతడి సంచిత

**శాంతిని ఆకర్షించే ఆయస్కాంత శక్తిని సాధించు - అశాంతితో అలమటించే వారంతా నీ దగ్గరకు చేరుకుంటారు.**

కోశంలో మంచీ చెడూ కర్మల సంస్కారాల విశాల భాండాగారం ఉంటుంది. జన్మ జన్మాంతరాలనుండి ప్రోగవుతూ వచ్చిన భాండారం అది. దాని ఫలం ఇంకా వ్యక్తం కావలసి ఉంది. ఇప్పుడు మరణ సమయంలోని భావానికి అనుగుణంగా ప్రారబ్ధానికి కేంద్ర బిందువు ఏర్పడుతుంది. ఆ కేంద్ర బిందువు ఆ సంచిత కోశం నుండి అలాంటి అనేక సంస్కారాలను తనవైపు ఆకర్షిస్తుంది. ఇలా ప్రోగయిన సంస్కారాల సమూహమే ప్రారబ్ధం. **ఈ ప్రారబ్ధానికి అనుగుణంగా జీవాత్మ అనేక జన్మలలో కర్మ ఫలాన్ని అనుభవిస్తుంది.**

ఒక మనిషి యొక్క జీవితమంతా తన పిల్లలు, కుటుంబం, సిరి సంపదలు మున్నగు వాటిలో మునిగిపోతే – మరణ సమయంలో కూడా అతడిలో అలాంటి భావాలే ఉంటాయి. అతడి ప్రాణం పిల్లలు, పొలం, ఆస్తి మున్నగువాటికి అంటిపెట్టుకుని ఉంటుంది. దాని అధారంగా అలాంటి సంస్కారాలే వెలికివస్తాయి. ప్రారబ్ధం నిర్మాణం అవుతుంది. జీవితంలో తన పిల్లల, కోసం, సిరి సంపదల కోసం ఏ నమ్మక ద్రోహం చేశాడో, మోసం చేశాడో ఇతరులను శారీరక, మానసిక బాధలకు గురిచేశాడో, ఏ హత్య చేశాడో, ఇతరుల సొత్తును ఎలా స్వాధీనపరుచుకున్నాడో, అలజడి సృష్టించాడో– ఆ పాప కర్మలన్నింటి సంస్కారాలు వెలికివచ్చి, ప్రారబ్ధాన్ని నిర్మాణం చేస్తాయి. అతడు ఎన్నెన్నో నికృష్ట జన్మలు పొంది, దాని ఫలాన్ని అనుభవించవలసి వస్తుంది. అతడి సంచితంలో ఉన్న పుణ్య కర్మలు అణగిపోతాయి.

మరో ప్రక్క – ఒక వ్యక్తి అత్యంత పవిత్రమైన సాత్విక జీవనం గడుపుతాడు. దయ–సేవలతో, కరుణ–ప్రేమలతో ధర్మాచరణలో నిమగ్నం అవుతాడు. సమాజ సేవకు, జాతి సేవకు అంకితం అవుతాడు. సజ్జనుడుగా వ్యవహరిస్తాడు. మరణ సమయంలో అతడి మనస్సులో అలాంటి శుభకరమైన భావనలే నిండి ఉంటాయి. ఈ భావనలు అతడి సంచితంలోని పవిత్ర సంస్కారాలను సమీకరించి, అతడి ప్రారబ్ధాన్ని నిర్మాణం చేస్తాయి. ఫలితంగా అతడు మరణం తర్వాత మరింత ఉత్కృష్టమైన మానవుడుగా జన్మిస్తాడు. తన సంచితంలో మిగిలిన పాప కర్మలను పురుషార్ధ ప్రాయశ్చిత్తముల ద్వారా నశింపజేయగలుగుతాడు.

మీరే ఆలోచించండి. ఒక వ్యక్తి జీవితమంతా అనైతిక – అశుభ కర్మలే చేస్తాడు. మరణ సమయంలో అతడికి శుభకరమైన ఆలోచనలు కలగడం సాధ్యమా? ఎల్లప్పుడూ పవిత్ర జీవితం గడిపిన వ్యక్తి మనస్సులో మరణ సమయంలో అశుభకరమైన ఆలోచనలు రాగలవా? అది దాదాపు అసాధ్యమే. మరణ సమయంలో మనకు మంచి ఆలోచనలే కలగాలంటే, అందుకు జీవిత ప్రారంభంనుండే అభ్యాసం జరగాలి. బాల్యంలోనే ఇలాంటి అలవాటు చేస్తే, చివరి వరకూ మరింత బలపడుతూ ఉంటుంది. గతంలో మన కర్మలు, ఆలోచనలు ఎలా ఉండినప్పటికీ, కనీసం మన శేష జీవితంలో అయినా శుభ కర్మలూ, పవిత్ర కర్మలూ చేసే అభ్యాసం సాగించాలి. మన భావాలను, ఆలోచనలనూ అవసరాన్ని బట్టి మార్చుకోవాలి. సాత్వికమూ, పవిత్రమూ అయిన జీవన విధానాన్ని అవలంబించాలి.

ఒక కవి ఇలా వ్రాశాడు –

***మరో పరంతు యో మరో కి యాద్ జో కరేఁ సభీ ।***
***హుఈ న యోఁ సుమృత్యు తో వృథా జియే వృథా మరే॥***

అనగా –

"మరణిస్తే. అందరూ గుర్తుంచుకునే విధంగా మరణించు. అలాంటి మంచి మరణం రాకపోతే – నీవు జీవించడమూ వృథా. మరణించడమూ వృథా."

కవి హృదయం కలిగిన మన మాజీ ప్రధానమంత్రి మాననీయ అటల్‌జీ ఇలా స్పష్టంగా వ్రాశారు–

***'జబ్ జన్మహు ఆతో ఇతరాతే ।***
***ఫిర్ మరణ్‌పర్ త్యోహార్ క్యో నహీ మనాతే ॥***

అనగా –

"మనిషి జన్మించినప్పుడు అంతా గర్విస్తారు. మరి అతడు మరణించినప్పుడు ఎందుకు పండుగ చేసుకోరు? "

తప్పనిసరి అయిన మృత్యువును స్వాగతిస్తూ అలా పండుగ చేసుకోగలిగితే–వృద్ధులు తమ శేష జీవితాన్ని కూడా ఆనందమయం చేసుకుంటారు. మరణాన్ని మహోత్సవంగా మార్చుకుంటారు. మృత్యుమహోత్సవానికి సన్నాహాలను మనం నిండు మనసుతో చేయాలి. అపుడే మనం మరణాన్ని, మంచి మరణంగా, మార్చగలుగుతాం.

★★★

మిత్రులనుగానీ, శత్రువులనుగానీ సమకూర్చి పెట్టేది మన ప్రవర్తనే.

## గాయత్రీమాత-24 శక్తిధారలు

# మందాకిని-9

కనిపించే గంగా మాత, కనిపించని గాయత్రీ మాత ఇద్దరూ సమానులే. గాయత్రి యొక్క ఒక శక్తి స్వరూపమే మందాకిని. గంగా మాతకే మందాకిని అన్న పేరు వచ్చింది. గంగా మాత పాపములను హరించి, పవిత్రతను ప్రసాదిస్తుంది. గాయత్రీ మాత అంతఃకరణను పవిత్రం చేస్తుంది. మనస్సులో ఉన్న దోషాలన్నీ సంస్కారాల ద్వారా దూరం చేయబడతాయి. గంగామాత, గాయత్రీమాత ఇద్దరూ కూడా జ్యేష్ఠశుక్లదశమి నాడే ఆవిర్భవించారు. రెండూ ఒకే సత్యానికి బొమ్మా, బొరుసులు. అందువల్లనే సూక్ష్మ శరీరాలుగా చెప్పడం జరుగుతోంది.


భగీరథుని తపస్సు ద్వారా గంగ అవతరించింది. బ్రహ్మదేవుని తపస్సు ద్వారా గాయత్రి అవతరించింది. మన జీవితంలో గాయత్రి యొక్క అనుగ్రహం పొందడానికి తపస్వివలె సాధన చేయాల్సి ఉంటుంది. గాయత్రీ మంత్రాన్ని అందించింది విశ్వామిత్ర ఋషి. ఆయన కూడా అంతులేని తపస్సు చేయాల్సి వచ్చింది. విశ్వామిత్రుడు గాయత్రీమాత ద్వారా సాధించిన 'బల-అతిబల' విద్యలను రామలక్ష్మణులకు నేర్పించాడు. వాటి ద్వారానే వారు సమర్థ వంతంగా విజయాలను సాధించగలిగారు. గాయత్రి మరియు సావిత్రి యొక్క పేర్లే 'బల-అతిబల' అని ప్రసిద్ధి.

గంగ శరీరాన్ని పవిత్రం చేస్తుంది. గాయత్రి ఆత్మను పవిత్రం చేస్తుంది. గంగ చనిపోయిన వారిని తరింపచేస్తుంది. గాయత్రి జీవితాలను తరింపచేస్తుంది. **గంగాస్నానం వల్ల పాపాలు కడిగివేయబడతాయి. గాయత్రివల్ల పాపపు ప్రవృత్తులు నిర్మూలించబడతాయి.** గాయత్రీ ఉపాసనకు గంగా తీరమే మిక్కిలి అనువైనది. ఇరువురి కలయిక గంగా యమునల సంగమం లాంటిది. అంటే అతి పవిత్రమైనది అని అర్థం. సప్తఋషులు కూడా గాయత్రీ సాధనకు గంగానది తీర ప్రాంతాన్నే ఎన్నుకున్నారు. అక్కడే దీర్ఘకాలం తపస్సు చేశారు. గాయత్రికి ఒక చేతిలో గంగా జలంతో నిండి ఉన్న కమండలం ఉంటుంది. అదే విధంగా పెద్ద ఎత్తున గాయత్రీ సాధన చేసేవారు గంగ యొక్క సన్నిధానాన్నే శ్రేష్ఠంగా భావిస్తారు.

రైదాసుకు సంబంధించిన భక్తి కథలో గంగామాత అవతరణకు సంబంధించిన కథ ఉంది. చిత్రకూట పర్వతం దగ్గర అనసూయాదేవి తపస్సు చేసి మందాకినీ మాతను భూమిపైకి తీసుకుని వచ్చింది అని చెపుతారు. గాయత్రీ ఉపాసనవల్ల సాధకుని అంతఃకరణం గంగోత్రి, గోముఖంవలె పవిత్ర స్థలంగా మారిపోతుంది. ఆ పవిత్ర స్థలం నుండి 'ప్రజ్ఞ' అనే మహా ప్రవాహం బయలుదేరుతుంది.

గాయత్రీ మాత యొక్క 24 ధారల్లో మందాకిని ఒకటి. ఆమె సన్నిధానం హృదయాలను పవిత్రం చేస్తుంది. పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవచ్చు. మనస్సులు చల్లబడతాయి. ధైర్యస్థైర్యాలు సమకూరుతాయి. గాయత్రికి గంగకు గల సంబంధం అవినాభావ సంబంధం. నామరూపంలోనే కాని, భావరూపంలో ఎలాంటి భేదం లేదు.

## శ్రద్ధాంజలి



**జననం : 01.07.1947**
**మరణం : 06.01.2010**

**సీనియర్ కార్యకర్త**

**క్రీ॥ శే॥ శ్రీ మోరపాకుల హనుమంతరావు**

వేటపాలెం గ్రా॥, ప్రకాశం జిల్లా.
వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తూ, గాయత్రీ చేతనా కేంద్రం-హైదరాబాద్.

**శక్తి సామర్థ్యాలను పెంచుకునే ప్రయత్నంలో ఉంటే, ఇతరులను విమర్శించడానికి సమయమే దొరకదు.**



మహిళా జాగరణ

# ఇంకానా ఈ బంధనాలు?

ప్రజల మనస్సులలో మహిళపట్ల విపరీతమైన భ్రమలు, మూఢ నమ్మకాలు వేళ్ళూనుకున్నాయి. మనిషికి మనిషి కనిపించని దట్టమైన పొగమంచులా ఉన్నాయి. అవన్నీ దుర్బుద్ధి, అజ్ఞానం అనిపిస్తోంది. అందువల్లనే ఈ రంగంలో మార్పు తేవలసిన అవసరం ఉంది. నమ్మకాలకు అనుగుణంగా ఆలోచనా ప్రవాహం సాగుతున్నది. దానిని బట్టి కార్యకలాపాలు, ఆచారాలు వ్యవహారాల క్రమం నిర్ణయం అవుతుంది. ఒకనాడు మహిళల ప్రాధాన్యం శిరోధార్యం అయింది. మానవరూపంలో ఉన్న దేవతగా ఆమెను పరిగణించారు. అప్పుడు ఆమె తన సామర్థ్యాలను వెలికితెచ్చి, సమస్త మానవజాతికీ అన్ని విధాలా మేలు చేసింది. కుటుంబాలను నవరత్నాల గనులుగా తయారు చేసింది. కానీ ఆ తర్వాత ఆమెను ఆ ఉన్నత పదవినుండి తొలగించి పెంపుడు పశువుతో సమానంగా భావించారు. అందువల్ల ఆమె అశక్తురాలు, రక్షణలేనిది, పరాధీన కావడం మొదలయింది.

నేడు మహిళపట్ల గల దృక్పథం అలాగే ఉంది. సంరక్షకులు ఆమెను పరాయి ఇంటి వ్యక్తిగా భావించి అశ్రద్ధ చేస్తున్నారు. బాలికలను చిన్న చూపు చూస్తున్నారు. భర్త దృష్టిలో ఆమె కామాగ్నిని చల్లార్చుకోవడానికి తెచ్చుకున్న ఒక సాధనం. ఆమెను కామినిగా, రమణిగా, భోగవస్తువుగా పరిగణిస్తున్నారు. సంతానపు పెను భారాన్ని మోసేటట్లు చేశారు. అత్తవారింట్లో కుటుంబం అంతటి దృష్టిలో ఆమె కేవలం ఒక దాసి మాత్రమే. ఆమె పగలు రాత్రి పనిలో నిమగ్నమై ఉంటుంది. ఆమె దానికి బదులు ఏ విధమైన అధికారంగానీ, గౌరవంగానీ పొందే ఏ అర్హతా ఆమెకు ఉండడం లేదు. ఈ నిర్బంధిత పరిస్థితులలో ఎవరైనా తమ ప్రతిభను కోల్పోవడం సహజమే. అదే జరిగింది. నీచ మనస్తత్వం ఆమె శ్రేష్ఠతను హరించింది. ఆమెను అసహాయురాలుగా, అసమర్థురాలుగా చేసింది. అలాంటి పరిస్థితిలో ఆమె ప్రతిభ పతనంకావడం సహజమే. సగం జనాభాను అలాంటి దయనీయ స్థితిలో పడవేసినప్పుడు, సమాజం కూడా నష్టపోక తప్పదు. మొత్తం ప్రపంచం ఆమె గొప్పతనంవల్ల కలిగే అనేక ప్రయోజనాలను కోల్పోవలసి వస్తున్నది. ప్రత్యేకించి భారతదేశంలాంటి వర్ధమాన దేశపు ప్రజలకు ఇలా నిరంతరం నష్టపోతూ ఉండడం చాలా బాధాకరం అవుతోంది.

న్యాయం కోసం, సముచిత స్థానం కోసం సంఘర్షణ జరుగుతున్న ఈ యుగంలో స్త్రీ యథాస్థితిలో ఉండడం జరుగదు. కాలం అనేక సందర్భాలలో అనేక స్థాయిలలో మార్పులు తప్పనిసరి అయేటట్లు చేసింది. ఆ ప్రవాహం స్త్రీని యథాస్తితిలో పడి ఉండనివ్వదు. ఈ మార్పు, ఈ అభివృద్ధి మహిళల హక్కులను చట్టబద్ధం చేయడంతో ప్రారంభమయింది. అది సామాజిక రంగంలో మహిళకు తగిన న్యాయం లభించే అవకాశాన్ని ఇచ్చింది. పంచాయితీ ఎన్నికలలో ఆమెకు 30 శాతం స్థానాలు కేటాయించబడ్డాయి. ఈ కేటాయింపు ఇక ముందు ప్రాంత, కేంద్ర శాసనసభలలో కూడా లభించవచ్చు. ఇందువల్ల ఉప్పొంగిన ఉత్సాహం స్త్రీ పురుషులను ఇద్దరినీ ప్రభావితం చేసింది. తాను అన్ని విధాల శాసించబడే స్థితిలోనే ఎందుకు ఉండిపోవాలి అని స్త్రీ ఆలోచిస్తోంది. తనకు పరిపాలనలో భాగస్వామి అయ్యే అవకాశం లభించినపుడు దానిని ఎందుకు వదులుకోవాలి అని ఆమె ప్రశ్నిస్తోంది. భవిష్యత్తులో తన వర్గానికి ఉన్నతాధికారాలు ఇప్పించే ఆలోచన ఎందుకు చేయకూడదని ఆమె అడుగుతోంది. పురుషులు కూడా తమ కుటుంబ సభ్యులెవరైనా పరిపాలనలో భాగస్వాములయితే తద్వారా మొత్తం కుటుంబానికి గౌరవం, అధికారం పెరుగుతాయని ఆలోచిస్తున్నారు. గౌరవం, ప్రయోజనం లభించే అవకాశం ఉన్నపుడు దేనికైనా సహజంగా అంగీకారం అందుతుందికదా. ప్రస్తుత సంస్కరణకు అందరూ స్వాగతమే పలుకుతున్నారు. మహిళలు సామాన్య ప్రజల దృష్టిలో గొప్ప వాళ్ళుగా భావింపబడడానికీ, వారికి ఓటు వేయడంలో సఫలత లభించడానికీ దోహదం చేసే ప్రయత్నాలు జరగాలి.

★★★

**స్వార్థ పరునికి ఇతరుల సానుభూతి-సహకారాలు లభించవు.**



చి॥ అమూల్య
ప్రథమ బహుమతి

## 2010 వసంత పంచమి సందర్భంగా : వక్తృత్వ పోటీలు

# 21వ శతాబ్ది ఉజ్జ్వల భవిష్యత్తు - 1

**వేదికను అలంకరించిన పెద్దలందరకు నమస్కారం**

ఈ రోజు పూజ్య గురుదేవుల ఆధ్యాత్మిక జన్మదినం. వసంత పంచమి. ఇది చెట్లు చిగిర్చే కాలం. మన జీవితాలు కూడా అదే విధంగా ఉజ్జ్వల భవిష్యత్తు కోసం కొత్త రూపుదాల్చుకుని శ్రమించాలని ఆశిస్తూ–

'21వ శతాబ్ది–ఉజ్జ్వల భవిష్యత్తు' గురుదేవుల నినాదం. ఉజ్జ్వల భవిష్యత్తు వచ్చేసింది అని ఆయన చెప్పిన మాటలమీద నమ్మకమే మనకు మార్గాన్ని చూపిస్తుంది. నమ్మకం లేకపోతే మనం ఏ పనీ చెయ్యలేం. నేడు ప్రపంచం అంతా కష్టాలతో, బాధలతో, ఈర్ష్యా ద్వేషాలతో, భయంకరమైన రోగాలతో, మానసిక అశాంతితో నిండి ఉంది. వీటిని కొంత కాలం ఆపగలమే గాని, పూర్తిగా తొలగించలేము అని అంటున్నారు. దానికి కారణం మానసిక సంతులనం లేకపోవడమే.

**"అవినీతి, బంధుప్రీతి, చీకటిబజారు అలుముకున్న**
**ఈ దేశం ఎటుదిగజారు?**
**కాంచవోయినేటి దుస్థితి ఎదిరించవోయి ఈ పరిస్థితి"**

అందుకే గురుదేవులు తన మహా ప్రయాణానికి ముందు క్రాంతి ధర్మీ సాహిత్యాన్ని రచించారు. "ఈ విచార క్రాంతి బీజాలు ఎక్కడ నాటినా, అవి మొలకెత్తి ప్రపంచపటాన్నే మార్చి వేస్తాయి అని చెప్పారు. ప్రపంచం మారిపోయింది. అంటే ఒకే ధర్మం, ఒకే భాష, ఒకే కరెన్సీ వస్తుంది. అలా రావాలి అంటే మనలో ప్రేమతత్వం పెంచుకోవాలి" అని చెప్పారు.

**ప్రతి మనిషీ మరి ఒకడిని దోచుకునేవాడే,**
**తన సౌఖ్యం, తన భాగ్యం సరిచూసుకునేవాడే**
**స్వార్థమే అనర్థకారణం అది చంపుకుంటే**
**క్షేమదాయకం**

ఈ స్వార్థం కారణంగానే మనం ఏడు భయంకర ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవల్సి వస్తుందనీ, 21.12.2012 నాటికి ప్రపంచం అంతం అవుతుందనీ చెపుతున్నారు.

భారతదేశం మరలా జగద్గురు స్థానం ఆక్రమిస్తుందని (1503 – 1559) 16వ శతాబ్దంలోనే 'నోస్ట్రడామస్' చెప్పాడు. వీర బ్రహ్మేంద్ర స్వామి, మన గురువుగారు కూడా చెప్పారు. అందరూ దేవ మానవస్థితిలో ఉండాలని యజ్ఞాన్నీ, గాయత్రీమంత్రాన్నీ అందరికీ ఇచ్చేశారు. గాయత్రీమంత్రం భూర్, భువ, స్వః లోకాలుదాటి మహః లోకంలోకి తీసుకుపోతుంది.

శ్రీరామకృష్ణ పరమహంస దేవతాశక్తులన్నీంటినీ భూమి మీదకు దించేశారు. కానీ వారికి కావలసిన శక్తిని వారి తర్వాత ఎవ్వరూ అందించలేకపోయారు. అందువల్ల శ్రీరామకృష్ణ పరమహంస మళ్ళీ శ్రీరామశర్మ ఆచార్యగా జన్మించి యజ్ఞ విద్యను అందరికీ అందించారు. యజ్ఞం వల్ల దేవతలకు శక్తి, మనకు ఆరోగ్యం లభిస్తున్నాయి. వాతావరణం శుభ్రపడుతోంది.

గురుదేవులు తన తపఃశక్తిని రాబోయే శతాబ్దికి అధిష్ఠాన దేవత అయిన సూర్యునిలో ఉంచారు. మనం రోజూ చేస్తున్న గాయత్రి వల్ల సూర్యునికి, మనకు లింకు ఏర్పడుతుంది. సూర్యుని గొప్పదనం మనకు పురాణాలనుండి తెలుస్తుంది. ఎప్పుడైతే మనం నాలుగువేదాలను కరెక్ట్‌గా ఉపయోగిస్తామో, అంటే సమఝుదారీ, ఇమాన్ దారీ, జిమ్మేదారీ, బహాదురీ జీవితంలో చూపిస్తామో అప్పుడే మనకు ఉజ్జ్వల భవిష్యత్తు లభిస్తుంది..

అందుకు మనం సమయదానం, అంశదానం, ప్రతిభా దానం ఇవ్వాలి. అన్నింటికన్నా గొప్పదానం సమయ దానం. గురుదేవులు సమయదానమే యుగ ధర్మం అని చెప్పారు. సమయాన్ని ఉపయోగించుకోవడానికి ఆలోచనల్లో మార్పు రావాలి.

**నవసమాజ నిర్మాణమే మన ధ్యేయం**
**సకల జనుల సౌభాగ్యమే మనలక్ష్యం**
**మన లోకానికి, మన భారతదేశం**
**అందించునులే శుభ సందేశం**

జై గురుదేవ్

★★★

**ప్రతీ అవకాశంలోనూ కష్టాన్ని చూస్తాడు నిరాశావాది.**



పొన్నూరు హైమవతీ శాస్త్రి
ద్వితీయ బహుమతి

2010 వసంత పంచమి సందర్భంగా : వక్తృత్వ పోటీలు

# యుగేచ్ఛ-ప్రతిభా పురస్కార్-2

**సభాసరస్వతికి నమస్కారములు**

***మనోజవం మారుతతుల్యవేగం –***
***జితేంద్రియం బుద్ధిమతాంవరిష్ఠం ।***
***వాతాత్మజం వానరయూధ ముఖ్యం***
***శ్రీరామదూతం శిరసానమామి ॥***

అని హనుమంతుని గుణగణాలను కీర్తిస్తూ నమస్కరిస్తాం. ఇక్కడ వ్యక్తికన్నా గుణాలకే ప్రాముఖ్యాన్నిస్తున్నాం. సరిగ్గా ఇవే గుణాలను పుణికిపుచ్చుకుంటేనే యుగనిర్మాణం సాధ్యపడుతుందని గురుదేవులు "యుగేచ్ఛ – ప్రతిభాపురస్కార్ పుస్తకంలో స్పష్టంగా చెప్పారు." అందుకే ఈపుస్తకంలో జీవనీశక్తి, మనోబలం, ఆత్మబలం, ప్రతిభా సంవర్ధన, విశిష్టత, శక్తి, ప్రతిభ, ప్రతిభాసంవర్ధనకుమార్గాలు అంటూ 8 విషయాలమీద చర్చించడం జరిగింది.

ప్రధానంగా **జీవనీశక్తిని** గూర్చి రెండురకాలుగా చెప్పారు. (1) బాహ్య (2) అంతరిక. పెట్రోలు లేనిదే మోటారుమొదలైన వాహనాలు నడవవు. అదే విధంగా ప్రాణపక్షి ఎగిరిపోతే శరీరం ఎందుకు పనికిరాదు. అవయవాలన్నీ కొయ్యబారిపోతాయి. ఇది బాహ్య జీవనీశక్తి. మన అవయవాలు కాలు, చెయ్యి, మెదడు మొదలైనవన్నీ అంతరిక జీవనీ శక్తిపైనే ఆధారపడి పని చేస్తాయి. అంతరిక ప్రేరణ లేనిదే ఏ అవయవం పని చేయదు. ఈ అంతరికశక్తి పని చేయాలంటే **మనోబలం** అవసరం. ఇంగ్లాండు లో 'పాట్రిక్‌మేరి' అనే ఆమెకు కాన్సరు వచ్చింది. డాక్టర్లు బ్రతికే ఆశలు లేవన్నారు. దానిని తెలియచేసే యంత్రం ఆరోజుల్లో ఒకే ఒకటి ఉంది. దాని విలువ 3 కోట్లు. ఆమె తన జబ్బు విషయం పూర్తిగా మరచిపోయింది. చందాలు వసూలు చేసింది. పూర్తి మనోబలంతో రెండవయంత్రాన్ని తయారు చేయించింది. పరీక్ష చేయించుకుంది. డాక్టర్లంతా ఆశ్చర్యపోయారు. ఆమెకు జబ్బు లక్షణాలే లేకుండా పోయాయి. దీనికి ఆమె మనోబలమే కారణం అన్నారు. హనుమంతుడు తన శక్తిని తాను గ్రహించడానికి జాంబవంతుడు సహకరించాడు. ఆఫ్రికాలో మసాయీ తెగవారు మనోబలంతోనే సింహాలతో పోరాడేవారు.

మనోబలం ద్వారానే **ఆత్మబలాన్ని** పెంచుకోగలుగుతాం. మనస్సుకు, ఆత్మకు తేడా ఉంటుంది. మనస్సు కోరికల పుట్ట. అన్నింటినీ కోరుకుంటుంది. ఆత్మ విచక్షణా జ్ఞానంతో కొన్నింటిని నిషేధిస్తుంది. కొన్నింటిని బలపరుస్తుంది. దేనినైనా "నేను సాధించగలను'' అనుకోవడం మనోబలం. ''నేను సాధించితీరుతాను'' అనుకోవడం ఆత్మబలం. ఇలాంటి ఆత్మబలంతోనే పాల్‌బ్రంటన్, శ్రీమాత, అనీబిసెంటు, నివేదిత మొదలైనవారు భారతీయ సంస్కృతిని జీర్ణం చేసుకోగలిగారు. ఇవన్నీ సాధించుకోవాలి అంటే మనం **మన ప్రతిభను వృద్ధి చేసుకోవాలి.** అంటే శుద్ధి చేసుకోవాలి. ఉదాహరణకు అగ్గిపెట్టెఉంది. మనం తలుచుకుంటే వినాశనానికి వాడగలం. అభ్యున్నతికి వాడగలం. మనం మన తెలివితేటల్ని సద్వినియోగం చేసుకున్నట్లైతే వికసించిన పుష్పం సీతాకోకచిలుకలను, తుమ్మెదలను ఆకర్షించుకున్నట్లుగా ప్రతిభావంతులను ఆకర్షించుకోగలుగుతాం. దానివల్ల మన **విశిష్టత** పెరిగిపోతుంది. ఆ విశిష్టత ద్వారా **ఆత్మపరిశీలన** చేసుకోవాలి. ఆత్మ పరిశీలన వల్ల మనలోని లోపాలు అర్థం అవుతాయి. అర్థంకావడాన సవరించుకో గలుగుతాం. **ఆత్మ సవరణ** వల్ల **ఆత్మ నిర్మాణం** జరుగుతుంది. ఆత్మ నిర్మాణం వల్ల **ఆత్మవికాసం** జరుగుతుంది. ఆత్మవికాసంతో మనలోని **శక్తి** రెట్టింపు అవుతుంది. ఆత్మశక్తితో **ఆత్మవిశ్వాసం** పెరిగిపోతుంది.

అందువల్ల మనలోని తెలివిని శుద్ధి చేసుకోవాలని ఈ పుస్తకంలో పదే పదే చెప్పారు గురుదేవులు. ప్రతిభను శుద్ధి చేసుకోవడానికి చివరలో 10 రకాల ప్రాణాయామ మార్గాలు చెప్పారు. స్వసంకేతం, దర్పణసాధన, రంగులవాతావరణం, ప్రాణాకర్షణ ప్రాణామాయం, సూర్యభేదన ప్రాణామాయం, అయస్కాంత స్పర్శ, ప్రాణవంతుల సాన్నిధ్యం, నాదయోగం, ప్రాయశ్చిత్తం, అంకురాలకల్పం – వనౌషధాల సేవనం అంటూ చక్కగా వివరించారు.

వారి ఆశయం, మన లక్ష్యం నెరవేరాలంటే ముందు తెలివి తేటలకు పదునుపెట్టుకోవాలి. పుస్తకం తెరవండి. చదవండి. ఆచరించండి. ఈ విధంగా క్రాంతి ధర్మీసాహిత్యంలోని 20 పుస్తకాలను అవగాహన చేసుకుంటూ చదవ గలిగిన నాడు గురుదేవుల కార్యాన్ని నిర్వహించిన వారలం అవుతాం. ఈ అవకాశం కల్పించిన పెద్దలకు ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

★★★

**దేశ, కాల, పాత్రతలను బట్టి చేసే ధర్మం అక్షయమోక్షం**



భాగవతుల శారద
తృతీయ బహుమతి

2010 వసంత పంచమి సందర్భంగా : వక్తృత్వ పోటీలు

# 21వ శతాబ్ది ఉజ్జ్వల భవిష్యత్తు-2

**అందరికీ నమస్కారం**

"21 శతాబ్ది-ఉజ్జ్వల భవిష్యత్తు" కు పూజ్య గురుదేవులు ప్రధానంగా నాలుగు ఆదర్శాలను ఇచ్చారు. ఈ నాలిగింటిని నాలుగు వేదాల సారంగా చెప్పవచ్చు. అవి ఏమిటంటే 1. ఇంగిత జ్ఞానం 2. నిజాయితీ 3. బాధ్యత 4. సాహసం. వీటిని పాటించకపోవడం చేతనే నేడు సమాజంలో అనేక దుష్ట ప్రవృత్తులు దాపురించాయి. ఈనాలిగింటిని పాటిస్తేనే ఉజ్జ్వలభవిష్యత్తు లభిస్తుంది.

**1. ఇంగిత జ్ఞానం:** ఇంగిత జ్ఞానం అంటే దూరదృష్టి. తాత్కాలిక లాభాన్ని చూసుకోకుండా, తర్వాత వచ్చే సమస్యలను గూర్చి ఆలోచించాలి. దుర్వసనాలు కూడా ఇలాంటివే. తాగుబోతులకు, జూదరులకు కుటుంబంలోనూ, సమాజంలోనూ కూడా గౌరవం లభించదు. ఆర్థికంగా ఇబ్బందులు పడతారు.

అడవిలో బియ్యం గింజలను చూసి ఏమాత్రం ఆలోచించకుండా పావురాలు క్రిందకు వాలి వలలో చిక్కుకుంటాయి. ఇంగిత జ్ఞానం లేదనడానికి ఇంతకు మించిన ఉదాహరణ లేదు. మనస్సును అదుపులో పెట్టుకుని వివేకంతో ఆలోచించాలి. అన్ని అనార్థాలకు మనస్సే మూలం అని తెలుసుకోవాలి.

**2. నిజాయితీ :** నిజాయితీ అంటే "ఇతరులు మా ఎడల ఎలా ప్రవర్తించాలని కోరుకుంటామో, మేము ఇతరుల ఎడల ఆ విధంగానే ప్రవర్తిస్తాము" అని గురుదేవులు సత్ సంకల్పాలలో చెప్పినట్లు నడుచుకోవడమే నిజాయితీ. మనం "ఇతరులు మనతో స్నేహంగా ఉండాలి. మనల్ని గౌరవించాలి" అనుకుంటాం కదా! అదే విధంగా మనం కూడా ఇతరులతో ప్రవర్తించాలి. అట్లా చేయగలిగితే మనం నిజాయితీగా ఉన్నట్లే లెక్క. దీనినే భక్తి అంటాం. దీనినే తపస్సు అంటాం. దీనినే ధర్మం అంటాం. మన నిజాయితీ గురించి మనల్ని మనం ఎప్పుడూ ప్రశ్నించుకుంటూ ఉండాలి. దానికి మన అంతరాత్మే సాక్షి.

**3. బాధ్యత :** మనిషి స్వతంత్రుడే. అయినా తన మనస్సు పట్ల, శరీరం పట్ల చాలా బాధ్యతగా ఉండాలి. శరీరం కోసం ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. మనస్సు ఉల్లాసంగా, పవిత్రంగా ఉంచుకోవడానికి స్వాధ్యాయం చెయ్యాలి. సత్సంగాలలో పాల్గొవాలి.

భగవంతుడు మనలను తన వారసులుగా సృష్టించాడు. ఈ ప్రపంచం అనే ఉద్యానవన్నాన్ని అందంగా క్రమబద్ధంగా తయారు చేయవలసిన బాధ్యత మనందరిదీ మనకుటుంబాన్ని తీర్చిదిద్దుకోవడంతో పాటు, సమాజంలో కూడా కష్ట సుఖాలు పంచుకోవాలి. అప్పుడే మనం మన బాధ్యతను నిర్వర్తించిన వాళ్లం అవుతాం.

**4. సాహసం :** ఒక బలవంతుడు బలహీనుని కొట్టడం సాహసం అనిపించుకోదు. ఒక డేగ పక్షి పిల్లల్ని చంపడం సాహసం కాదు. సమాజాన్ని, సంస్కృతిని దీప్తివంతం చేయగలిగిన వ్యక్తే సాహసవంతుడు. మంచి వారిని అందరినీ ఒక చోటకు చేర్చగలిగినవాడు సాహసి. మహాత్మ గాంధీని సాహసవంతుడు అని చెప్పవచ్చు. చిన్నగా, బక్కగా ఉన్న ఆయన తన లక్ష్యాన్ని నెరవేర్చడానికి గొప్పసాహసం చేశాడు. మన గురుదేవులు 21వ శతాబ్ది - ఉజ్జ్వల భవిష్యత్తు కోసం గొప్ప సాహసం చేశారు. దాన్ని అనుభవించడం కోసం, ప్రజల మనసుల్లో మార్పును తేవడం కోసం గురుదేవుల సాహిత్యాన్ని ఇంటింటికీ తీసుకుని వెళ్లాలి. ఆయన మనకు అప్పగించిన పనిని పూర్తి చేయడానికి మనమంతా సాహసంతో ముందుకు సాగాలి. అనవరమైన సాకులతో నిరాశా-నిస్పృహలకు లోను కాకూడదు. ధైర్యంగా ముందడుగు వేయడమే సాహసం.

గురువుగారు ఇచ్చిన ఆదర్శాలను జీవితాలలో ఆచరించి ధన్యులం అవుదాం.

★★★

ప్రేమ బాధలను సహిస్తుందే కాని ప్రతీ కారాన్ని తలపెట్టదు. - మహాత్మా గాంధీ.

నా వారితో నా మాట : 2011 -2012 (శతాబ్ది సంవత్సరం)

# శతజయంతి ఉత్సవాల రూపురేఖలు-14

## 2010 వసంత పంచమి - నూతన సంకల్పాలు

ఇప్పుడు హరిద్వార్‌లో మహా కుంభమేళా నడుస్తోంది. కాలం ఆగడం లేదు. మహావేగంగా రోజులు గడిచిపోతున్నాయి. పరమపూజ్య గురుదేవుల జన్మశతాబ్దికి ఇంకా సంవత్సరం కూడా మిగిలి లేదు. ఈ రోజుల్లో ఇక్కడ (ఉత్తరాంచల్‌లో) శిశిర ఋతువు నడుస్తోంది. మధ్య ప్రదేశ్, దక్షిణ భారతంలో వసంతఋతువు. అయినప్పటికీ గ్రీష్మఋతువును గుర్తు చేస్తూ ఉంది. ఈ వ్యాసం వ్రాస్తూ ఉన్న సమయాన శాంతికుంజ్‌లో వసంత ఋతువు కాకుండా శిశిర ఋతువు యొక్క అనుభూతి కలుగుతోంది. ఇలాంటి సమయంలో గురుసత్తా ప్రేరేపించిన వసంత సందేశాన్ని అందిస్తూ ఉన్నాం. దట్టమైన పొగమంచు, ఎముకలను కొరికివేసే చలిలో కూడా శాంతికుంజ్‌లోనూ, దేవ సంస్కృతీ విశ్వ విద్యాలయంలోనూ వసంత పర్వం మహోల్లాసంతో నిర్వహించబడింది. నూతన సంకల్పాలు తీసుకోవడం జరిగింది. ఆ సంకల్పాలను ప్రజలందరికీ అందిస్తున్నాం.

### 85 సంవత్సరాల కృషి - పరిపక్వత

గాయత్రీ పరివార్ వసంత పంచమినాడే స్థాపించబడిందని మనకందరికీ తెలుసు. 85 సంవత్సరాల క్రితం 1926లో పరమపూజ్య గురుదేవులు అఖండ జ్యోతిని వెలిగించారు. దాని వెలుగులో దాదాగురు దేవుల ఆదేశాలను స్వీకరించారు. ఫలస్వరూపంగా గాయత్రీ పరివార్ ఆవిర్భవించింది. అఖండ జ్యోతికి ప్రతి రూపమే "జ్ఞాన యజ్ఞ కీ లాల్ మశాల్" పరమ పూజ్యగురుదేవులు ఎర్రకాగడానే తన యొక్క ఉత్తరాధికారిగా ప్రకటించారు. ఈ 2010ని మనం జన్మశతాబ్ది వత్సరానికి ప్రచార సంవత్సరంగా జరుపుకుంటూ ఉన్నాం. దీనిని భారతదేశంతోపాటు విదేశాలలో ఉన్న శాఖలన్నింటిలో 8.2.2011 నుండి ఒక సంవత్సరం జరుపుకుంటాం. ఈ రెండు సంవత్సరాల కొరకు కావలసిన నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. వాటిని పరివార సభ్యులందరూ మాటిమాటికి గుర్తు చేసుకుంటూ, అమలులో పెట్టే ప్రయత్నం చెయ్యాలి. మనమందరం బాధ్యతగా నిర్వహించిన నాడే 85 సంవత్సరాల కృషి ఫలిస్తుంది.

### గురుదేవులు సాధించిన మహత్వపూర్ణ కార్యాలు మూడు

1. పరమపూజ్య గురుదేవులు సాధించిన మొట్టమొదటి శ్రేష్ఠ కార్యం గృహస్థులకు గాయత్రిని నేర్పించి, మంచి గృహస్థులుగా తయారు చేయడం. వారు స్వయంగా 1923 నుండి ప్రారంభించి 24 సంవత్సరాలు నిర్విరామంగా గాయత్రిని ఒక యోగంగా సాధన చేశారు. ఘోర తపస్సు చేశారు. అదే గాయత్రీ యోగాన్ని లక్షలమంది, కోట్లమంది పరిజనుల జీవితాలలో ప్రవేశపెట్టారు. ఇది ఒక విచిత్రమైన సంయోగం. అదే సమయంలో శ్రీ అరవిందమహర్షి (పాండిచ్చేరి), రమణ మహర్షి (తిరువన్నామలై) ల యొక్క సాధనాపరమైన ప్రయోగాలు సూక్ష్మ జగత్తులో జరుగుతూ ఉన్నాయి. ఒక తపస్వి, ఒక బ్రాహ్మణుడు, ఒక సమాజ సేవకుడు ఏమేమి చేయగలరో గురుదేవులు చేసి చూపించారు. అటువంటి తపోనిష్ఠ వేద మూర్తి పండిత శ్రీరామ శర్మ ఆచార్య ద్వారా ఈ విశాలగాయత్రీ పరివార్ స్థాపించబడింది.

2. యుగ పరివర్తనా సూత్రాలను మనిషి మనిషికీ చేర్చడం కోసం యుగనిర్మాణ యోజనతో పాటు 18 యుగనిర్మాణ సత్సంకల్పాలను తయారుచేశారు. 18 సూత్రాలలో జాతి, వర్గ, ధర్మ, సంప్రదాయాలతో నిమిత్తం లేకుండా అందరికీ మార్గదర్శనం లభిస్తుంది. ఒక రకంగా ఈ సత్సంకల్పాలు నవయుగ నిర్మాణపద్ధతులు అని చెప్పవచ్చు. వీని ఆధారంగానే రాబోయే 2012 విపత్తునుండి రక్షింపబడి నవయుగ నిర్మాణం జరిగి తీరుతుంది.

3. నిరాశావాదం నుండి ఆశావాదం వైపుకు మళ్లించి ధైర్యాన్ని అందించే నిమిత్తం "21వ శతాబ్ది – ఉజ్జ్వల భవిష్యత్తు" అన్న నినాదాన్ని అందించారు. కేవలం నినాదమే కాదు, ఏ విధంగా జరుగుతుందో అంచనాలు గీసి చూపారు. కోట్లాది ప్రజలకు ధైర్యాన్ని నూరిపోశారు. ఆశావాదాన్ని రేకెత్తించారు. మానవునిలో దైవత్వం, భూమిపై స్వర్గావతరణ సూచన ప్రాయంగా కనబడుతూ ఉన్నాయి. ప్రచార సంవత్సరం, శతాబ్ది సంవత్సరం రెండు సంవత్సరాలలోనూ ఈ నిర్ణయాలను ప్రజల మధ్యకు చేర్చగలగాలి,

కష్టాలను సహించి, సర్దుకుని పోవడం గొప్పదనానికి నిదర్శనం.

ప్రస్తుతం మారుతున్న యుగానికి కొన్ని చిహ్నాలు కనిపిస్తూ ఉన్నాయి. ఆ చిహ్నాల ఆధారంగా అర్థం చేసుకోవాలి. క్రమంగా అభివృద్ధి చెందుతుంది అని నమ్మాలి. గడచిన వసంత పర్వంలో ఇవే సంకల్పాలను తీసుకోవడం జరిగింది.

## ప్రచారవత్సరానికి సంకల్పాలు (2010 జనవరి నుండి 2011 ఫిబ్రవరి వరకు

1. 28.4.2010 నాటికి కుంభమేళా సమాప్తం అవుతుంది. వెంటనే యుగనిర్మాణ సత్సంకల్పాలను ఆధారంగా తీసుకుని ప్రవచనాలిచ్చే ప్రవక్తలకు ప్రశిక్షణ ప్రారంభం అవుతుంది. ఈ ప్రశిక్షణ మే, జూన్, జూలై నెలల్లో కేంద్ర కార్యకర్తలకు ఇవ్వబడింది. జూలై తరువాత (గురు పౌర్ణమి తర్వాత) క్షేత్రానికి ఆహ్వానించబడిన చైతన్య వంతులైన కార్యకర్తలకు మూడు నెలలు ప్రశిక్షణ ఇవ్వబడుతుంది. పాఠ్యక్రమం తయారు చేయబడుతూ ఉంది.

2. యుగనిర్మాణ సత్సంకల్పాలు, గురుదేవుల ఆలోచనలు, నిర్ణయాలు, ఇప్పటికి వరకు నడిచిన కార్యక్రమాల మీద ఒక ప్రదర్శన శాల, స్లైడ్ ప్రొజెక్టర్స్, మల్టీమీడియా, పవర్ పాయింట్స్ ద్వారా వ్యాఖ్యాన పరంపరలు దేశవిదేశాలలో కొనసాగుతాయి. గురుపౌర్ణమి తర్వాత విదేశాలలోనూ, ఆశ్వయుజ నవరాత్రుల తర్వాత భారత దేశంలోనూ పెద్ద ఎత్తున ప్రారంభం అవుతాయి. ఈ వ్యాఖ్యానాలు భిన్న భిన్న జాతి, వర్గ, ధర్మ, సంప్రదాయాల కార్పోరేట్ బృందాలలో గాయత్రీ పరివార్ ద్వారా నిర్వహింపబడతాయి.

3. తక్కువలో తక్కువ లక్షంబాతిక గాయత్రీ మంత్రజపం (ఒకలక్ష ఇరవై ఐదు వేలు) అనుష్ఠాన సమయంలో ఏదో ఒక సమయంలో పూర్తి చేయాలని పరివార సభ్యులందరినీ కోరడం, చెప్పిన సంఖ్యను మించిపోవడానికి ప్రయత్నించడం, గురుసత్తాలో ఒక అంగంగా తయారుకావడానికి భావశ్రద్ధను చూపడం మొదలైనవన్నీ గొప్పశక్తిని సమకూర్చిపెడతాయి. ఆ శక్తి సామర్థ్యాలు జన్మశతాబ్ది కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడతాయి. ప్రతి ఒక్క పరిజనుడు గురుదేవులు చెప్పిన సిద్ధాంతాలను ఆచరించే ప్రయత్నం చెయ్యాలి.

4. 2009 తెలుగు ఉగాది తర్వాత ప్రారంభించిన శతాబ్ది సాధనా పురశ్చరణలో పెద్ద సంఖ్యలో పరిజనులు పాల్గొన్నారు. 2011 తెలుగు ఉగాది తర్వాత దీనికి పూర్ణాహుతి జరుగుతుంది. దాని యొక్క స్వరూపం అందరికీ తెలిసిందే.

**5. సప్త విప్లవాలలో మూడు విప్లవాలు :** 1. పర్యావరణ సంతులనం కొరకు విశిష్ట ప్రయత్నాలు 2. ఆడంబర వివాహాలకు, ఆడంబర ప్రదర్శనలకు విరుద్ధంగా ఉద్యమించడం 3. వ్యసనాలను దూరం చేసుకోవడానికి విశ్వప్రయత్నం. ఈ కార్యాన్ని యువశక్తి ద్వారా పూర్తిచేయడం, సంస్థలో నూతనశక్తిని ప్రవేశపెట్టడం, ప్రతి యొక్క విశ్వవిద్యాలయం, విద్యాలయం, కార్పోరేట్ బృందాలలో 'దియా' ఉద్యమం ద్వారా ఈ విప్లవాలను నడపడం మొదలైనవి ఈ ప్రచార సంవత్సరంలో చేయబడతాయి. ప్రతిభావంతులైన, భావనాశీలురైన యువత ఎదురుచూస్తూ ఉన్నది. 65 కోట్ల సంఖ్యగల యువత గాయత్రీ పరివార్ కార్యక్రమాల్లో భాగం పంచుకోవాలని ఉవ్విళ్లూరుతూ ఉంది. వారిని సాధనాత్మక ప్రయత్నాల ద్వారానూ ప్రారంభిక పరిచయ పుస్తకాలను చదివించడం ద్వారానూ ఉద్యమంలోనికి ఆహ్వానించడం జరగాలి.

**6. క్రొత్తవారి ఇండ్లల్లో గాయత్రీ మంత్రంతోపాటు భావార్థం వ్రాసి ఉన్న స్టిక్కర్లను అంటించడం :** ఎవరి ఇండ్లల్లో అంటిస్తున్నామో వారి వారి భాషల్లో ఉన్న స్టిక్కర్లను ఈ సంవత్సరం అంటించాల్సి ఉంటుంది. దీనితోపాటు ఎర్ర కాగడా (వ్యాఖ్యతో కూడి ఉన్నదానిని)ను అంటించవలసి ఉంటుంది. ఇది ఒక తుఫానులాగా నడవాలి. 2011కు పూర్వమే పూర్తి కావాల్సి ఉంటుంది. **"ఇంక్విలాబ్-జిందాబాద్" లాగా "మనం మారుదాం - యుగం మారుతుంది" అన్న నినాదం హోరెత్తిపోవాలి.**

7. గురుదేవులు రచించిన 3200ల పుస్తకాలే వారి జ్ఞాన శరీరం. 70 వాఙ్మయాలు పూర్తి అయ్యాయి. 38 వాఙ్మయాలు తయారు అవుతూ ఉన్నాయి. కాని వారి జ్ఞాన జ్యోతిని ఇంటింటికీ చేర్చడానికి ఎంపిక చేసిన 5-10 పుస్తకాలను సిద్ధం తీసుకోవాలి. జ్ఞాన ప్రసాదంగా ఇంటింటికీ చేర్చాలి. అన్ని భాషలవారికి అందించే నిమిత్తం దాదాపు 40 భాషల్లోకి అనువాదం చేయబడాలి. పుస్తకాలతో పాటు సద్వాక్యాలను కూడా అనువదిస్తూ ఉన్నారు. వీటిల్లో తక్కువలో తక్కువ 5 పుస్తకాలన్నా ఇంటింటికీ పంచాల్సి ఉంటుంది. ఈ కార్యం కొరకు జ్ఞాన రథాన్ని త్రిప్పాల్సి ఉంటుంది.

8. ముమ్ముందు ముండీయజ్ఞాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. సత్సంకల్పాల వ్యాఖ్యానంతో పాటు ఉజ్జ్వల భవిష్యత్తును గురించి ప్రార్థన, దీపయజ్ఞాల ద్వారా మహాకాలునికి హారతి మొదలైనవి నిర్వహింపబడతాయి. ఒక్కొక్కరు ఒక్కొక్క పళ్లెంలో అయిదేసి దీపాల వెలిగించుకుని వస్తారు. అందరూ

**సమస్యలు అందరికీ ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి - కాని ఎదుర్కోవడానికే శక్తి సామర్థ్యాలు కావాలి.**

కూర్చుని సామూహికంగా దీపయజ్ఞాలు చేసుకుంటారు. ఈపరంపర గ్రామ గ్రామాల్లోనూ, మండల స్థాయిలోనూ, జోనల్–ఉపజోనల్ స్థాయిలలోనూ జరుగుతాయి.

9. గురుదేవుల జీవితాన్ని తెలియచేస్తూ వారి జ్ఞాన శరీరం, తపస్సు, బ్రాహ్మణ తేజం, గాయత్రీపరివార సంస్థ మొదలైన వాటిని ఒక ప్రదర్శన శాల రూపంలో 7 లక్షల గ్రామాలకు పంపించడం జరుగుతుంది. ఇది అన్ని భాషలలోనూ వస్తుంది. ఫ్లెక్సీల మీద వస్తుంది. దీని ద్వారా గ్రామాల్లోని ప్రజలకు కూడా మహాకాలుని శక్తిని తెలియచేయడం జరుగుతుంది. ఈ ప్రదర్శన ప్రపంచంలోని 70 దేశాలలోని పట్టణాలలో జరుగుతుంది..

10. దేవసంస్కృతీ విశ్వవిద్యాలయంలో పండిత శ్రీరామశర్మ ఆచార్యుల జీవితం మీద పరిశోధనలను ఏర్పాటు చేస్తారు. దీనిలో దేశ విదేశాలలోని విద్వాంసులు పాలుపంచుకుంటారు. సాధారణ వ్యక్తులు కూడా భాగస్వాములు అవుతారు. సంస్థ ద్వారా వెలువడుతున్న పత్రికలు వారి ఆలోచనలకు అద్దం పడుతున్నాయి. ఇదంతా ఇప్పుడు www.dsvv.org, www.awgp.org వెబ్‌సైట్ లలో లభిస్తుంది. పరిశోధనా కార్యంలో ప్రతిఒక్కరూ పాల్గొనవచ్చు. ఇప్పటి వరకు చేసిన పరిశోధనాంశాలను గ్రంథస్థం చేస్తూ ఉన్నారు.

11. 1930 నుండి 1990 వరకు 60 ఏండ్లలో గురుదేవులు ఏయేదేశాలలో, ఎక్కడెక్కడ పర్యటించారో తెలియచేస్తూ ఒక చరిత్ర గ్రంథాన్ని తయారు చేస్తూఉన్నారు. ఆయాక్షేత్రాలను గాయత్రీ మయం చేసిన విధానాలను ఈ గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు. చివరి ఎనిమిది సంవత్సరాలూ శాంతికుంజ్‌లోనే ఉన్నారు. సూక్ష్మీకరణ సాధనలో నిమగ్నమై ఉన్నారు.

12. శాంతికుంజ్ పరిసరాలలో "శ్రీరామదర్శన్" అన్న పేరుతో గొప్ప ప్రదర్శనశాలను తయారు చేయాలన్న కోరిక ఉంది. అంతేకాదు "ప్రఖర ప్రజ్ఞ, సజల శ్రద్ధ" పరిసరాలను ఒక ప్రాణవంతమైన ప్రదర్శనశాలగా రూపొందించాలని ఉంది. ఆపని ప్రారంభం అయింది. గురుదేవుల జన్మభూమి అవల్‌ఖేడాలో ఒక స్మృతి మందిరాన్ని ఈ సంవత్సరమే నిర్మించాలని ప్రయత్నం జరుగుతోంది. అది ఒక విలక్షణ రీతిలో పరిజనులను ఆకర్షించనుంది.

ప్రచార సంవత్సరంలో వీటిని పూర్తి చేయాలి. తర్వాత శతాబ్ది వత్సరం చేయవలసిన వాటిని వచ్చే పత్రికలో ప్రచురిస్తాం.

★★★

## ఇది నా కర్తవ్యం

*జబల్ పూర్‌లో మతకల్లోలాలు పెచ్చు పెరిగాయి. నగరంలో కర్ఫ్యూ విధించారు. ఎప్పుడో ఒకసారి గంట, రెండుగంటలు ప్రజలను బయటకు వదిలేవారు. ఆ కొద్ది పాటి సమయంలోనే అత్యవసరమైన పనులు చేసికోవాల్సి వచ్చేది.*

*ఒక రోజున ఎమ్. హెచ్. ఖాన్ స్టేషన్ వరకు పంపించటానికి వెళ్లారు. తిరిగి వస్తూ ఉండగా కర్ఫ్యూ సడలింపు సమయం అయిపోయింది. ఇంటిదాకా వెళ్లటం చాలా కష్టం. ఎదురుగా పోలీసు వాహనం వస్తోంది. ఖాన్ సాహెబ్ ప్రక్కనున్న సందులోకి దూరిపోయాడు. కాని నిజానికది సందుకాదు. ఒక ఇంటివెనుక భాగం. ఖాన్ చాల భయపడిపోయాడు. ఇంతలో లోపలినుండి "ఎవరిది? ఎవర్నడిగి లోపలకు వచ్చావు?" కఠినంగా ప్రశ్నించటం వినిపించింది. భయంతో నోటిమాట రావటం లేదు. "నాపేరు ఎం. హెచ్. ఖరే. కొద్దిసేపట్లో వెళ్ళిపోతాను." భయం భయంగా గజగజలాడుతూ చెప్పాడు.*

*అప్పటి వరకు కఠినంగా ప్రశ్నించిన స్వరం మృదువుగా మారిపోయింది. స్నేహ పూర్వకంగా "నాయనా! రాత్రి అయిపోయింది. ఈ పరిస్థితిలో ఇంటికెలా వెళ్లుతావు? రేపు ఉదయం వెళ్లవచ్చు." అన్నాడు గృహయజమాని. తెల్లవారిందాకా బ్రతకనిస్తారో లేదోనన్న భయంతోనే రాత్రంతా అక్కడే గడిపివేశాడు.*

*తెల్లవారింది యజమాని వచ్చి "నీవిక క్షేమంగా ఇంటికి వెళ్లిపో. నీవు ముసల్మానువని రాత్రే నేను గుర్తించాను. త్రోవలో నీకేదైనా ఆపద కలుగుతుందన్న భయంతోనే నిన్ను ఆపివేశాను." అన్నాడు ఆప్యాయతగా.*

*అతని ఉదారతకు ఖాన్ సాహెబ్ కరిగిపోయాడు. వంగి పాదాలకు నమస్కరించపోయాడు. ఆ యజమాని నివారించి గట్టిగా కౌగిలించుకున్నాడు. "ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటం ఒక గృహస్తుగా నా కర్తవ్యం." అంటూ సాదరంగా సాగనంపాడు.*

**చితి జీవంలేని శరీరాన్ని దహిస్తుంది - చింత జీవంగల శరీరాన్ని దహిస్తుంది - కాళిదాసు.**

# ఏ పుస్తకంలో ఏముంది?

## సూక్ష్మీకరణ సాధన

రచయిత : **పండిత శ్రీరామ శర్మ ఆచార్య**

అనువాదం : **డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ**

మనిషి భౌతిక సామర్థ్యమునకు ఒక పరిధి ఉంటుంది. కాని అతని సూక్ష్మ సామర్థ్యం అనంతమైనది. మనిషి సూక్ష్మజగత్తులోకి ప్రవేశించినపుడు అత్యంత సామర్థ్యం గలవాడు అవుతాడు.

మనుష్యులలో ఐదు శక్తులున్నాయి. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములు. ఈ ఐదు కోశాలు జాగృతమయితే మనిషి సామర్థ్యం ఐదు రెట్లు కాక, దివ్య గణితం ద్వారా 3125 రెట్లవుతుంది. (5×5×5×5×5=3125). రామాయణంలోని హనుమంతుని పనులు ఆయన సూక్ష్మశరీర కర్తృత్వములే. ఐదు జ్ఞానేంద్రియాలే, ఐదు కర్మేంద్రియాలే, ఐదు ప్రాణాలు, మనస్సు, బుద్ధి మొత్తం 17 అవయవములతో సూక్ష్మశరీరం నిర్మించబడుతుంది.

మానవ శరీరంలో ఋషులు, దేవతలు నివాసంఉంటారు. దివ్య సముద్రములు, దివ్య నదులు, దివ్య పర్వతముల నివాసము ఈ శరీరంలోనే ఉన్నది. భౌతిక శరీరం మల, మూత్రముల నిమిత్తమైనప్పటికి, సూక్ష్మ సత్తాలో రమించగలిగితే లోకలోకాంతర ప్రతి బింబం కనిపిస్తుంది. మానవ శరీరంలో సమగ్ర బ్రహ్మాండం బీజస్థితిలో ఉన్నది. దీనిని జాగృతం చేసుకోగలిగితే, ఈ పిండంలోనే బ్రహ్మాండం ఆవిర్భవిస్తుంది. సాధకుడు తన వ్యక్తిత్వాన్ని సూక్ష్మీకరణ ద్వారా సర్వత్రా వ్యాప్తి చెందుతాడు.

ఆయుర్వేదంలో ఒక ఔషధిని నిరంతరం కల్వంలో నూరినపుడు దాని ప్రత్యేక సామర్థ్యం ఎలా ఉత్పన్నమవుతుందో చెప్తారు. హోమియోపతి వైద్యంలో మూల ద్రవ్యమును అత్యధిక సూక్ష్మీకరణ చేసి (Potentise) అధిక శక్తివంతం చేస్తారు.

పూజ్య గురుదేవులు తన సూక్ష్మీకరణ సాధనా లక్ష్యములు, ఈనాటి పరిస్థితులు, రాబోయే రోజులలో సమాజం ఎలా ఉంటుందో వివరించి, కార్యకర్తల కార్యక్రమాలు ఈ దిశలో ఉండాలని ఉద్బోధించారు.

ఈనాడు ఉన్న అణుబాంబులు, రసాయన బాంబులతో యుద్ధం జరిగితే మొత్తం ప్రపంచానికి ప్రళయం వస్తుంది. యుద్ధం అంటే ఆయుధాలు ఉపయోగించటం మాత్రమే కాదు. నిజమైన యుద్ధం ఆర్థికమైనది. కాని సూక్ష్మీకరణ సాధన వల్ల అణుయుద్ధాలు ఆగిపోవటమే గాక రాజనీతిజ్ఞులు తమ శక్తి సామర్థ్యాలతో ఏర్పాటు చేసుకున్న దేశవిభజన రేఖలన్నీ చెదరిపోతాయి. ఈనాడు ప్రపంచ పటంలో కనిపించే దేశాలు ఇకముందు ప్రత్యేకంగా కనిపించవు. ఒక విశ్వ రాష్ట్రం నిర్ధారించబడుతుంది. దానికి కావలసిన శాసన, పారిశ్రామిక, రవాణా సౌకర్యాలకు అవసరమయ్యే విభజన జరుగుతుంది. ఒకే విశ్వం, ఒకే ప్రపంచం అనేవి ఒక సిద్ధాంత పరంగా గాక వాస్తవ రూపం దాలుస్తుంది. ఇప్పుడు కావలసినది దేశభక్తి కాదు. ఒకే విశ్వం, ఒకే రాష్ట్రం గురించి ఆలోచించమంటారు గురుదేవులు.

అర్థ తంత్రంలో పెనుమార్పులు రాబోతున్నాయి. ఒక ఉత్పాదన ప్రజలకు హితకరమైనదేనని నిరూపింపబడిన తర్వాతే దానికి అనుమతి ఇవ్వబడుతుంది. (అంటే మద్యం, సిగరెట్లు ఉత్పత్తికి పర్మిషన్ ఉండదు). ముఖ్యమైన వస్తువులన్నీ కుటీర పరిశ్రమలుగా, సహకార పద్ధతిలో తీర్చిదిద్దబడతాయి. డబ్బు ఇష్టం వచ్చినట్లు సంపాదించటానికి వీలుండదు. అలాగే ఖర్చు పెట్టటానికీ వీలుండదు.

అంటే వ్యక్తిగత ఖర్చుమీద నియంత్రణ ఉంటుంది. అందువల్ల ఎలాగో అలా డబ్బు సంపాదిద్దాం అనే ఆలోచనలే రావు. సత్ప్రవృత్తుల సంవర్ధన, దుష్ప్రవృత్తుల నిర్మూలన జరిగి తీరుతుంది. ప్రతి వ్యక్తి తనను సమాజం యొక్క అంగంగా గుర్తిస్తాడు. అందరూ సంతోషకరమైన, నీతివంతమైన ఉదార, సరళ, సౌమ్య జీవన పద్ధతిలో కలసి మెలసి నవ్వుతూ నవ్విస్తూ జీవిస్తారు. ఆనందోల్లాసాలతో నిండి ఉంటారు.

షట్ చక్రములు, పంచకోశములు, మూడు గ్రంథులు, ఇడా, పింగళ, సుషుమ్న నాడులు జాగృతం అయినపుడు సాధకుడు అనంతవైభవముల స్వామి అవుతాడు. సాధన వివరములు గాయత్రి మహా విజ్ఞాన్ 3వ భాగంలో లభ్యమవుతాయి. సాధకులు సాధన చేసుకుని శక్తివంతులు కమ్మని, పృధ్వీపై స్వర్గీయ వాతావరణాన్ని నిర్మించడానికి దోహదపడమని ప్రేరణ ఇస్తుంది ఈ పుస్తకం.

★★★

**ఒక అబద్ధం చెబితే వంద అబద్ధాలు చెప్పాల్సి వస్తుంది.**

వార్తలు

# రాష్ట్రమంతటా జరిగిన వివిధ కార్యక్రమాలు

## హైదరాబాద్‌లో

పరమ పూజ్య గురుదేవుల ఆధ్యాత్మిక జన్మదినం "వసంత పంచమి" హైదరాబాద్‌లో నిర్వహించబడింది. ఉదయం 5.30 గంటలకు గాయత్రీ మంత్ర దీక్షా కార్యక్రమం శ్రీ వివేకానంద హైస్కూలులో నిర్వహించబడింది. రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన 200 మంది కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తదుపరి గాయత్రీ చేతనా కేంద్రంలో నవకుండీ గాయత్రీ యజ్ఞం, జన్మదిన సంస్కారములు, అక్షరాభ్యాస సంస్కారములు నిర్వహించబడ్డాయి.

భోజనానంతరం క్రాంతిధర్మీసాహిత్యంలోని మొదటి ఐదు పుస్తకములపై వక్తృత్వపోటీలు నిర్వహించబడ్డాయి. 18 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా శ్రీ ముక్కామల రత్నాకర్, శ్రీ రాధాకృష్ణమూర్తి, (ఛైర్మన్ వి.యస్.కె. హై స్కూల్, హైదరాబాద్) గార్లు బాధ్యత నిర్వహించారు. చి॥ అమూల్య, శ్రీమతి హైమవతీ శాస్త్రి, శ్రీమతి శారదలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

సాయంత్రం తిరిగి వివేకానంద హైస్కూలు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో శ్రీ అశ్విని సుబ్బారావు, (దక్షిణ భారత సంచాలకులు) డాక్టర్ శ్రీ మారెళ్ళ శ్రీరామకృష్ణ గారు వేదికను అలంకరించారు. శ్రీ అశ్విని సుబ్బారావు పిల్లలకు గురుదేవులందించిన సూత్రములు విద్యార్థులకు ఎటువంటి అద్భుత ఫలితాలు ఇస్తాయో తెలియచేశారు. డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ వైజ్ఞానిక ఆధ్యాత్మికత గురించి వివరించారు.

## ఎడ్లపల్లిలో మూడు కోట్ల గాయత్రీ మంత్ర పూర్ణాహుతి

డా॥ శ్రీరాం గుంటూరు జిల్లా కో కన్వీనర్ చేపట్టిన 3 కోట్ల గాయత్రీ మంత్ర జపదీక్ష 54 గ్రామాలలో వందలాది సాధకులచే 40 రోజులలో పూర్తి చేసిన శుభ సందర్భమున 54 కుండముల గాయత్రీ మహా యజ్ఞం ఎడ్లపల్లి గ్రామంలో 28.12.2009 నాడు అత్యంత వైభవంగా నిర్వహించబడింది.

ముందురోజు 27.12.2009 సాధనా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డా॥ మారెళ్ళ శ్రీరామ కృష్ణ గారు పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది కొరకు కార్యకర్తలు ఏమి చెయ్యాలో వివరంగా చెప్పారు. సాయంత్రం అత్యంత శోభాయమానంగా జరిగిన కలశయాత్రలో సుమారు 400 మంది మహిళలు పాల్గొన్నారు. తదనంతరం సహస్రదీప యజ్ఞం శ్రీమతి యల్. రాజ్యలక్ష్మి గారిచే నిర్వహించబడింది. శ్రీమతి అనసూయమ్మగారు యుగ సంగీతం ద్వారా యుగ సందేశాన్ని వినిపించారు.

28.12.2009 54 కుండముల గాయత్రీ మహాయజ్ఞం యల్. రాజ్యలక్ష్మి గారిచే నిర్వహించబడింది. దాదాపు 5000 మంది పరిజనులు అత్యంత ఆనందంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని డా॥ శ్రీరాం గారు, శ్రీమతి రజని గారు, ఇతర స్థానిక కార్యకర్తలు ఎంతో వైభవోపేతంగా నిర్వహించారు. ఈ యజ్ఞ కార్యక్రమంలో రూ॥ 2000/- గురుదేవుల సాహిత్య విక్రయం జరిగింది. 22 యుగశక్తి గాయత్రి మాసపత్రికకు చందాదారులు చేరారు. డి.ఎస్.వి.వి. పరీక్షకు 100 మందిని ప్రోత్సహించటం జరిగింది.

## నెల్లూరులో

2.12.2009 నెల్లూరు జిల్లా వరదాపురం గ్రామంలో శ్రీ కాశీనాయన స్వామి ఆశ్రమమునందు శ్రీ భాస్కర నాయుడు ఆధ్వర్యంలో, శ్రీ సిద్ధేశ్వర స్వామీజీ పర్యవేక్షణలో పంచకుండీ గాయత్రీ మహా యజ్ఞం నిర్వహించబడింది. శ్రీ రమణమూర్తి, ఐ.వి. రమణయ్య, రాగమ్మ, నారాయణమ్మ గార్లు ఈ యజ్ఞ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించారు. సుమారు 150 మంది పరిజనులు ఈ యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు.

02.12.2009 దత్తపౌర్ణమి సందర్భంగా నెల్లూరు జిల్లా వింజమూరు మండలం చంద్రపడియ గ్రామంలో, శ్రీ కాశీనాయన స్వామి ఆశ్రమమందు త్రికుండీ గాయత్రీ మహా యజ్ఞం శ్రీ భాస్కరనాయుడు, సావిత్రి గారు నిర్వహించారు. 150 మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

06.12.2009 నెల్లూరు గాయత్రీ పరివార్ జిల్లా కార్యాలయంలో పంచకుండీ గాయత్రీ మహా యజ్ఞం శ్రీ భాస్కర్ నాయుడు ఆధ్వర్యంలో శ్రీ టి. రమణమూర్తి, సరళ గార్లు నిర్వహించారు. శ్రీ ఆర్. సుబ్బరామయ్య గారు సహాయ

**కష్టాలు బలహీనుణ్ణి ఓడిస్తాయి - బలవంతుణ్ణి మరింత బలంగా చేస్తాయి.**

సహకారాలు అందించిన ఈ యజ్ఞ కార్యక్రమములో 60 మంది పరిజనులు పాల్గొన్నారు.

25.12.2009 నెల్లూరు పట్టణం సమీపములోని కల్లూరి పల్లి గ్రామంలోని శ్రీ విష్ణుమూర్తి ఆలయంలో శ్రీ భాస్కరనాయుడు ఆధ్వర్యంలో పంచకుండీ గాయత్రీ మహా యజ్ఞం శ్రీ టి. రమణమూర్తి, శ్రీమతి టి. సరళ, ఆర్ముగం, కిషోర్ సింగ్, నాగరత్నం, యం. కోటయ్య, నరసయ్య గార్లు నిర్వహించారు. సుమారు 150 మంది పాల్గొన్న ఈ కార్యక్రమానికి శ్రీ కోటం రెడ్డి శశిధర్ రెడ్డి, శ్రీ గోపాల రెడ్డి సహాయ సహకారములు అందించారు

## నారాకోడూరులో

నారాకోడూరు గాయత్రీ శక్తి పీఠంనందు శ్రీ వాసుదేవానంద (కోట సుబ్బారావుగారు) ఆధ్వర్యంలో 25.10.2009 నుండి 02.11.2009 వరకు, 24.11.2009 నుండి 02.12.2009 వరకు, 23.12.2009 నుండి 31.12.2009 వరకు, 22.1.2010 నుండి 30.01.2010 వరకు 4 సాధనా శిబిరములు నిర్వహింపబడినవి. మొదటి శిబిరంలో 11మంది సాధకులు, రెండవ శిబిరంలో 6 మంది, మూడవ శిబిరంలో 7 మంది, నాల్గవ శబిరంలో 16 మంది పాల్గొన్నారు. ఈ నాలుగు శిబిరములలో మొత్తం 2397 మాలల గాయత్రీ మంత్ర జపం జరిగింది.

19.10.2010 వసంత పంచమి సందర్భంగా ముందురోజు ఉదయం 8 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక జప కార్యక్రమంలో 20 మంది పాల్గొన్నారు.

20.01.2010 పరమపూజ్య గురుదేవుల అష్టోత్తర శత నామావళి కార్యక్రమం 25 మంది సాధకులచే జరిగింది. తదుపరి 11.30 నుంచి 12.30 వరకు సామూహిక జప సాధన నిర్వహించబడింది.

## ఒంగోలులో

13.01.2010 నాడు శ్రీమతి అరుణగారింట్లో పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది. గురుదేవుల పరిచయపుస్తకాల సెట్లు 500 వరకు వితరణ జరిగింది. గ్రామాలలో ప్రచారం చేయాలన్న సంకల్పం తీసుకున్నారు.

20.01.2010 వసంతపంచమినాడు శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల హెచ్ యమ్ వారి ఆధ్వర్యంలో 118 మంది చిన్నారులకు పలకా బలపాలను పంచి విద్యాభ్యాస సంస్కారం నిర్వహించారు. దానితో పాటు పంచకుండీయ గాయత్రీ మహా యజ్ఞం నిర్వహించబడింది. 500 మంది యజ్ఞంలో పాల్గొన్నారు.

01.02.2010నాడు కె. బింద్రుగుంట శ్రీమతి సరస్వతమ్మగారి ఇంటి ప్రాంగణంలో పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహింప బడింది. 100 మంది పాల్గొన్నారు. 30 మంది "యుగశక్తి గాయత్రి" చందాదారులుగా చేరారు. శ్రీ సరస్వతమ్మ గారు ప్రతివారం సత్సంగం నిర్వహిస్తున్నారు.

08.02.2010 నాడు ఒంగోలులో శ్రీ పణిదెపుశివరాం – విజయలక్ష్మి గార్ల వివాహదినం సందర్భంగా పంచకుండీయ గాయత్రీ మహా యజ్ఞం నిర్వహించబడింది. వారు పత్రిక చందాదారులుగా చేరారు.

పై కార్యక్రమాలనన్నింటినీ శ్రీమతి రాజ్యలక్ష్మి గారు, శ్రీ సత్యనారాయణ గారు కార్యకర్తల సహాయ సహకారాలతో నిర్వహించినారు.

## వరంగల్లులో

09.01.2010 నాడు సాయంకాలం గాయత్రీ పరివార్ ఆఫీసులో జిల్లా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ అశ్వినీ సుబ్బారావు (దక్షిణ భారత కన్వీనర్) విచ్చేసి కార్యకర్తలకు ప్రముఖమైన సందేశం అందించారు. సమయదానమహిమ, సాహిత్య ప్రచారాన్ని గూర్చి మార్గదర్శనం చేశారు. జిల్లా కన్వీనర్ శ్రీ మల్లికార్జున గుప్త మాట్లాడుతూ "మనం మారుదాం – యుగాన్ని మార్చుదాం" అని నినదించారు. 30 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

22.01.2010 రథసప్తమి సందర్భంగా 25 మంది అఖండ దీపం ఎదురుగా జపం నిర్వహించారు. శ్రీరాధాకృష్ణ మూర్తి 3 జన్మదిన సంస్కారాలు, వివాహదిన సంస్కారం నిర్వహించారు. "యుగశక్తి గాయత్రి" పత్రికకు ముగ్గురు చందాదారులను చేర్పించారు.

## మంగళగిరిలో

2009 సంవత్సరంలో మంగళగిరి విశ్వగాయత్రి పరివార్ ఆధ్వర్యంలో మంగళగిరి ఆత్మకూరు పరిసర గ్రామాలలోని 413 ఇండ్లలో దేవస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు శ్రీ పంచుమూర్తి మోహన కోటేశ్వరరావు, శ్రీ దామర్ల సాంబశివరావు, శ్రీ కొత్తమాసు నరసింహారావు, శ్రీ ఇసునూరి వెంకట తాతారావు, శ్రీమతి పి.

**బంగారంలో చిన్నముక్కకూ విలువ ఉంది - జీవితంలో ప్రతిక్షణానికీ విలువ ఉంది.**

గాయత్రి, శ్రీమతి జి. రేణుక, శ్రీ జి. దుర్గారావు, శ్రీమతి జి. లక్ష్మి, శ్రీమతి బి. శివమ్మ తదితరులు.

## తిరుపతిలో

డిసెంబర్ 2009లో జరిగిన భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్షలో చిత్తూరు జిల్లానుండి 2,112 మంది విద్యార్థులు 22 పాఠశాలల నుండి పాల్గొన్నారు. బహుమతి ప్రదానోత్సవం 30.01.2010న తిరుపతి గాయత్రీ సేవా సమితి కార్యాలయంలో జరిగింది. పరీక్షలలో ప్రతిభ కనపరచిన బి.మయూర్, ఎం. నందీశ్వర రెడ్డి, సుకన్యలకు బహుమతి ప్రదానం చేశారు.

జనవరి 2009 నుండి జనవరి 2010 వరకు యుగశక్తి గాయత్రి మాస పత్రికకు 1200 చందాదారులను చేర్చారు. 50000 రూపాయల గురుదేవుల సాహిత్య విక్రయం జరిగింది. ఇంకా 14 ఏక కుండీ యజ్ఞములు, 17 దీప యజ్ఞములు నిర్వహించారు. ఈ కార్యక్రమములన్నియూ అత్యంత శ్రద్ధగా నిర్వహిస్తున్న జిల్లా కన్వీనర్ శ్రీమతి యన్. ముని లక్ష్మమ్మ గారికి అభినందనలు.

## బెండమూర్లంకలో

31.01.2010 శ్రీ వై. సత్యనారాయణ (బాబురావు) గారింట్లో కాశీయాత్ర పూర్తి అయిన సందర్భమున శ్రీరామానంద స్వామి ఆధ్వర్యంలో పంచకుండీ గాయత్రీ మహా యజ్ఞం శ్రీమతి కె. నాగమణి నిర్వహించారు. 28 మంది గాయత్రీ మంత్ర దీక్ష స్వీకరించారు.

## చింతల పూడిలో

20.01.2010 వసంత పంచమి సందర్భమున చింతలపూడి గ్రామంలోని గాయత్రీ శక్తి పీఠమందు పంచకుండీ గాయత్రీ మహా యజ్ఞం శ్రీరామానంద స్వామి ఆధ్వర్యంలో జరిగింది.

కిష్టాయిపాలెం, చినకాకాని, నంబూరు, తాడేపల్లి కొత్తూరు, తాడేపల్లి, పొలకంపాడు, ఉండవల్లి, పెనుమాక, యర్రబాలెం, నిడమర్రు, మంగళగిరి, వడ్లపూడి మొదలైన గ్రామాలలో కార్యకర్తలు పసుపురంగు వస్త్రములు ధరించి, పాదయాత్ర చేసి వివిధ గృహములలో దేవస్థాపన కార్యక్రమం నిర్వహించారు. గాయత్రి మంత్ర కార్డులను ఇచ్చి, సాధనా విధానం వివరించారు. సత్సంగములు నిర్వహించారు.

మంగళగిరి గాయత్రి పరివార్ నిర్వహించిన ఈ కార్యక్రమం అత్యంత శ్లాఘనీయమైనది. ఇలాంటి కార్యక్రమాలు ఇంకా ఇంకా నిర్వహించాలని ఇంటింటికి గాయత్రి సాధన తీసుకెళ్తారని ఆశిస్తున్నాము.

## రాజోలులో

2010 జనవరి 3,4,5 తేదీలలో రాజోలు గ్రామం పొన్నాడ బిల్డింగ్స్‌లో సత్రయాగం పూజ్య శ్రీ రామానంద స్వామి ఆధ్వర్యంలో శ్రీమతి నాగమణి గారి పర్యవేక్షణలో నిర్వహించబడింది. ప్రతిరోజు సాయంత్రం వివిధ సంస్థల ప్రతినిధులచే ప్రవచన కార్యక్రమాలు, పూర్ణాహుతిగా చివరి రోజు పంచకుండీ గాయత్రి మహా యజ్ఞం జరిపారు. శ్రీమతి యల్. రాజ్యలక్ష్మి గురుదేవుల జీవిత చరిత్ర, గాయత్రి సాధన, యజ్ఞముల గురించి చక్కగా విశదీకరించారు. శ్రీ పొన్నాడ హనుమంతరావు గారు సత్రయాగం బాధ్యత తీసుకుని సంపూర్ణ సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భములో 1800 రూపాయల గురుదేవుల సాహిత్య విక్రయం జరిగింది.

## భీమిలిలో

20.01.2009 వసంత పంచమి శుభ సందర్భమున భీమిలి శ్రీ దుర్గా గాయత్రీ శక్తి పీఠం నందు ఉదయం 8 గంటల నుండి 9 వరకు సామూహిక గాయత్రీ జపం, 10.30 నుంచి పంచకుండీ గాయత్రీ మహా యజ్ఞం శ్రీ చంద్రశేఖరం ఆధ్వర్యంలో శ్రీమతి భారతి నిర్వహించారు. ఈ సందర్భమున పూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది ప్రాముఖ్యత గురించి, దాని కొరకు కార్యకర్తలను సమాయత్త పరచుట గురించి తగిన సూచనలు ఇవ్వటం జరిగింది. సుమారు 25 మంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చొప్పదండి గ్రామంలో

జనవరి 2010 15,16,17 తేదీలలో చొప్పదండి గ్రామంలో శ్రీ గోరంట నారాయణ గారి గృహమునందు ఉదయం, సాయంత్రం 108 గాయత్రి మంత్ర ఆహుతులతో గాయత్రీ యజ్ఞమును శ్రీ శ్రద్ధానంద ఆర్యా నిర్వహించగా శ్రీ సులువ రంగయ్య, సులువ సంతోష్ కుమార్, రామస్వామి గారు సహాయ సహకారములు అందించారు.

## వైదేహినగర్‌లో

15.02.10 నాడు సూర్య గ్రహణం సందర్భంగా గాయత్రీ, శ్రీ మహాలక్ష్మీ యజ్ఞం నిర్వహించబడింది. 30.1.10 నాడు పౌర్ణమి సందర్భంగా హైదరాబాద్ వైదేహీ నగర్‌లోని గాయత్రీ ప్రజ్ఞామండలిలో 25 మంది సభ్యులతో ధ్యానం నిర్వహించ బడింది. వీరి ద్వారా ప్రతి ఆదివారం గాయత్రీ మహా యజ్ఞం నిర్వహింపబడుతోంది.

**ప్రతీ జీవి తనను తాను తెలుసుకునే ప్రయత్నం చేయాలి.**

## మియాపూర్‌లో

16.01.2010 హైదరాబాద్‌లోని మియాపూర్‌లో సుబ్బులు గారి ఇంట్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన అఖండ గాయత్రి మంత్ర జప సాధనలో సుమారు 50 మంది పాల్గొన్నారు. తదనంతరం గాయత్రీ హారతి, నైవేద్యం జరిగాయి. డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ గారు వైజ్ఞానిక అధ్యాత్మికపై ప్రవచనం ఇచ్చారు.

## వ్యాఘ్రేశ్వర గ్రామంలో

21.01.2010 వ్యాఘ్రేశ్వర గ్రామం నందు నూతన కళ్యాణ మండప ప్రారంభోత్సవ సందర్భమున పంచకుండీ గాయత్రీ మహా యజ్ఞం శ్రీ రామానంద స్వామి ఆధ్వర్యంలో గాయత్రి, దుర్గ గార్లు నిర్వహించారు. సుమారు 200 మంది పరిజనులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అమలాపురంలో

20.01.2010 వసంత పంచమి శుభ సందర్భమున అమలాపురం గీతా ఆశ్రమమునందు శ్రీ రామానంద స్వామి ఆధ్వర్యంలో 24 కుండముల గాయత్రీ మహా యజ్ఞం అత్యంత వైభవంగా నిర్వహించారు. సుమారు 200 మంది పరిజనులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పాండిచ్చేరిలో

01.01.2010 నాడు పాండిచ్చేరిలో శ్రీచక్ర మారిటైన్ కాలేజీలో 100 మంది విద్యార్థులు, లెక్చరర్లతో పంచ కుండీయ గాయత్రీ మహా యజ్ఞం నిర్వహించబడింది. కాలేజీ డైరెక్టర్ ఉషా శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో శ్రీ.బి. సత్యనారాయణ రావు నిర్వహించారు. పత్రికకు 4 చందాదారులను చేర్పించారు.

**దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం, హరిద్వార్ వారి**

దూరస్థ విద్యా కోర్సు (Distance Education) "వ్యక్తిత్వ పరిష్కారము" పరీక్షకు (Personality Refinement) నూతన బ్యాచ్‌లు ప్రారంభమైనవి. కోర్సు వివరములకు, అప్లికేషన్‌ల కొరకు సంప్రదించవలసినది.

**వినపాముల సీతారాం, కో ఆర్డినేటర్**

**ఫోన్ : 9848979969, 9490935988, 9963578680**

## అందరికీ ఆహ్వానం - తెలుగువారికి ప్రత్యేక శిబిరం

శాంతికుంజ్ హరిద్వార్ నందు 29.04.2010 నుండి 07.05.2010 వరకు 9 రోజులు తెలుగువారికి ప్రత్యేకంగా తెలుగులో "సంజీవనీ సాధనా" శిబిరం నిర్వహించబడుతుంది. శిబిరములో పాల్గొనదలచినవారు ఉత్తరము, ఈ-మెయిల్ ప్యాక్స్ ద్వారా గాని, తమ పూర్తి పేరు, చిరునామా, వయస్సు, విద్యార్హత, వృత్తి, ఫోన్ నెం, ఈ-మెయిల్ మొదలైన వివరములు తెలుపుతూ హరిద్వార్ నుండి అనుమతి పత్రాన్ని పొందగలరు. పాల్గొన దలచినవారు క్రింద ఈయబడిన సూచనలను తప్పక పాటించవలసి ఉంటుంది.

(1) వయస్సులో పెద్దవారు, శారీరికముగా బలహీనులు, దీర్ఘకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు, అంటువ్యాధులు కలవారు శిబిరమునకు అనుమతించబడరు. (2) ఆశ్రమమంలో **రెండవ లేక మూడవ అంతస్థులలో** మాత్రమే వసతి లభించును. (3) దగ్గరలో ఉన్న తీర్థక్షేత్రములు కేదార్, బదరీలకు వెళ్లదలచిన వారు **9 రోజులు తర్వాతనే అనుమతి లభించును.** (4) శిబిరములో పాల్గొనెడి సాధకులు తమ తమ **పాస్ పోర్ట్ సైజు ఫొటోను వెంట తెచ్చుకోవలెను. కుంభమేళా సందర్భంగా రక్షణ నిమిత్తమై రేషన్ కార్డుగాని, ఓటరు గుర్తింపు కార్డుగాని, డ్రైవింగ్ లైసెన్సుగాని దగ్గర ఉంచుకొనగలరు.** (5) గడిచిన మూడు నెలల్లో కార్యకర్తలు నిర్వహించిన కార్యక్రమాల పూర్తి వివరణ, తమ ప్రజ్ఞా లేక మహిళా మండళ్ల ప్రగతి నివేదిక, **తమ ప్రాంతములో నిర్వహించిన 5,9,24,51 కుండీల యజ్ఞముల రిపోర్టు, వాటికి సంబంధించిన ఫొటోలు వెంటతీసుకుని రాగలరు.** (6) పురుషులు ధోవతి, (పంచ) లాల్చి, (సాధ్యమైనంత వరకు పచ్చవి) అలాగే స్త్రీలు చీర, మంత్రశాలువా, సంచి, నోట్ పుస్తకం, పెన్ను తమ వెంట తెచ్చుకొనగలరు. (7) కుంభమేళలో పాల్గొనదలచినవారు 28వ తేది వరకు ఉండవలెను.

**సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు :**

**వేణుగోపాల్‌రెడ్డి (హైదరాబాద్) : 9949111175, 040-23700722**

**హరిద్వార్ : (01334) 260602, 260309**

**నారి లేని ఇల్లు, విల్లు రెండూ వ్యర్థమే.**